సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16 వెల: ₹ 5.00

సంపుటి: 12
సంచిక: 151

బుధవారం 21-8-2019

'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

ప్రణయ్ సంచలనం

ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ 2వ రౌండ్‌లో లిన్ డాన్‌పై విజయం - స్పోర్ట్స్‌లో

కొనసాగుతున్న పసిడి పరుగు

జీవితకాల గరిష్టస్థాయికి ధర... ఢిల్లీలో 10గ్రా. ధర రూ.38,770 - బిజినెస్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

ఇమ్రాన్.. జాగ్రత్తగా మాట్లాడండి!

భారత్‌పై చేసే వ్యాఖ్యల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పాక్ ప్రధాని ఇమ్రాన్‌కు సూచించినట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ వెల్లడించారు. ఈ మేరకు అధ్యక్ష భవనం ఓ ప్రకటనలో పేర్కొంది. - 5లో

ఎట్టకేలకు యెడ్డీ కేబినెట్

కర్ణాటక ముఖ్యమంత్రి యెడియూరప్ప తన కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. 17 మంది సభ్యులకు మంత్రివర్గంలో చోటు కల్పించారు. బెంగళూరులోని రాజ్‌భవన్‌లో గవర్నర్ వజుభాయివాలా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. - 5లో

చిదంబరం కస్టడీ అవసరం

కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం ఐఎన్‌ఎక్స్ మీడియా కేసులో ప్రధాన నిందితుడని ప్రాథమికంగా తెలుస్తోందనీ, ఆయనను కస్టడీలోకి తీసుకొని విచారణ జరపాల్సిన అవసరం ఉందని ఢిల్లీ హైకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. - 5లో



మామ దారిలోకి..

అంతరిక్ష చరిత్రలో భారత్.. తన కోసం మరికొన్ని పుటలను లిఖించుకుంది. చంద్రయాన్-2 ప్రయోగంలో మంగళవారం కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి 'బాహుబలి' ప్రవేశించింది. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మంగళవారం చేపట్టిన ఆపరేషన్ విజయం సాధించింది.

ఇప్పటిదాకా జరిగింది ఇదీ..

- ఈ ఏడాది జూలై 22న చంద్రయాన్-2ను ఇస్రో విజయవంతంగా అంతరిక్షంలోకి జీఎస్ఎల్వీ మార్క్-3 రాకెట్ ద్వారా ప్రయోగించింది.
- జూలై 15న ప్రయోగం జరగాల్సి ఉండగా.. సాంకేతిక సమస్యల కారణంగా వాయిదా పడింది.
- జూలై 24, 26, ఆగస్టు 2, 6వ తేదీల్లో అంతరిక్ష నౌకను విడతల వారీగా మన భూమి నుంచి దూరంగా పంపేందుకు నౌక ప్రయాణించే కక్ష్య ఎత్తును పెంచుకుంటూ పోయారు.
- ఆరో విడతలో ఈనెల 14న చంద్రుడి కక్ష్య గతి మార్గంలోకి మళ్లించారు. 20న చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించింది.

ఇకపై జరగబోయేది ఇదీ...

- ఈనెల 21, 28, 30, సెప్టెంబర్ 1వ తేదీల్లో అంతరిక్ష నౌక చంద్రుడి దగ్గరికి వెళ్లేందుకు మెల్లగా కక్ష్య దూరాన్ని తగ్గిస్తూ వస్తారు.
- చివరకు సెప్టెంబర్ 7న ప్రజ్ఞాన్ రోవర్‌తో కూడిన విక్రమ్ ల్యాండర్ (1,471 కేజీల బరువు) చంద్రుడిపై అడుగుపెడుతుంది.
- ఆ తర్వాత ల్యాండర్ నుంచి ప్రజ్ఞాన్ రోవర్ విడిపోయి, చంద్రుడిపై అన్వేషణ ప్రారంభిస్తుంది.
- ల్యాండర్, రోవర్ చంద్రుడి ఉపరితలంపై 14 రోజుల పాటు పనిచేస్తుందని భావిస్తున్నారు.
- చంద్రయాన్ ఆర్బిటర్ మాత్రం చంద్రుడి కక్ష్యలో తిరుగుతూ.. అక్కడి విశేషాలను ఎప్పటికప్పుడు భూమిపైకి పంపుతూ ఉంటుంది.

5 లో

'ప్రక్షాళన' పట్టించుకోరా?

భూ రికార్డులపై కుప్పలుతెప్పలుగా ఫిర్యాదులొస్తున్నాయి

- అక్రమాలు జరుగుతుంటే మీరేం చేశారు?
- చిన్న జిల్లాలపైనా పట్టు సాధించలేరా?
- కలెక్టర్లపై ముఖ్యమంత్రి కేసీఆర్ మండిపాటు
- కొత్త చట్టాలపై కలెక్టర్లతో సుదీర్ఘ సమావేశం

మంగళవారం ప్రగతిభవన్‌లో కలెక్టర్ల సమావేశంలో మాట్లాడుతున్న కేసీఆర్. చిత్రంలో సీఎస్ జోషి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ-రికార్డుల ప్రక్షాళనలో భారీగా అవకతవకలు చోటుచేసుకుంటుంటే ఎందుకు ప్రేక్షకపాత్ర వహించారని ముఖ్యమంత్రి కేసీఆర్.. జిల్లాల కలెక్టర్లపై మండిపడ్డారు. క్షేత్ర స్థాయిలో వీఆర్ఓలు, తహశీల్దార్లు అక్రమాలకు పాల్పడుతుంటే మీరేందుకు చర్యలు తీసుకోలేకపోయారని కలెక్టర్లను సూటిగా ప్రశ్నించారు. పరిపాలన సౌలభ్యం కోసం ఏర్పాటు చేసిన చిన్న జిల్లాలపైనా కలెక్టర్లు పట్టు సాధించలేకపోతే ఎలాగంటూ కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. భూ ప్రక్షాళనపై కుప్పలు తెప్పలుగా ఫిర్యాదులొస్తున్నా.. మీరేం చేస్తున్నారంటూ కలెక్టర్లకు క్లాస్ పీకారు. మంగళవారం ప్రగతిభవన్‌లో జిల్లా కలెక్టర్లతో సుదీర్ఘంగా సమావేశమైన సీఎం.. కొత్త రెవెన్యూ చట్టం తయారీపై సలహాలను స్వీకరించడంతో పాటు కొత్త పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఉదయం 11.45 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దాదాపు 8 గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో కేసీఆర్ పలుమార్లు కలెక్టర్ల పనితీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. క్షేత్రస్థాయి అధికారుల పనితీరుపై కలెక్టర్ల పర్యవేక్షణ లోపించిందని, పంచాయతీరాజ్ చట్టం తీసుకొచ్చి 50రోజులైనా అమలు చేయడంలో ఎలాంటి ప్రగతీ లేదని సీఎం ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది. ఈ సమావేశానికి సంబంధించి సీఎంవో ఎలాంటి ప్రకటనా జారీ చేయలేదు.

ఇక సత్వర రెవెన్యూ సేవలు

కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనలో భాగంగా అంశాలవారీగా కలెక్టర్ల నుంచి అభిప్రాయాలు,

మిగతా 2వ పేజీలో ▶

నానుడి

పన్లో పని అక్రమ వరదలందాం సార్! మనకూ కుదురుతుంది!!

అడ్డగోలు 'సేవ'లొద్దు!

- కొత్త మీ-సేవ కేంద్రాలకు అనుమతిపై సర్కార్ సీరియస్
- వీటికోసం జారీచేసిన నోటిఫికేషన్లు రద్దు
- ఉన్నవాటికే నిర్వహణ వ్యయం రాకపోవడంతో ఈ నిర్ణయం
- కలెక్టర్లకు ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ లేఖ
- ఇప్పటికే రాష్ట్రంలో 4,500 పైచిలుకు మీ-సేవ కేంద్రాలు

- వివరాలు 2లో

ఆరోగ్యశ్రీ మళ్లీ షురూ

ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలతో ప్రభుత్వ చర్చలు సఫలం

బకాయిల విడుదలకు మంత్రి ఈటల రాజేందర్ హామీ

ఆసుపత్రులకు ఇకపై ప్రతినెలా నిధులు విడుదల చేస్తామని వెల్లడి

ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌తో ఉన్న ఎంవోయూను సరళీకరించేందుకు త్వరలో కమిటీ

నేటి నుంచి యథావిధిగా ప్రైవేటు ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులు సమ్మె విరమించాయి. బకాయిల విడుదలకు ఆరోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్ హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నట్లు ఆసుపత్రుల అసోసియేషన్ ప్రతినిధులు ప్రకటించారు. మంగళవారం రాత్రి సచివాలయంలో మంత్రి ఈటలతో తెలంగాణ నెట్‌వర్క్ ఆసుపత్రుల సంఘం (తన్హా) ప్రతినిధులు మరోసారి చర్చలు జరిపారు. నిధుల విడుదలకు మంత్రి హామీ ఇవ్వడంతో సమ్మె విరమిస్తున్నామని డాక్టర్లు ప్రకటించారు. దీంతో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి. చర్చల అనంతరం ఈటల మాట్లాడుతూ ఇకపై ప్రతినెలా ఆసుపత్రులకు ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్ నిధులు విడుదల చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. సాధ్యమైన మేర బకాయిలు ఎక్కువగా లేకుండా చూస్తామన్నారు. గతంలోలాగా కాకుండా ఎప్పటికప్పుడు హాస్పిటళ్ల యాజమాన్యాలతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌తో హాస్పిటళ్లకు ఉన్న ఎంవోయూ వందల పేజీలతో గందరగోళంగా ఉందని, దీన్ని సరళీకరించేందుకు త్వరలోనే కమిటీ వేస్తామన్నారు. వైద్య సేవల ప్యాకేజీలను కూడా సమీక్షిస్తామన్నారు. అటు ఆసుపత్రులకు, ఇటు రోగులకు ఇబ్బందులు లేకుండా ఆరోగ్యశ్రీని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఆయుష్మాన్ భారత్ కంటే ఆరోగ్యశ్రీ మెరుగైన పథకం అన్నారు. ఆయుష్మాన్‌తో రాష్ట్రంలోని 25 లక్షల కుటుంబాలకే

మిగతా 2వ పేజీలో ▶

నల్లగొండ జిల్లా పెద్దవూర మండలంలో ఎండిపోయిన చింతపల్లి చెరువు

చెరువుకు నీటి కరువు

కృష్ణా బేసిన్‌లో ప్రాజెక్టులు నిండినా.. చెరువులు మాత్రం ఖాళీ

23 వేలకుగాను నిండినవి 300లు మాత్రమే

21 వేల చెరువుల్లో 25 శాతంకన్నా తక్కువ నీటి రాక

సాక్షి, హైదరాబాద్:

కృష్ణా బేసిన్ ప్రాజెక్టులు ఓవైపు వరద ఉధృతితో జలకళను సంతరించుకుంటే... గ్రామీణ వ్యవసాయానికి పట్టుగొమ్మల్లాంటి చెరువులు మాత్రం చిన్నబోతున్నాయి. ఏటా ఈ సమయానికల్లా నీటితో కళకళలాడాల్సిన చెరువులన్నీ తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా వట్టిపోతున్నాయి. రాష్ట్రంలో 44 వేలకుపైగా ఉన్న చెరువుల్లో ఏకంగా 26 వేల పైచిలుకు చెరువుల్లో నీటి జాడ కానరావడం లేదు. ముఖ్యంగా కృష్ణా బేసిన్‌లోని పూర్వ మహబూబ్‌నగర్, నల్లగొండ, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లోనే 21 వేలకు పైగా చెరువులు పూర్తిగా నీటి కరువుతో అల్లల్లాడుతున్నాయి.

కృష్ణా బేసిన్‌లో గుండె చెరువు..

ఎగువ నుంచి భారీ వరద ప్రవాహాల కారణంగా జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టులు కేవలం 15 రోజుల్లోనే పూర్తి స్థాయిలో నిండాయి. అయితే పరీవాహకంలో వర్షాలు పెద్దగా లేకపోవడంతో కృష్ణా బేసిన్ పరిధిలోని చెరువుల పరిస్థితి దారుణంగా ఉంది. మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, మేడ్చల్, రంగారెడ్డి, వికారాబాద్, వనపర్తి, గద్వాల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి జిల్లాల్లో మొత్తంగా 23,608 చెరువులు ఉండగా ఇందులో 21,133 చెరువుల్లో 25 శాతం కన్నా తక్కువ నీరే చేరింది. 25 నుంచి 50 శాతం మాత్రమే నీరు చేరిన చెరువులు 1,656 వరకున్నాయి. 524 చెరువుల్లో 50 నుంచి 75 శాతం నీరుండగా, కేవలం 295 చెరువుల్లో 75 శాతానికి పైగా నీరు చేరింది. గద్వాల్, వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాలో 85 శాతం చెరువులు చుక్కనీటికి నోచుకోలేకపోయాయి. పూర్వ రంగారెడ్డి జిల్లా పరిధిలో 3,791 చెరువులకు గానూ 3,611 చెరువులు ఖాళీగానే ఉన్నాయి. చెరువుల్లోకి నీరు చేరకపోవడంతో కృష్ణా బేసిన్ పరిధిలో మొత్తంగా 11 లక్షల ఎకరాలపై ప్రభావం పడుతోంది. చివరికి గణేశ్ విగ్రహాల నిమజ్జన సమయానికైనా చెరువులు నిండుతాయా? అన్నది పెద్ద ప్రశ్నగా మారింది. కృష్ణా బేసిన్‌తో పోలిస్తే గోదావరిలో కొద్దిగా మెరుగైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. బేసిన్లో 20వేలకుపైగా ఉన్న చెరువుల్లో 9 వేలకు పైగా చెరువులు పూర్తిస్థాయి జలకళను సంతరించుకున్నాయి. మరో 6 వేల చెరువుల్లో చెప్పుకోదగ్గ స్థాయిలో నిల్వలున్నాయి. అయితే ఇప్పుడిప్పుడే కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, జూరాల, కోయిల్ సాగర్ కాల్వల ద్వారా చెరువులు నింపుతున్నారు. సాగర్ కింద సైతం ఆయకట్టుకు నీటి విడుదల మొదలైంది. ఈ నీటిని కొన్ని చోట్ల చెరువులకు మళ్లిస్తున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా ఇలాగే నీటి ఎత్తిపోతలు కొనసాగితే వెయ్యికి పైగా చెరువులను నింపే అవకాశం ఉంది.

మా వాళ్లకు 25% సీట్లు

అలాగైతేనే ప్రైవేటు యూనివర్సిటీ



- హెచ్ఎండీఏ పరిధిలో ఉంటే 20 ఎకరాలు మిగతా ప్రాంతాల్లో 30 ఎకరాల స్థలం తప్పనిసరి
- కార్పస్ ఫండ్ కింద రూ. 10 కోట్లు, వసతుల కల్పనకు రూ. 30 కోట్ల ఫిక్స్‌డ్ డిపాజిట్
- ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు సర్కారు మార్గదర్శకాలు ఖరారు
- డీపీఆర్, ప్రతిపాదనలు పరిశీలించేందుకు నిపుణుల కమిటీ
- నోటిఫికేషన్ జారీ చేసిన ప్రభుత్వం

సాక్షి, హైదరాబాద్

రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ అయింది. ఆసక్తి కలిగిన విద్యాసంస్థలు మంగళవారం నుంచే దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ బి.జనార్దన్‌రెడ్డి యూనివర్సిటీల ఏర్పాటుకు అమలు చేయనున్న మార్గదర్శకాలతో నోటిఫికేషన్‌ను (జీవో నెంబరు 26) జారీ చేశారు. గత నెలలో 15వ తేదీన ప్రైవేటు యూనివర్సిటీల చట్టాన్ని అమల్లోకి తెచ్చిన ప్రభుత్వం మంగళవారం యూనివర్సిటీల ఏర్పాటుకు అనుసరించాల్సిన నిబంధనలను (తెలంగాణ స్టేట్ ప్రైవేటు యూనివర్సిటీస్ (ఎస్టాబ్లిష్‌మెంట్ అండ్ రెగ్యులేషన్) రూల్స్-2019) జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ప్రైవేటు యూనివర్సిటీల ఏర్పాటుకు దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఇందుకోసం ఆసక్తి కలిగిన విద్యాసంస్థలు రూ.50 వేలను ఇంటర్నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించి దరఖాస్తు ఫారాన్ని తెలంగాణ ఉన్నత విద్యా మండలి వెబ్‌సైట్ www.tsche.ac.inలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని నోటిఫికేషన్‌లో ప్రభుత్వం వెల్లడించింది. అయితే రాష్ట్రంలో ఏర్పాటుచేసే యూనివర్సిటీల్లో రాష్ట్ర విద్యార్థులకు 25% సీట్లు కచ్చితంగా కేటాయించాల్సిందేనని నిబంధనల్లో పొందుపరిచింది. ఆసక్తి కనబరుస్తున్న

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

ఆ కులాలకు ఎస్సీ హోదా కల్పించాలి

సామాజిక తెలంగాణ ఓబీసీ జేఏసీ

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఓబీసీ జాబితాలో ఉన్న రజక, గంగపుత్రులు, ముదిరాజ్ తదితర కులాలకు ఎస్సీ హోదా కల్పించాలని సామాజిక తెలంగాణ ఓబీసీ జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు సంఘం ప్రతినిధి రామనరసయ్య మంగళవారం ఢిల్లీలో జాతీయ బీసీ కమిషన్ సభ్యురాలు సుధాయాదవ్‌ను కలసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఉత్తర భారతదేశంలో ఈ కులాలు ఎస్సీ జాబితాలో ఉన్నాయని, తెలుగు రాష్ట్రాల్లో మాత్రం ఓబీసీ జాబితాలో కొనసాగుతున్నాయన్నారు. వీరందరికీ దేశంలో ఒకే సామాజిక హోదా కల్పించాలని కోరారు.

విద్యార్థుల సమస్యలపై రేపు కలెక్టరేట్ల ముట్టడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో పాఠశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 22వ తేదీన జిల్లా కలెక్టరేట్ల ముట్టడి చేపట్టనున్నట్లు విద్యార్థి జన సమితి ఒక ప్రకటనలో తెలిపింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాల నిర్మాణం వెంటనే చేపట్టాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని, ప్రతి నియోజకవర్గంలో బాలికలు, బాలురకు కొత్తగా కాలేజీ సంక్షేమ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని పేర్కొంది.

మార్క్‌ఫెడ్‌కు మినుములు, సోయా కొనుగోలు బాధ్యత

సాక్షి, హైదరాబాద్: 2019-20 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో రాష్ట్రంలో పండించే మినుములు, సోయాబీన్ ఉత్పత్తులను కేంద్ర మార్కెటింగ్ సంస్థల ద్వారా సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు మినుములు, సోయాబీన్‌ను మద్దతు ధరకు కొనుగోలు చేయడంలో కేంద్ర మార్కెటింగ్ సంస్థ మార్క్‌ఫెడ్‌ను నోడల్ ఏజెన్సీగా ప్రభుత్వం నియమించింది. రైతులకు మద్దతు ధర కల్పించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వ్యవసాయ శాఖ ప్రకటించింది.

నేడు, రేపు రాష్ట్రంలో మోస్తరు వర్షాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో నేడు, రేపు చాలాచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆగ్నేయ ఉత్తరప్రదేశ్, దానిని ఆనుకుని ఉన్న జార్ఖండ్, బిహార్ ప్రాంతాల్లో అల్పపీడనం కొనసాగుతోందని, దీనికి అనుబంధంగా 7.6 కి.మీ ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని పేర్కొంది. ఈ అల్పపీడనం మధ్య ప్రాంతం నుంచి ఉత్తర తమిళనాడు వరకు, ఒడిశా, ఉత్తర కోస్తా ఆంధ్ర మీదుగా 0.9 కి.మీ ఎత్తు వరకు ఉత్తర-దక్షిణ ద్రోణి ఏర్పడిందని వాతావరణ కేంద్రం తెలిపింది.

'ఫిషింగ్ ఈ-మెయిళ్లతో జాగ్రత్త'

సాక్షి, హైదరాబాద్: మీ ఈ-మెయిల్ ఖాతా నిలిపివేశామంటూ వచ్చే మోసపూరిత (ఫిషింగ్) ఈ-మెయిళ్లను నమ్మవద్దని డీజీపీ మహేందర్‌రెడ్డి సూచించారు. అలాంటి ఈ-మెయిళ్లను కొన్ని లక్షణాలతో కనిపెట్టవచ్చన్నారు. సంస్థ పేరిట కాకుండా వ్యక్తి పేరిట ఈ-మెయిల్ ఐడీ ఉండటం, మీ పేరుతో కాకుండా వినియోగదారుడా అంటూ సంబోధించడం, ఇతర సైట్లను కలిపేలా పలు లింకులు జతచేయడం, సందేశంలో అక్షరదోషాలు ఉంటాయని వివరిస్తూ ట్వీట్ చేశారు.

రాష్ట్రపతితో గవర్నర్ నరసింహన్ భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ మంగళవారం ఢిల్లీలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో సమావేశమైనట్లు తెలిసింది. సుమారు గంటపాటు జరిగిన వీరి భేటీలో త్వరలో జరగనున్న అన్ని రాష్ట్రాల గవర్నర్ల సమావేశంపై చర్చించుకున్నట్లు సమాచారం.

రేపు వ్యవసాయ వర్సిటీ 'ఎన్‌సీసీ' కౌన్సెలింగ్

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం వివిధ డిప్లొమా కోర్సుల్లో, వ్యవసాయ, వెటర్నరీ, ఉద్యాన డిగ్రీ కోర్సుల ఎన్‌సీసీ కేటగిరీ సీట్ల కౌన్సెలింగ్ ఈ నెల 22న నిర్వహిస్తున్నట్లు రిజిస్ట్రార్ ఎస్.సుధీర్‌కుమార్ తెలిపారు. ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఆఫీసర్స్ సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తామని,, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. ఒరిజినల్ సర్టిఫికెట్లు తీసుకుని నిర్ణీత ఫీజు డిప్లొమా కోర్సులకు రూ.12 వేలు (యూనివర్సిటీ పాలిటెక్నిక్), రూ.16 వేలు (ప్రైవేటు పాలిటెక్నిక్).. డిగ్రీ కోర్సులకైతే రూ.36,450తో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని తెలిపారు. ఎన్‌సీసీ ఆఫీసర్లు ప్రాధాన్యతలను సూచిస్తారని, తర్వాత సీట్లను ప్రాధాన్యతల ఆధారంగా, టీఎంసెట్-2019 ర్యాంకుల ప్రకారంగా భర్తీ చేస్తారని వెల్లడించారు. కౌన్సెలింగ్ పూర్తి వివరాలకు www.pjtsau.edu.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

మంగళవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో జరిగిన సమావేశానికి హాజరైన కలెక్టర్లు, అధికారులు

'ప్రక్షాళన' పట్టించుకోరా?

▶ మొదటి పేజీ తరువాయి

సలహాలను సీఎం స్వీకరించారు. అవినీతి లేకుండా రెవెన్యూ వ్యవహారాలు ఎలా నడపాలి? రైతులకు సత్వర సేవలు ఎలా అందించాలి? భూ రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత 24 గంటల్లోపే రైతు ఇంటికి పాస్‌బుక్ వెళ్లాలంటే ఏం చేద్దాం? అన్న అంశాలపై కలెక్టర్ల అభిప్రాయాలను సేకరించారు. ఈ క్రమంలో రెవెన్యూకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ల చేతికి ప్రశ్నావళిని ఇచ్చి సమాధానాలను రాబట్టుకున్నట్లు తెలిసింది.

వీఆర్ఓ, తహశీల్దార్ల అధికారాలకు చెక్

గ్రామ రెవెన్యూ అధికారులు (వీఆర్వో), తహశీల్దార్ల అధికారాలకు కత్తెర పడడం ఖాయంగా కనబడుతోంది. పట్టాదారు పాస్ పుస్తకాలు, మ్యూటేషన్లు, విరాసత్ వంటి అవసరాల కోసం వచ్చే రైతులు, సామాన్య ప్రజలను.. క్షేత్రస్థాయిలో వీఆర్ఓలు, తహశీల్దార్లు లంచాల కోసం వేధింపులకు గురిచేయడం నిత్యకృత్యంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం తీవ్ర నిర్ణయానికి సిద్ధమైనట్లు తెలిసింది. కొత్త రెవెన్యూ చట్టం లక్ష్యాలు, ప్రాధాన్యతపై సీఎం కేసీఆర్.. కలెక్టర్ల సమావేశంలో వివరిస్తున్న సందర్భంగా ఈ అంశాలు ప్రస్తావనకు వచ్చినట్లు సమాచారం. గ్రామ రెవెన్యూ రికార్డుల సంరక్షకులుగా ఉండాల్సిన వీఆర్వోలే వాటిని తారుమారు చేసి ఒకరి భూములను మరొకరికి కట్టబెట్టుతున్న వైనంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భూ-రికార్డుల పరిరక్షణతో పాటు భూములకు సంబంధించిన అన్ని రకాల బాధ్యతల నుంచి వీఆర్ఓలను తప్పించాలనే నిర్ణయానికి సీఎం వచ్చినట్లు సమాచారం. కొత్త రెవెన్యూ చట్టం వచ్చాక వీఆర్ఓలు భూమియేతర వ్యవహారాలకే పరిమితం కానున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు లబ్ధిదారుల ఎంపిక, కుల, ఆదాయ తదితర ధ్రువీకరణ పత్రాల జారీకి విచారణ జరిపే బాధ్యతలను మాత్రమే వీఆర్వోలకు కట్టబెట్టాలని సర్కారు యోచిస్తోంది. తహశీల్దార్ల అధికారాలకు సైతం కోత పెట్టి జాయింట్ కలెక్టర్లకు కీలక అధికారాలను అప్పగించాలని భావిస్తున్నట్లు తెలిసింది.

సెప్టెంబర్ 10న మళ్లీ పిలుస్తా

కొత్త పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలు, హరితహారం కార్యక్రమం అమలు పురోగతిని సమీక్షించేందుకు సెప్టెంబర్ 10న జిల్లా కలెక్టర్లతో మరోసారి సమావేశం నిర్వహించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించినట్లు తెలిసింది. ఆలోగా మంచి పురోగతి సాధించి రావాలని కలెక్టర్లకు ఆదేశించినట్లు సమాచారం.

నేడు కోమటిబండకు సీఎం,కలెక్టర్లు

సాక్షి, హైదరాబాద్: గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండను సీఎం కేసీఆర్‌తోపాటుగా అన్ని జిల్లాల కలెక్టర్లు సందర్శిస్తున్నారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సీఎం నియోజకవర్గంలో గజ్వేల్‌లో హరితహారం కింద చేపట్టిన కార్యక్రమాలను జిల్లాల కలెక్టర్లు, ఇతర శాఖల అధికారులతో కలిసి సీఎం పరిశీలిస్తారు. బుధవారం ఉదయం హైదరాబాద్ నుంచి అధికారుల బృందం బయలుదేరి గజ్వేల్ నియోజకవర్గంలోని కోమటిబండ సహా వివిధ ప్రాంతాల్లో పర్యటించనుంది. మధ్యాహ్నం అక్కడే భోజనం చేసి సాయంత్రానికి ఈ బృందం నగరానికి చేరుకుంటుందని అధికారవర్గాలు వెల్లడించాయి. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 60రోజుల పచ్చదనం, పరిశుభ్రత కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా హరితహారం కింద సీఎం నియోజకవర్గంలో అమలుచేసిన కార్యక్రమాలు, సాధించిన ఫలితాలను గురించి ఈ పర్యటనలో వివరిస్తారు. గజ్వేల్‌లో గత మూడు, నాలుగేళ్లలో సహజ అడవి పునరుద్ధరణ (అటవీ భూముల సంరక్షణ) చర్యలు విజయవంతమైన సంగతి తెలిసిందే. ఈ నియోజకవర్గంలోని దాదాపుగా అన్ని గ్రామాల్లో హరితహారం కింద చేపట్టిన కార్యక్రమాలు సత్ఫలితాలు ఇవ్వడం, దాదాపు మూడేళ్ల క్రితం కోమటిబండ వద్ద మిషన్ భగీరథ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేసినపుడు 'అవెన్యూ ప్లాంటేషన్'కింద రోడ్డుకు ఇరువైపులా నాటిన మొక్కలు ఏపుగా పెరగడంతో వాటిని ఈ బృందం పరిశీలించనుంది. గతంలోనూ సీఎం సూచనల మేరకు కలెక్టర్ల బృందం కోమటిబండను సందర్శించి అక్కడ హరితహారం, ఇతర కార్యక్రమాలను పరిశీలించి వచ్చిన సంగతి విదితమే.

పచ్చదనం బాధ్యత కలెక్టర్లదే

రాష్ట్రంలోని పల్లెలు, పట్టణాల రూపురేఖలు మారాలని సీఎం కేసీఆర్ కలెక్టర్లను ఆదేశించారు. చాలా పల్లెలు, పట్టణాలు మురికికూపాలుగా మారాయని ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. పారిశుద్ధ్యంతో పాటు పచ్చదనం పెంపొందించే బాధ్యత కలెక్టర్లదేనని స్పష్టం చేశారు. ఈ మేరకు కొత్త పంచాయతీరాజ్, మునిసిపల్ చట్టాల్లో కలెక్టర్లకు కీలక బాధ్యతలు అప్పగించామని గుర్తు చేశారు. పల్లె, పట్టణ ప్రాంతాల్లో పారిశుద్ధ్యం, పచ్చదనాన్ని పెంపొందించడానికి త్వరలో 60రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తామని, ఇందుకు జిల్లా పాలనాయంత్రాంగాన్ని కలెక్టర్లు సిద్ధం చేయాలని సూచించారు. ఈ కార్యాచరణ అమలు తర్వాత ఎక్కడా చెత్త కనిపించొద్దని, అంతటా పచ్చదనం కనిపించాలని స్పష్టంచేశారు. హరితహారంలో భాగంగా మొక్కల పెంపకం తీరుపై సీఎం అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా పల్లెలు, పట్టణాల్లోని ప్రతి ఇంటికి కోరిన 6మొక్కలు సరఫరా చేయాలని, ఇందుకోసం స్థానిక నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలన్నారు. మునిసిపల్, పంచాయతీ నిధుల్లో 10% నిధులను కచ్చితంగా పచ్చదనం కోసమే ఖర్చుచేసేలా కలెక్టర్లు పర్యవేక్షించాలని సూచించారు. 60రోజుల ప్రణాళికలో భాగంగా విద్యుత్ వారోత్సవాలను సైతం నిర్వహించనున్నామని కలెక్టర్లకు తెలియజేశారు. ఇందులో భాగంగా వంగిన, విరిగిన విద్యుత్ స్తంభాలు, వేలాడే తీగలను తొలగించడం, మూడో, నాలుగో వైరు ఏర్పాటు వంటి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ప్రభుత్వ ప్రధాన సలహాదారు రాజీవ్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణాలో కనిష్ట స్థాయికి వరద

ప్రాజెక్టుల గేట్లన్నీ మూసివేత

సాక్షి, హైదరాబాద్: వర్షాలు తెరిపి ఇవ్వడంతో కృష్ణా నదిలో వరద ప్రవాహం కనిష్ట స్థాయికి చేరింది. ఎగువన ప్రాజెక్టుల గేట్లు మూసివేయడంతో దిగువకు వరద ప్రవాహం తగ్గుతోంది. మంగళవారం సాయంత్రం ప్రకాశం బ్యారేజీలోకి 9,890 క్యూసెక్కుల నీరు రాగా.. 7,462 క్యూసెక్కులు దిగువకు వదిలారు. ఎగువ నుంచి కనిష్టంగా వరద వస్తుండటంతో మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం ఉదయంలోపు ప్రకాశం బ్యారేజీ గేట్లు మూసేయనున్నారు. ఆల్మట్టి, నారాయణపూర్ జలాశయాల్లోకి వరద ప్రవాహం తగ్గిపోవడంతో గేట్లను పూర్తిగా మూసేశారు. కేవలం విద్యుదుత్పత్తి కేంద్రాల ద్వారా మిగులు జలాలను దిగువకు వదులుతున్నారు. భీమా, తుంగభద్ర నదుల్లోనూ వరద ప్రవాహం తగ్గింది. ఉజ్జయినీ నుంచి భీమా, తుంగభద్ర జలాశయం నుంచి మిగులు జలాలను విద్యుదుత్పత్తి కేంద్రాల దిగువకు వదులుతున్నారు. దీనివల్ల బుధవారం నుంచి జూరాల, శ్రీశైలానికి వచ్చే వరద మరింతగా తగ్గనుంది. ఈ నేపథ్యంలో శ్రీశైలం, సాగర్, పులిచింతలలో పూర్తిస్థాయి సామర్థ్యం మేరకు నీటిని నిల్వ చేస్తున్నారు. పులిచింతల ప్రాజెక్టులో ఈ ఏడాది పూర్తి సామర్థ్యం మేర 45.77 టీఎంసీలు నిల్వ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దాంతో మంగళవారం పులిచింతల గేట్లు పూర్తిగా మూసేశారు.

గ్లోబారీనాపై గుటకలు మింగుతున్నారు

సీఎం కేసీఆర్, కేటీఆర్‌లపై విజయశాంతి విసుర్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యల విషయంలో తమ ప్రభుత్వ తప్పిదం ఏమాత్రం లేదన్నట్లు రాష్ట్ర ప్రభుత్వం మొదట్లో వ్యవహరించిందని, కానీ ఇప్పుడు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ వివరణ కోరడంతో రక్షణలో పడిపోయిందని పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ విజయశాంతి వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి కేసీఆర్, ఆయన కుమారుడు కేటీఆర్ మీడియా నోరు నొక్కి గ్లోబరీనా వ్యవహారాన్ని తొక్కిపెట్టే ప్రయత్నం చేసినా, ఇప్పుడు రాష్ట్రపతి వివరణ అడిగేసరికి గుటకలు మింగుతున్నారని ఎద్దేవా చేశారు. తప్పిదాలు ఇవాళ కాకపోయినా రేపైనా వెలుగులోకి వస్తాయన్న విషయాన్ని తండ్రీకొడుకులు గుర్తుంచుకోవాలని ఆమె హితవు పలికారు. తాను ఆణిముత్యం, తన కుమారుడు స్వాతిముత్యం అనుకుని మురిసిపోతే కుదరదని, కాలం మారడం ఖాయమని, జనం ఆలోచన, అభిమానం మారడం అంతకన్నా ఖాయమని విజయశాంతి హెచ్చరించారు.

సమావేశం తర్వాత మంత్రి ఈటలను సన్మానిస్తున్న ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ప్రతినిధులు

ఆరోగ్యశ్రీ మళ్లీ షురూ

▶ మొదటి పేజీ తరువాయి

వైద్యం అందే అవకాశముందని, తాము 85 లక్షల కుటుంబాలకు ఆరోగ్యశ్రీ కింద ఉచిత వైద్యం అందజేస్తున్నామన్నారు. ప్రభుత్వం తమ డిమాండ్ల పట్ల సానుకూలంగా స్పందించడంతో సమ్మె విరమిస్తున్నామని తన్నా ప్రెసిడెంట్ డాక్టర్ రాకేశ్ తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న ఒప్పందంలోని లొసుగులే సమస్యలకు దారి తీస్తున్నాయన్నారు. ఆయుష్మాన్ వద్దు, ఆరోగ్యశ్రీ ముద్దు అని ఈ సందర్భంగా రాకేశ్ వ్యాఖ్యానించారు. బుధవారం నుంచి ప్రజలకు యథావిధిగా సేవలందిస్తామని తెలిపారు. ఇకపై తన్నా గౌరవ అధ్యక్షునిగా మంత్రి ఈటల ఉంటారని ఆయన ప్రకటించారు.

ఐదు రోజులుగా రోగుల ఇక్కట్లు...

ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్ఎస్‌కు సంబంధించి బకాయిలు భారీగా పేరుకుపోవడంతో ఈ నెల 16 నుంచి తన్నా హాస్పిటళ్లు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేశాయి. అదేరోజు ప్రభుత్వంతో చర్చలు జరిపినప్పటికీ బకాయిల లెక్క తేలకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. సుమారు రూ. 1,200 కోట్ల మేర బకాయిలు ఉన్నట్లు తన్నా పేర్కొనగా బకాయిలు రూ. 600 కోట్లేనని ఆరోగ్యశ్రీ అధికారులు చెప్పడంతో చర్చలు అర్ధంతరంగానే ముగిశాయి. ఈ ప్రతిష్టంభన కారణంగా శుక్రవారం నుంచి సోమవారం వరకూ ఐదు రోజుల పాటు సమ్మె కొనసాగింది. దీంతో వేల మంది రోగులు తీవ్ర ఇబ్బంది పడ్డారు.

మా వాళ్లకు 25% సీట్లు

▶ మొదటి పేజీ తరువాయి

సంస్థల దరఖాస్తులను ప్రభుత్వం పరిశీలించి వచ్చే విద్యా సంవత్సరం (2020-21) నుంచి ప్రైవేటు యూనివర్సిటీలను ప్రారంభించేలా అనుమతులు జారీచేయనుంది.

ఇవీ ప్రధాన నిబంధనలు..

- ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్ నుంచి రూ.50 వేలు చెల్లించి దరఖాస్తు ఫారాన్ని డౌన్‌లోడ్ చేసుకునే సంస్థలు యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించిన డిటెయిల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను విద్యాశాఖ కార్యదర్శికి అందజేయాలి. రూ.10 లక్షలను నాన్ రిఫండబుల్ అమౌంట్ కింద చెల్లించాలి.
- హెచ్ఎండీఏ పరిధిలో యూనివర్సిటీని ఏర్పాటుచేయాలనుకుంటే.. కనీసంగా 20 ఎకరాలు, మిగతా ప్రాంతాల్లో అయితే కనీసంగా 30 ఎకరాలు సొసైటీ పేరుతో రిజిస్టర్ అయి ఉండాలి.
- పరిపాలన భవనం కనీసంగా 1,000 చదరపు మీటర్లు, లైబ్రరీ, లెక్చర్ హాల్, లేబొరేటరీలతో కూడిన అకడమిక్ భవనాలు రూ.10వేల చదరపు మీటర్లు (దాదాపుగా రెండున్నర ఎకరాలు) ఉండాలి.
- యూనివర్సిటీ ఏర్పాటు చేసే సమయంలో రూ.10 కోట్లు కార్పస్ ఫండ్‌గా వెచ్చించాలి. అలాగే భవన నిర్మాణాలు, మౌలిక సదుపాయాల కల్పన, క్యాంపస్ అభివృద్ధి కోసం రూ.30 కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్ కింద చూపించాలి.
- డీపీఆర్‌తోపాటు సంస్థల ప్రతిపాదనలను పరిశీలించేందుకు నిపుణుల కమిటీ ఏర్పాటు. ఈ కమిటీకి ఎక్స్-అఫీషియో చైర్‌పర్సన్‌గా విద్యాశాఖ కార్యదర్శి, సభ్యులుగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్, జేఎన్‌టీయూ, ఉస్మానియా యూనివర్సిటీల వైస్ చాన్సలర్లు, మరో ఇద్దరు (కమిటీ ఎంపిక చేసేవారు) ఉంటారు. కళాశాల విద్యా కమిషనర్ ఈ నిపుణుల కమిటీకి సభ్య కార్యదర్శిగా వ్యవహరిస్తారు. యూనివర్సిటీ ఏర్పాటు చేయాలనుకునే సంస్థ స్థితిగతులను కమిటీ పరిశీలిస్తుంది. ఆ సంస్థకున్న పేరు ప్రఖ్యాతులు, విద్యారంగంలో అనుభవాన్ని పరిశీలిస్తుంది. సంప్రదాయ కోర్సులే కాకుండా ప్రస్తుత మార్కెట్ అవసరాలకు అనుగుణంగా ఆఫర్ చేయబోయే కోర్సుల రూపకల్పనను పరిశీలిస్తుంది. ప్రతిపాదనలు అందిన 60 రోజుల్లో నిపుణుల కమిటీ తమ సిఫారసులను ప్రభుత్వానికి అందజేయాలి.
- నిపుణుల కమిటీ ఇచ్చిన సిఫారసుల మేరకు 30 రోజుల్లో ఆమోదించడమా? రిజెక్టు చేయడమా? మార్పులు కోరడమా? అన్న దానిపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. 'లెటర్ ఆఫ్ ఇంటెంట్'రూపంలో ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఆ సంస్థకు తెలియజేస్తుంది.
- నిపుణుల కమిటీ, ప్రభుత్వం ఏమైనా మార్పులను సూచిస్తే వాటిని 'లెటర్ ఆఫ్ ఇంటెంట్' పొందిన 6 నెలల్లో చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అవసరమైతే మరో ఏడాది గడువును పొడిగించవచ్చు. లోపాల సవరణ నివేదిక వచ్చాక నెల రోజుల్లో నిపుణుల కమిటీ వాటిని పరిశీలిస్తుంది. ఆ నివేదిక వచ్చాక అన్నీ సరిగ్గా ఉంటే చట్టంలోని నిర్దేశిత షెడ్యూలులో యూనివర్సిటీ పేరును చేర్చుతుంది.
- యూనివర్సిటీ చాన్సలర్ నియామకం కోసం దరఖాస్తులను స్వీకరించాలి. దరఖాస్తుల స్వీకరణకు నెల రోజుల గడువు ఇవ్వాలి. వచ్చిన దరఖాస్తులు అన్నింటినీ సెర్చ్ కమిటీ ముందుంచాలి. సెర్చ్ కమిటీ సూచించే ముగ్గురి పేర్లలో ఒకరిని ఆ సంస్థ యూనివర్సిటీ చాన్సలర్‌గా నియమిస్తుంది.
- చాన్సలర్‌ను నియమించాక యూనివర్సిటీ తమ మొదటి నివేదికను 90 రోజుల్లోగా అందజేయాలి. వైస్-చాన్సలర్‌ను నియమించాక 60 రోజుల్లో ఆర్డినెన్స్‌ను జారీ చేయాలి.
- తెలంగాణలో కనీసంగా రెండేళ్లు చదివిన రాష్ట్ర విద్యార్థులకు యూనివర్సిటీ ప్రవేశాల్లో, అన్ని కోర్సుల్లో 25% సీట్లను కేటాయించాలి. విద్యార్థుల తల్లిదండ్రులు తెలంగాణలో రెండేళ్లు పని చేసి ఉన్నా వారి పిల్లలను రాష్ట్ర విద్యార్థులుగా పరిగణనలోకి తీసుకోవాలి.
- యాక్ట్‌లో వర్సిటీ పేరు చేర్చాక నెల రోజుల్లోగా ఎండోమెంట్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలి. ఆ ఫండ్ ప్రాజెక్టు వ్యయంలో 1% లేదా రూ.10 కోట్లు వీటిలో ఏది తక్కువైతే ఆ మొత్తంతో ఫండ్ ఏర్పాటు చేయాలి. నిర్దేశిత బ్యాంకులో దానిని యూనివర్సిటీ పేరు, కళాశాల విద్యా కమిషనర్ పేరుతో జాయింట్ అకౌంట్‌తో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయాలి. అనుమతి లేకుండా ఆ ఫండ్‌ను వినియోగించడానికి వీల్లేదు. ఆర్థిక సంవత్సరం పూర్తయ్యాక 6నెలల్లోగా వార్షిక నివేదిక ఇవ్వాలి. సొసైటీని రద్దు చేయాలనుకుంటే అడ్మినిస్ట్రేటర్‌ను నియమిస్తారు. అడ్మినిస్ట్రేటర్ నేతృత్వంలో కోర్సులు పూర్తయి.. విద్యార్థులకు డిగ్రీలు అందజేసే వరకు యూనివర్సిటీ కొనసాగుతుంది. ప్రభుత్వం యూనివర్సిటీని చట్టం ద్వారా రద్దు చేయవచ్చు.

అడ్డగోలు 'సేవ'లొద్దు!

- కొత్త మీ-సేవ కేంద్రాలకు అనుమతులపై సర్కారు సీరియస్
- వీటికోసం జారీచేసిన నోటిఫికేషన్లు రద్దు

సాక్షి, హైదరాబాద్: 'మీ సేవ'కేంద్రాల ఏర్పాటుపై ప్రభుత్వం ఆంక్షలు విధించింది. కొన్ని జిల్లాల్లో అడ్డగోలుగా కొత్త కేంద్రాలకు అనుమతులివ్వడాన్ని తప్పుబట్టిన సర్కారు.. ఇప్పటికే జారీచేసిన నోటిఫికేషన్లను రద్దుచేయాలని ఆదేశించింది. ఇకపై 'మీ సేవ'కేంద్రాల ఏర్పాటులో నిర్దిష్ట మార్గదర్శకాలను పాటించాల్సిందేనని స్పష్టం చేసింది. ఈ మేరకు త్వరలోనే కొత్త నిబంధనలు వెలువరించనున్నట్లు వెల్లడించింది. మొబైల్ యాప్‌లు, ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి రావడంతో ఈ-సేవల వినియోగంపై ప్రభావం చూపుతుందని, ఈ నేపథ్యంలో ఇప్పటికే ఉన్న 'మీ సేవ'కేంద్రాల కొనసాగింపును కూడా సమీక్షించాల్సిన పరిస్థితి రావచ్చని అభిప్రాయపడింది. ఈ అంశాలను పరిగణనలోకి ఉంచుకొని కొత్త సెంటర్ల ఏర్పాటుపై అచితూచి అడుగేయాలని సూచించింది. గతేడాది భద్రాద్రి-కొత్తగూడెం.. తాజాగా మేడ్చల్ జిల్లాలో ఇబ్బడిముబ్బడిగా 'మీ సేవ'కేంద్రాల ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీచేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ప్రభుత్వం ఇకపై అలా జరగడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు రాష్ట్ర ఐటీ శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు.

రోజుకు లక్షన్నర సేవలు

జనన, మరణ ధ్రువపత్రాలు, మ్యుటేషన్లు, పాస్‌పుస్తకాలు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఏం కావాలన్నా 'మీ సేవ'గడప తొక్కాల్సిందే. ఇలా దాదాపు 500 ఎలక్ట్రానిక్ సేవలందిస్తున్న మీ-సేవ కేంద్రాల్లో ప్రతి రోజూ సగటున లక్షన్నర లావాదేవీలు జరుగుతున్నాయి. ఇందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించినవే. ఈ నేపథ్యంలో మీ-సేవ కేంద్రాలు ప్రారంభించిన గత ఎనిమిదేళ్లలో ఇప్పటివరకు 12.50 కోట్ల మేర లావాదేవీలు జరిగాయి. రాష్ట్రవ్యాప్తంగా 4,500 పైచిలుకు కేంద్రాలు పనిచేస్తుండగా.. ఇందులో 85% సెంటర్లలో నెలవారీ ఆదాయం రూ.10వేల లోపే ఉంటుంది. ఈ పరిణామం ఒకింత ఆందోళన కలిగిస్తోంది. నిర్వహణ కూడా కష్టంగా మారడానికి ప్రధాన కారణం ప్రభుత్వ శాఖలు ఆన్‌లైన్ సేవలు విస్తరించడమే. పోలీస్, ట్రాఫిక్, ఇతర ప్రభుత్వ విభాగాలు తమ సేవలను ఈ సేవలతోపాటు సొంతంగా ఏర్పాటు చేస్తున్న పోర్టల్ ద్వారా అందుబాటులోకి తెస్తున్నాయి. తద్వారా మీ-సేవ కేంద్రాల్లో లావాదేవీల సంఖ్య తగ్గుతోంది. దీంతో ఇప్పటికే లాభదాయంగాని సెంటర్లను నెట్టుకొస్తున్న నిర్వాహకులకు కొత్తగా ఏర్పాటు చేసే వాటితో మరింత నష్టం జరగనుంది.

మేడ్చల్‌లో రెట్టింపు కేంద్రాలు

గతేడాది భద్రాద్రి జిల్లాలో 5వేల జనాభా, దూరాన్ని బట్టి కొత్తగా 53 మీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు ఆ జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేశారు. నిర్వాహకుల గిట్టుబాటును పరిగణనలోకి తీసుకోకుండా ఎడాపెడా కొత్తవాటికి అనుమతి ఇవ్వడం సరికాదని అన్ని జిల్లాల యంత్రాంగాలను ప్రభుత్వం హెచ్చరించినా.. తాజాగా మేడ్చల్ జిల్లాలో ఏకంగా 219 కొత్త కేంద్రాలకు నోటిఫికేషన్ ఇచ్చారు. దీంతో సర్కారు సీరియస్ అయింది. దూరాన్ని కూడా పట్టించుకోకుండా 5వేల జనాభా ఆధారంగా గల్లీకో కేంద్రం ఉండేలా నోటిఫికేషన్‌లు ఇవ్వడాన్ని తప్పుబట్టింది. ఇప్పటికే జ

మంగళవారం తెల్లవారుజామున ఒకటవ బాహుబలి మోటారు నుంచి నీటి పంపింగ్ చేస్తున్న దృశ్యం

ఒకటో 'బాహుబలి' వెట్‌రన్ సక్సెస్

రామడుగు (చొప్పదండి): కాళేశ్వరం ప్రాజెక్టు పరిధిలోని కరీంనగర్ జిల్లా లక్ష్మీపూర్ (గాయత్రి) పంపుహౌస్‌లో ఒకటో బాహుబలి మోటార్ వెట్‌రన్ విజయవంతమైంది. ఇప్పటికే 5వ, 4వ బాహుబలి మోటార్ల వెట్‌రన్ చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఒకటవ మోటార్‌ను వెట్‌రన్ చేయడంతో పంపుహౌస్‌లోని ఏడు మోటార్లకు గాను మూడు మోటార్ల వెట్‌రన్ అధికారులు విజయవంతంగా నిర్వహించినట్లయింది. ఒకటో మోటార్‌ను మంగళవారం తెల్లవారుజామున ప్రారంభించిన అధికారులు కొంత సమయం తర్వాత నిలిపి వేశారు. మధ్యాహ్నం ఒకేసారి 5,4,1వ మోటార్లను నడిపిస్తుండటంతో భారీగా నీరు గ్రావిటీ కాలువలోకి చేరుతోంది. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సాంకేతిక

మూడు మోటార్లతో నీరు ఎత్తిపోత

సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈ నూనె శ్రీధర్, డీఈఈ గోపాలకృష్ణ, ఏఈలు, ఇతర సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.

పెరిగిన సందర్శకుల తాకిడి

లక్ష్మీపూర్‌లోని బాహుబలి విద్యుత్ మోటార్లు భారీగా నీటిని పంపింగ్ చేస్తుండటంతో సందర్శకులు భారీగా తరలించి తిలకిస్తున్నారు. నీటి ఎత్తిపోత దృశ్యాలను చూసి ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాలువలో చేపలు పట్టేందుకు ప్రయత్నించవద్దని, ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంటుందని ఈఈ నూనె శ్రీధర్ పర్యాటకులకు విజ్ఞప్తి చేశారు.

జగిత్యాల కలెక్టర్‌కు జాతీయ అవార్డు

- బెస్ట్ కలెక్టర్‌గా ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పురస్కారం
- నేడు ప్రధాని చేతుల మీదుగా అందుకోనున్న శరత్

సాక్షి, జగిత్యాల: జగిత్యాల జిల్లా కలెక్టర్ శరత్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. ప్రముఖ ఆంగ్ల పత్రిక ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నిర్వహించిన సర్వేలో శరత్ ఉత్తమ కలెక్టర్‌గా ఎంపికయ్యారు. బుధవారం ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా అవార్డు అందుకోనున్నారు. ఢిల్లీలో బుధవారం సాయంత్రం ఈ కార్యక్రమం జరగనుంది. దేశంలోని 700 మంది కలెక్టర్ల పనితీరుపై ఎనిమిది విభాగాల్లో లోతైన అధ్యయనం చేసి అవార్డుకు ఎంపిక చేశారు. భూరికార్డుల రికార్డుల ప్రక్షాళన, ఆరోగ్యం, విద్యా, కేసీఆర్‌కిట్, గొర్రెల పంపిణీ, స్వచ్ఛ భారత్ మిషన్ వంటి పథకాల అమలులో సాధించిన విజయాలపై కలెక్టర్ శరత్ ప్రతిపాదనల రహస్య విచారణ జరిపి శరత్‌ను అవార్డుకు ఎంపిక చేశారు.

తెలంగాణ ప్రభుత్వం
రీజినల్ ఆఫీసర్ కార్యాలయం, పంచాయతీ రాజ్, మహబూబ్‌నగర్
టెండర్ నోటీస్

Lr No. TO/57-63/2018-19 తేది: 02.08.2019, నోటీస్ నం.1 తేది: 16.08.2019, NIT No.61/2019-22, 62/2019-23, 63/2019-24 పని పేరు: PR మహబూబ్‌నగర్‌లో ఫిలదెల్ఫియా చర్చ్ నిర్మాణం, ఉర్దూఘర్ కమ్ షాదీ ఖానా నిర్మాణం పనులు (3) మొ॥ (1వ పిలుపు). మొత్తం ECV రూ. 98.30 లక్షలు. ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో టెండరు డాక్యుమెంట్ల లభ్యత: 21.08.2019న సా.5.00 గం. నుండి, టెండర్ల స్వీకరణ: 26.08.2019న సా.5.00 గం. నుండి. టెక్నికల్ బిడ్స్ తెరచుట: 27.08.2019న ఉ.11.00 గం. నుండి, ధర బిడ్లు తెరచుట: 30.08.2019 ఉ.11.00గం. నుండి కాగోరు బిడ్డర్లు తమ అనుభవం మరియు ఇతర వివరాలను ZIP ఫార్మాట్‌లో డాక్యాలు చేయాల్సిందిగా కోరబడుచున్నారు. తదుపరి వివరాలను https://tender.eprocurement.gov.in లోని ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్ నుండి పొందవచ్చును.

DIPR RO.No.947-DP/CL/Advt/1/2019-20, Dt: 20.08.2019 సం/- రీజినల్ ఆఫీసర్, PR మహబూబ్ నగర్

80.86 కోట్ల చేప పిల్లల విడుదలే లక్ష్యం: జేడీ

ఎల్లారెడ్డి రూరల్: మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఈ సంవత్సరం 80.86 కోట్ల చేప పిల్లలను చెరువులలో వదలాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ శంకర్ రాథోడ్ తెలిపారు. కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డిలోని పెద్ద చెరువులో మంగళవారం ఆయన చేప పిల్లలను వదిలారు.చేప పిల్లలతో పాటు 5 కోట్ల రొయ్య పిల్లలను సైతం చెరువుల్లో వదలనున్నట్లు చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
పోలీసు శాఖ
కమిషనరేట్ పోలీస్ ట్రైనింగ్ సెంటర్ కార్యాలయం, మేడికొండ, వరంగల్ పోలీస్ కమిషనరేట్
మెస్ టెండరు ప్రకటన

C.No.46/CTC-WGL-City/2019 తేది: 19.08.2019

దాదాపు 260 ట్రైనీ కానిస్టేబుల్స్ కోసం పోలీస్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూషన్ మేనను 9 నెలల కాలానికి నడుపుటకు టెండర్లు కోరబడుచున్నవి, మరో నెలరోజుల వరకు పొడిగించవచ్చును. ఏదేని ప్రముఖ విద్యాశిక్షణ కేంద్రం / ప్రైవేట్ కంపెనీలు / అర్హతగల హాస్టల్ / క్యాంటీన్ / రెస్టారెంట్ / కేటరింగ్ సర్వీసులో మెస్‌ను నడిపే వృత్తిలో కనీసం 2 సంవత్సరాల అనుభవం ఉండవలెను. టెండరు షెడ్యూల ఫారాలను రూ.100/- (వంద రూపాయలు మాత్రమే) చెల్లించి పైన తెలిపిన కార్యాలయం నుండి పొందవచ్చును, సంప్రదించు వ్యక్తి: పి.వి. మురళీధర్, అడిషనల్ డి.సి.పి/ప్రిన్సిపల్ సెల్ నం.9491873010 మరియు శ్యామ్ సుందర్ సింగ్, ఎ.సి.పి/వైస్ ప్రిన్సిపల్ సెల్ నం.9440700514. **షెడ్యూలు అమ్మకం ప్రారంభ తేది & సమయం:** 21.08.2019 ఉ.11.00 గం. నుండి సా.5 గం. **షెడ్యూలు అమ్మకం ముగింపు తేది & సమయం:** 04.09.2019 సా.5 గం. **బిడ్ దాఖలు ముగింపు తేది & సమయం:** 05.09.2019 మ.3 గం. **ప్రి-క్వాలిఫికేషన్ తెరచు తేది & సమయం:** 05.09.2019 సా.4 గం. నుండి సా.5 గం. వరకు. **టెక్నికల్ స్పెసిఫికేషన్స్ తెరచు తేది & సమయం:** 06.09.2019 ఉ.11 గం. **ధర బిడ్ తెరచు తేది & సమయం:** 07.09.2019 ఉ.11 గం.

DIPR RO.No.958-DP/CL/Advt/1/2019-20, Dt:20.08.2019 సం/- కమిషనర్ ఆఫ్ పోలీస్, వరంగల్

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి,
సెంట్రలైజ్డ్ అవుట్ సోర్సింగ్ సెల్
టెండరు ప్రకటన (సంక్షిప్త టెండరు)

File No.TTD-88021(31)/13/2019-COC SEC TTD

ఆన్‌లైన్ ద్వారా టెండర్లు (ఇ-టెండర్) కోరడం ద్వారా వర్క్ కాంట్రాక్ట్ క్రింద అటెండెంట్ సర్వీసులు అప్పగించుట కోసం ఇ-టెండర్లు కోరబడుచున్నవి.

టెండరు తెరచు తేది:
సాంకేతిక బిడ్ : 30.08.2019న మ.2.30 గం.కు
ఆర్థిక బిడ్ : 30.08.2019న మ.3.00 గం.కు

టెండరు డాక్యుమెంట్లను వెబ్‌సైట్ https://tender.apeprocurement.gov.in నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చును. తదుపరి వివరాలకోసం కార్యాలయ పనివేళలలో సంప్రదించండి. ఫోన్ నంబరు: 0877-2264063.

Roc No: PR4/13909/Adv.No.214/PRO/2019, Dated: 20.08.2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ లిమిటెడ్.,
5-10-193, 2nd Floor, "HACA Bhavan", Opp : Public Gardens, Hyderabad 500004. Cell : 7337346243
షార్ట్ టెండర్ ప్రకటన

No.SSDC/Mrktg/Tender/R-2019-20 తేది : 21.08.2019

రబీ 2019 - 20 నీజనుకు ప్రభుత్వ రాయితీ కార్యక్రమాల క్రింద తెలంగాణ రాష్ట్రంలో విత్తన పంపిణీ చేయుటకు దిగువ తెలిపిన విత్తనాలను (ఫ్రెష్ హార్వెస్ట్) అవశ్యకత ప్రాతిపదికపై నరఫరా చేయుటకు T.S.S.D.C.L. హైదరాబాద్ వారిచే సీల్డ్ టెండర్లు కోరబడుతున్నది.

క్రమ సం.	పంట	రకము	విత్తన శ్రేణి	కావలసిన పరిమాణము సుమారుగా (Qtls లో)	ఆఫర్ చేయదగిన కనీస పరిమాణం (Qtls లో)	బయానా (రూ.లక్షలలో)
1	వేరుశనగ (కాయలు)	K-6	C/S (లేదా) T/L	70,000	2,000	10
		TAG-24	C/S (లేదా) TL	20,000	2,000	
		Dharani	C/S లేదా T/L	10,000	2,000	
2.	వరి	MTU1010	C/S	20,000	3,000	5

అర్హతగల సరఫరాదారుల టెండరులో పాల్గొనవలసిందిగా కోరబడుచున్నది. టెండర్ షెడ్యూలు ధర : రూ.2500/- + 18% GST అదనంగా. టెండర్ షెడ్యూలు అమ్మకం ప్రారంభం : 21.08.2019. టెండర్ దాఖలు చివరి తేది : 28.08.2019 (మ.1.00గం.ల వరకు). టెండర్ తెరుచుట మరియు సంప్రదింపులు : 28.08.2019 (మ.2.00గం.ల నుండి). పూర్తి వివరాలు కలిగిన టెండర్ షెడ్యూల్, నియమ నిబంధనలు వెబ్‌సైట్ www.tssdcl.telangana.gov.in లో లభించును. వెబ్‌సైట్ నుండి టెండర్ షెడ్యూలును డౌన్‌లోడ్ చేసుకున్న టెండరుదార్లు టెండర్ షెడ్యూల్ ధర చెల్లించాలి మరియు నగదు రశీదును టెండరు షెడ్యూలుకు జత చేసి దాఖలు చేయవలెను.

DIPR RO.No.318-PP/CL/Advt/1/2019-20, Dt:20.08.2019 సం/-మేనేజింగ్ డైరెక్టర్, TSSDCL

గోతిలో మట్టి కప్పుకుని నిరసన తెలుపుతున్న నాగేందర్‌రెడ్డి

గోతిలో పూడ్చుకుని రైతు నిరసన

రెవెన్యూ అధికారులు రికార్డులను మార్చారని ఆరోపణ

డోర్నకల్: రెవెన్యూ అధికారులు తన భూమికి సంబంధించిన రికార్డులను మార్చారని ఆరోపిస్తూ మంగళవారం ఓ రైతు వినూత్న నిరసన తెలిపాడు. తన పొలంలో పెద్ద గొయ్యి తవ్వుకుని అందులో నడుము లోతు వరకు మట్టిని కప్పుకుని 72 గంటల దీక్ష చేపట్టాడు. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా డోర్నకల్ మండలం పెరుమాండ్ల సంకీస గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మారెడ్డి నాగేందర్‌రెడ్డికి గ్రామ శివారులోని 432, 433 సర్వే నంబర్లలో 16 ఎకరాల భూమి ఉంది. 2012-13లో ఈ భూమిలోని కొంత భాగాన్ని పలుమార్లు విక్రయించాడు. గుట్ట ప్రాంతమైన ఐదెకరాల భూమిని విక్రయించగా.. మామిడి తోట ఉన్న ప్రాంతాన్ని విక్రయించినట్లుగా అప్పటి తహసీల్దార్ విజయ్‌కుమార్, ఆర్ఐ లక్ష్మణ్, వీఆర్ఓ రాంబాబు రికార్డులో నమోదు చేశారని, ఐదెకరాలకు బదులు ఆరెకరాలు విక్రయించినట్లు సర్వే నంబర్లను తప్పు రాశారని ఆరోపించాడు. వాటిని సరిచేయాలని కొన్నేళ్లుగా తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని పేర్కొన్నాడు. అధికారుల తీరుతో రైతుబంధు పథకం పొందలేకపోయానని వాపోయాడు. దీంతో విసిగి వేసారిన నాగేందర్‌రెడ్డి ఈ వినూత్న నిరసన దీక్ష చేపట్టాడు. విచారణ జరిపి న్యాయం చేస్తామని తహసీల్దార్ నర్సింగరావు హామీ ఇవ్వడంతో దీక్ష విరమించాడు.

క్లుప్తంగా...

స్థాయిలేని వారే బీజేపీలోకి..

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీలో కేవలం ఒకే ఒక శాసనసభ్యున్ని కలిగిన బీజేపీ ఎగిరెగిరి పడుతోందని, స్థాయి లేని నేతలే బీజేపీలో చేరుతున్నారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీలు టి.భానుప్రసాద్‌రావు, వి.గంగాధర్‌గౌడ్ అన్నారు. మంగళవారం టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో ఇరువురు ఎమ్మెల్సీలు మీడియాతో మాట్లాడారు. బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా రాష్ట్ర పర్యటన తర్వాత.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు నైతిక విలువలకు తిలోదకాలిచ్చేలా ఉన్నాయని విమర్శించారు. 'బీజేపీ ఎక్కడ ఉందో చెల్లిని అడగాలంటూ'కేటీఆర్‌ను ఉద్దేశించి లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలు దురదృష్టకరమని, అసెంబ్లీ ఎన్నికల్లో తాను కూడా ఓటమి పాలైన విషయాన్ని ఆయన మరిచిపోయారని ఎద్దేవా చేశారు.

'లక్ష్మణ్ వ్యాఖ్యలు ఖండిస్తున్నా'

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు పార్టీ నేతలు కేటీఆర్, కవితపై బీజేపీ నేతలు దిగజారి మాట్లాడితే సహించేది లేదని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కేటీఆర్ పనిచేయలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేయని లక్ష్మణ్.. కేటీఆర్ గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు.

బీజేపీ, ఆరెస్సెస్ కుట్రలు..

సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీలకున్న రిజర్వేషన్లు తొలగించాలని బీజేపీ, ఆరెస్సెస్ కుట్రలు చేస్తున్నాయని సీపీఎం ధ్వజమెత్తింది. దీనికి సంబంధించి ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భగవత్ చేసిన ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆ పార్టీ కార్యదర్శి తమ్మినేని వీరభద్రం మంగళవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. తరతరాలుగా దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్న ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రాజ్యాంగం చదువులు, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించినా వాటిని సఫలీకృతం చేయడంలో పాలకవర్గాలు విఫలమయ్యాయన్నారు.

నల్లమల సందర్శనకు అనుమతించండి: టీజేఎస్

సాక్షి, హైదరాబాద్: యురేనియం మైనింగ్ ప్రతిపాదిత మండలాల్లో పర్యటనకు అనుమతించాలని తెలంగాణ జనసమితి (టీజేఎస్).. డీజీపీ మహేందర్‌రెడ్డికి విన్నవించింది. టీజేఎస్ అధ్యక్షుడు కోదండరాం, అధికార ప్రతినిధి వెంకట్‌రెడ్డిలు మంగళవారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈనెల 3న మావోయిస్టు అమరుల వారోత్సవాల పేరిట, 14న అడవి జంతువుల నుంచి రక్షణ కల్పించలేమన్న సాకుతో తమను, తమపార్టీ సభ్యుల్ని అడ్డుకుని సెక్షన్ 151 సీఆర్‌పీసీ కింద అరెస్టు చేశారని డీజీపీ దృష్టికి తీసుకెళ్లారు. యురేనియం మైనింగ్ నిక్షేపాలు గుర్తించిన అమ్రాబాద్, పడర మండలాల్లో పర్యటించి, ప్రజలను కలుసుకునేందుకు అనుమతించాలని కోరారు.

'బీసీలకు 33 శాతం రిజర్వేషన్లు కొనసాగించాలి'

సాక్షి, హైదరాబాద్: మున్సిపల్ ఎన్నికల్లో బీసీలకు 33% రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించాలని వివిధ రాజకీయ పక్షాలు, బీసీ సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశంలో నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో బీసీ హక్కుల సాధన సమితి (సీపీఐ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాయబండి పాండురంగాచారి అధ్యక్షతన 'బీసీ రిజర్వేషన్లు-మున్సిపల్ ఎన్నికలు'అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. బీసీలకు జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల సాధన కోసం రాజకీయ పార్టీలకతీతంగా ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు.

రాష్ట్రంలో గాడి తప్పిన వైద్యం



హైదరాబాద్: రాష్ట్రంలో వైద్యం గాడి తప్పిందని తెలంగాణ ఇంటిపార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చెరుకు సుధాకర్ ధ్వజమెత్తారు. మంగళవారం ఆదర్శనగర్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. మొండి బకాయిలు చెల్లించడం లేదని ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాలు ఆరోగ్యశ్రీ సేవలు నిలిపివేయడం దారుణమన్నారు. ఈ సేవల నిలుపుదలతో సర్కార్ ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందని, అయితే అక్కడ కనీస సౌకర్యాలు లేక రోగులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు.

సుప్రీంకు అప్పీలు చేయాలి..

హైదరాబాద్: మెడికల్ కౌన్సెలింగ్‌లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల విషయంలో హైకోర్టు ఇచ్చిన తీర్పుపై సుప్రీం కోర్టులో అప్పీలు చేయాలని సీఎం కేసీఆర్‌కు బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో మాట్లాడుతూ.. హైకోర్టు తీర్పుతో 262 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు కోల్పోయారన్నారు. హెల్త్ వర్సిటీ వీసీ, ప్రభుత్వం కుమ్మక్కైందని ఆరోపించారు.

రామప్పకు మంచి రోజులు!

- దశాబ్దాలుగా పట్టించుకోకపోవడంతో కళావిహీనంగా పరిసరాలు
- వచ్చే నెల యునెస్కో బృందం వస్తుండటంతో కదిలిన ప్రభుత్వం
- రామప్ప ఆలయం, దాని సమకాలీన ఆలయాల రూపురేఖల మార్పు
- టెంపుల్ టౌన్‌గా మార్చేందుకు యుద్ధ ప్రాతిపదికన పనులు..

రామప్ప దేవాలయం సమీపంలోని మరో ఆలయం వద్ద శుభ్రం చేసిన పరిసరాలు

సాక్షి, హైదరాబాద్,న్యూఢిల్లీ: పురాతన కట్టడంగా, ఆనాటి శిల్పకళకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన రామప్ప దేవాలయానికి ఇప్పటికీ మంచి తారు రోడ్డు లేదు. కట్టడంలో ప్రతి అంగుళం ప్రత్యేకమే అయినా ఆ నిర్మాణ అద్భుతాలు సాయంత్రం వేళ చూడాలంటే ఆలయంపై విద్యుత్తు కాంతులుండవు. దేవాలయాన్ని చూసేందుకు వచ్చే పర్యాటకులు వాహనాలు ఎక్కడ నిలపాలో తెలియదు. ఇప్పటివరకు అక్కడ పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలం అంటూ లేదు. ప్రధాన ఆలయానికి అనుబంధంగా ఆ పరిధిలో ఎన్నో చిన్న దేవాలయాలున్నా, ఆలనాపాలనా లేక అవి ఏ క్షణానైనా కూలిపోయే దుస్థితికి చేరుకున్నాయి. చివరకు ఆలయ పరిసరాల్లో చెత్తకుండీ కూడా ఉండదు. ఈ ఆలయం కోసం ప్రత్యేకంగా నీటిలో తేలియాడే ఇటుకలను రూపొందించి మరీ నిర్మించిన తీరు నేటి ఇంజనీర్లను కూడా అబ్బురపరిచే పరిజ్ఞానాన్ని సొంతం చేసుకున్న రామప్ప దేవాలయ ప్రాంతం దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైంది. కానీ కేవలం నెల రోజుల్లో ఈ లోపాలను సరిదిద్దేందుకు ప్రణాళిక ఖరారైంది. ఆ వెంటనే దాని అమలూ మొదలైంది. ఆయా పనులు చేపట్టే శాఖలు చకచకా ఏర్పాట్లు చేసేస్తున్నాయి.

నెల రోజుల్లో..

ప్రస్తుత ఆలయం, దాని పరిసరాలు నెలరోజుల్లో పూర్తిగా మారిపోనున్నాయి. ఇదంతా ఐక్యరాజ్య సమితి విద్యా, విజ్ఞాన, సాంస్కృతిక సంస్థ (యునెస్కో) మహిమ. ప్రపంచ వారసత్వ హోదా కోసం రామప్ప పేరును కేంద్రప్రభుత్వం యునెస్కోకు దరఖాస్తు చేసిన నేపథ్యంలో.. దాన్ని పరిశీలించి ఆ హోదా ఇచ్చే అర్హత ఉందో లేదో తేల్చేందుకు వచ్చే నెల 25న యునెస్కో ప్రతినిధులు వస్తున్నారు. ఈ విషయాన్ని తెలంగాణ పర్యాటక శాఖ ఇన్‌చార్జి ప్రిన్సిపల్ సెక్రటరీ పార్థసారథి వెల్లడించారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి ప్రహ్లాద్ సింగ్ పటేల్ నేతృత్వంలో మంగళవారం ఢిల్లీలో జరిగిన పర్యాటక మంత్రుల జాతీయ సమావేశానికి రాష్ట్రం తరఫున పార్థసారథి, టూరిజం కార్పొరేషన్ ఎండీ మనోహర్‌రావు హాజరయ్యారు. ఇటు ప్రస్తుతం ఆలయం వద్ద ఉన్న పరిస్థితులు చూస్తే ఆ అర్హత లేదని తేల్చే ప్రమాదముంది. దీంతో ఉన్నఫళంగా అక్కడ పరిస్థితులు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని నిర్ణయించి పురమాయించింది.

ఏం చేస్తారు...?

- రామప్పను టెంపుల్ టౌన్‌గా మారుస్తున్నారు. ఇందుకోసం ఆలయానికి 10 కి.మీ. పరిధిలో ఉన్న సమకాలీన ఆలయాలను దీనికి అనుబంధంగా మారుస్తున్నారు. ఆలయం పరిసరాలు, పక్కనే ఉన్న రామప్ప చెరువు వద్ద దాదాపు 20 వరకు సమకాలీన ఆలయాలున్నాయి. ఒకప్పుడు ఇవన్నీ రామప్పలో భాగమే. కానీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇప్పుడు వాటన్నింటిని శుభ్రం చేసి వీలైనంతమేర బాగు చేయబోతున్నారు. ఆలయానికి 9 కి.మీ. దూరంలో ఉన్న ఘన్‌పూర్ దేవాలయాల వద్ద కూడా శుభ్రం చేసేపని ప్రారంభిస్తున్నారు.
- ప్రధాన దేవాలయం వద్ద ప్రత్యేకంగా 2 ఎకరాల విస్తీర్ణంలో భారీ పార్కింగ్ స్థలాన్ని సిద్ధం చేయనున్నారు.
- ఆలయానికి చేరువగా ఉన్న ఆక్రమిత దుకాణ సముదాయాలను పూర్తిగా తొలగించి ఆ ప్రదేశం ఖాళీగా ఉండేలా చేయనున్నారు.
- దేవాలయానికి విద్యుత్ సరఫరాకు అస్తవ్యస్తంగా ఏర్పాటు చేసిన పాత స్తంభాలు, కర్రలు, ఆలయంలో అడ్డదిడ్డంగా వేలాడుతున్న వైర్లను తొలగించి భూగర్భం గుండా ఏర్పాటు చేయనున్నారు.
- ములుగు ప్రధాన రోడ్డు నుంచి దేవాలయం వరకు 100 అడుగులతో తారు రోడ్డు నిర్మించనున్నారు.
- హన్మకొండ నుంచి వరంగల్, వెంకటాపూర్ మీదుగా దేవాలయం వరకు సైనేజ్ బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. దేవాలయ ప్రాధాన్యం వివరించే ప్రత్యేక బోర్డులను కూడా పొందుపరుస్తున్నారు.
- దేవాలయం విద్యుత్ కాంతుల్లో వెలిగేలా ప్రత్యేక లైటింగ్ వ్యవస్థ ఏర్పాటు చేస్తున్నారు.
- అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం ఆ ప్రాంతం మొత్తంలో చెత్తకుండీలు ఏర్పాటు చేస్తారు. ఆలయం చుట్టూ పచ్చిక బయళ్లు సిద్ధం చేస్తారు.

ఇవన్నీ నెలరోజుల్లో పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. గత 17వ తేదీన సంబంధిత విభాగాలతో కీలక సమావేశం ఏర్పాటు చేసిన అధికారులు వెంటనే పనులు చేపట్టాలని నిర్ణయించారు. తాజాగా భారత పురావస్తు సర్వేక్షణ సంస్థ (ఏఎస్ఐ) అదనపు డీజీ ఆ ప్రాంతాన్ని పరిశీలించి కీలక సూచనలు చేశారు. వాటి ఆధారంగా అక్కడి ప్రాంతాల్లో పనులు చేపడుతున్నారు.

అంబులెన్స్ డోర్ తెరుచుకోక వ్యక్తి మృతి

హైదరాబాద్: ఎంఎంటీఎస్‌లో ప్రయాణిస్తున్న ఓ వ్యక్తి గుండెపోటుతో మృతి చెందాడు. అల్మాస్‌గూడకు చెందిన ఆనంద్ (50) బేగంపేటలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు. బేగంపేట నుంచి ఫలక్‌నుమాకు ఎంఎంటీఎస్‌లో వెళ్తున్న సమయంలో మలక్‌పేట స్టేషన్ వద్ద ఆనంద్ అకస్మాత్తుగా గుండెపోటుకు గురయ్యాడు. దీంతో తోటి ప్రయాణికులు 108కు సమాచారమిచ్చారు. అక్కడికి చేరుకున్న అంబులెన్స్ వద్దకు ఆనంద్‌ను తీసుకెళ్లగా లాక్ పడి ఉండటంతో ఆ బండి డోర్ ఓపెన్ కాలేదు. దీంతో అంబులెన్స్ అద్దాలు పగులగొట్టేందుకు 20 నిమిషాలు పట్టింది. ఈలోపే ఆనంద్ చనిపోయాడని సమాచారం.

'నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న కేటీఆర్'

సాక్షి, హైదరాబాద్: టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బీజేపీపై నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని ఆ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి కృష్ణసాగర్‌రావు మండిపడ్డారు. మంగళవారం బీజేపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. టీఆర్ఎస్ ఆర్నేళ్ల పాలనపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రాష్ట్రంలో వ్యవస్థల విధ్వంసం జరుగుతోందని ఆరోపించారు.

రిజర్వేషన్లు వద్దంటారా?

- ఆరెస్సెస్ చీఫ్ వ్యాఖ్యలపై టీపీసీసీ నేతల గరంగరం
- రిజర్వేషన్లపై సమీక్ష అన్యాయమంటూ మోదీకి లేఖ
- భాగవత్ వ్యాఖ్యలపై బీజేపీ సమాధానం చెప్పాలని డిమాండ్

సాక్షి, హైదరాబాద్: దేశంలో రిజర్వేషన్లు అవసరం లేదంటూ ఆరెస్సెస్ చీఫ్ మోహన్ భాగవత్ చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా స్పందించింది. భాగవత్ వ్యాఖ్యలు సరైనవి కావని టీపీసీసీకి చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ నేతలు మండిపడ్డారు. రిజర్వేషన్ల ఆవశ్యకతను వివరిస్తూ ప్రధాని మోదీకి లేఖ రాశారు. ప్రధానికి లేఖ రాసిన వారిలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బక్క జడ్సన్, ఓబీసీ సెల్ చైర్మన్ కత్తి వెంకటస్వామి, ఆదివాసీ సెల్ చైర్మన్ జగన్‌లాల్ నాయక్, ఆదివాసీ సెల్ జాతీయ ఉపాధ్యక్షుడు బెల్లయ్య నాయక్ తదితరులున్నారు. భాగవత్ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ నేతలు సమాధానం చెప్పాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ ఎంపీ పోరిక బలరాం నాయక్‌లు కూడా మంగళవారం గాంధీ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ డిమాండ్ చేశారు.

రిజర్వేషన్ల ద్వారా అసమానతల్లో తగ్గుదల: పొన్నం

రిజర్వేషన్ల అంశం ఇప్పటిది కాదని, రిజర్వేషన్లను సమీక్షించాలనుకునే ముందు అసమానతలులేని సమాజాన్ని నిర్మించాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు. బీసీ నేతను అని చెప్పుకునే నరేంద్ర మోదీ ఓట్లు దండుకొని ప్రధాని అయ్యారని, ఆర్ఎస్ఎస్ చీఫ్ చేసిన వ్యాఖ్యలకు ఆయన ఏం బదులిస్తారని ప్రశ్నించారు. దేశంలోని వివిధ ప్రాంతాల్లో వివిధ పద్ధతుల్లో రిజర్వేషన్లు అమలవుతున్నాయని, రిజర్వేషన్లే లేకపోతే ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు కనీసం పార్లమెంటుకు ప్రాతినిధ్యం వహించే అవకాశం కూడా దక్కదన్నారు. రిజర్వేషన్ల ద్వారానే సామాజిక, ఆర్థిక, రాజకీయ అంతరాలు, అసమానతలు తగ్గుతున్నాయనే విషయాన్ని గుర్తించాలన్నారు. భాగవత్ వ్యాఖ్యలపై తెలంగాణ బీజేపీ నేతలు స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. రిజర్వేషన్లు ఎవరి దయాదాక్షిణ్యాలపై రాలేదని, ప్రభుత్వ ఫలాలు చిట్టచివరి వర్గాలకు చేరేందుకే అవి అమల్లో ఉన్నాయని మల్లు రవి చెప్పారు. భాగవత్ ద్వారా ఈ చర్చను లేవనెత్తి రిజర్వేషన్లు తీసేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని ఆరోపించారు. రిజర్వేషన్లపై గతంలోనూ బీజేపీ నేతలు ఇలానే వ్యవహరించారని మాజీ ఎంపీ బలరాం నాయక్ విమర్శించారు. భాగవత్ వ్యాఖ్యలతో దేశంలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలు ఆందోళనలో పడ్డాయని, రిజర్వేషన్లపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నా అన్ని వర్గాలను కలుపుకొని ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు.

ట్రంప్ చెప్పిన అబద్ధాన్ని మోదీ నిజం చేశారు

ఎంఐఎం అధ్యక్షుడు అసదుద్దీన్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: కశ్మీర్ సమస్యను పరిష్కరించేందుకు సాయం చేయమని ప్రధాని నరేంద్ర మోదీ తనను రెండుసార్లు కోరారంటూ కొంతకాలంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చెప్తూ వచ్చిన అబద్ధాన్ని ఇప్పుడు స్వయంగా మోదీ నిజం చేశారని ఎంఐఎం పార్టీ అధ్యక్షుడు అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పార్టీ కార్యాలయం దారుసలేంలో జాతీయ మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. సోమవారం నరేంద్రమోదీ.. ట్రంప్‌తో ఫోన్‌లో మాట్లాడిన తీరుపై అసదుద్దీన్ తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. 'కశ్మీర్ అంశం భారత్-పాకిస్తాన్‌లకు సంబంధించిన ద్వైపాక్షిక విషయం. ఇందులో మూడో దేశం జోక్యం ఉండొద్దు. స్వయంగా ప్రధాని కూడా మన్‌కీబాత్ లాంటి వేదికల్లో దీన్ని స్పష్టం చేశారు. కానీ సోమవారం సడన్‌గా ట్రంప్‌కు ఫోన్ చేసి కశ్మీర్ విషయంలో పాకిస్తాన్ తీరు సరికాదంటూ ఫిర్యాదు చేశారు. అసలు కశ్మీర్ విషయంలో జోక్యం చేసుకునేందుకు ట్రంప్ ఎవరు? ఆయనకు ఫిర్యాదు చేయాల్సిన అగత్యమేంటి? కశ్మీర్‌లో మూడో దేశం జోక్యం సహించకూడదనే మన విధానాన్ని మోదీ ఎందుకు మార్చారు?' అని అసదుద్దీన్ ప్రశ్నించారు. తాను జీవితాంతం మోదీ విధానాలపై పోరాడుతూనే ఉంటానని, కానీ దేశం విషయం వచ్చేసరికి ఆయన మన ప్రధాని అన్న విషయాన్ని గుర్తిస్తానని స్పష్టం చేశారు.

ఘనంగా రాజీవ్‌గాంధీ జయంతి

సాక్షి, హైదరాబాద్: మాజీ ప్రధాని, భారతరత్న రాజీవ్‌గాంధీ 75వ జయంతి వేడుకలను కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశాభివృద్ధి, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంలో రాజీవ్ చేసిన కృషిని నేతలు కొనియాడారు. అనంతరం రాజీవ్‌గాంధీ ఫొటోలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ సందర్భంగా గాంధీభవన్‌లో యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ నేతృత్వంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క, మాజీ మంత్రులు పొన్నాల లక్ష్మయ్య, శ్రీధర్ బాబు, షబ్బీర్ అలీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు మల్లు రవి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు సోమాజిగూడలోని రాజీవ్ విగ్రహం వద్ద కూడా టీపీసీసీ నేతలు నివాళులర్పించారు. ఆ తర్వాత ప్రకాశంహాల్‌లో జరిగిన కార్యక్రమానికి మహారాష్ట్ర మాజీ సీఎం పృథ్వీరాజ్ చౌహాన్ తదితరులు హాజరై ప్రసంగించారు.

హెచ్‌సీయూలో ఉద్రిక్తత

- డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను అడ్డుకున్న పోలీసులు
- ఆరుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకున్న వైనం
- మెయిన్ గేట్ వద్ద బైఠాయించి నిరసన తెలిపిన విద్యార్థులు

మంగళవారం హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న ఏఐఎస్ఏ విద్యార్థులు

హైదరాబాద్: రాజధానిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ (హెచ్‌సీయూ) లో మంగళవారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు చోటుచేసుకున్నాయి. క్యాంపస్‌లో డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శనను నిలిపివేయించి, ఆరుగురు విద్యార్థులను పోలీసులు పట్టుకెళ్లడం పట్ల నిరసనలు వ్యక్తమయ్యాయి. క్యాంపస్‌లోకి పోలీసులు రావడం, ఆరుగురు విద్యార్థులను అదుపులోకి తీసుకోవడం పట్ల ఆలిండియా స్టూడెంట్స్ అసోసియేషన్ విద్యార్థులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ హెచ్‌సీయూ మెయిన్ గేట్ వద్ద బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ క్యాంపస్‌లో ఆనంద్ పట్వర్ధన్ రూపొందించిన 'రామ్ కే నామ్' డాక్యుమెంటరీ చిత్రాన్ని సోషల్ సైన్సెస్ భవనంలోని న్యూ సెమినార్ హాల్‌లో ప్రదర్శించాలని ఏఐఎస్ఏ నాయకులు నిర్ణయించారు. అయితే ఆ హాల్‌ను చిత్ర ప్రదర్శనకు ఇవ్వడం కుదరదని డీన్ స్పష్టం చేశారు. దీంతో సోషియాలజీ భవనంలోని సెకండ్ ఫ్లోర్‌లోని ఎంఏ ఫస్ట్ ఇయర్ లెక్చర్ హాల్‌లో ప్రదర్శించేందుకు అనుమతి పొందారు. ఆ తర్వాత చిత్ర ప్రదర్శన ప్రారంభించారు. ఈ నేపథ్యంలోనే పెద్ద సంఖ్యలో పోలీసులు సోషల్ సైన్సెస్ భవనానికి చేరుకుని ప్రదర్శనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది.

ల్యాప్‌టాప్ స్వాధీనం..

ల్యాప్‌టాప్, స్క్రీన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని బాబాజాన్, సోనాల్, నిఖిల్, వికాస్‌తోపాటు మరో ఇద్దరు విద్యార్థి నేతలను పోలీసు వాహనంలోకి ఎక్కించారు. దీంతో ఆ వాహనాన్ని అడ్డుకోవడానికి విద్యార్థులు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. దీంతో విద్యార్థులంతా నినాదాలు చేసుకుంటూ హెచ్‌సీయూ ప్రధాన గేటు వద్ద బైఠాయించారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామని, చీటికిమాటికి పోలీసులు క్యాంపస్‌లోకి రావడం ఏంటని ప్రశ్నించారు. విద్యార్థులను వదిలిపెట్టాలని, చిత్ర ప్రదర్శనకు అనుమతించాలని, పోలీసులు క్యాంపస్‌లోకి రాకూడదని ఏఐఎస్ఏ నాయకులు డిమాండ్ చేశారు.అయితే విద్యార్థులను పోలీసులు విడుదల చేయడంతో ఏఐఎస్ఏ నాయకులు ఆందోళన విరమించారు.

5 వేల కోట్ల మల్టి'ఫుల్' చీటింగ్

- 17 లక్షల మంది సభ్యులతో ఐదువేల కోట్ల మోసం చేసిన ఈ-బిజ్.కామ్ సంస్థ
- ఈ-లెర్నింగ్, ఫ్యాషన్ దుస్తులు, హాలిడే పేర్లతో చైన్‌లింక్ వ్యాపారం
- నోయిడా కేంద్రంగా ఈ-బిజ్.కామ్ పేరుతో వ్యాపార సామ్రాజ్యం
- కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్‌తో పాటు అతని కుమారుడు అరెస్టు
- రూ.389 కోట్లను ఫ్రీజ్ చేసిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగ పోలీసులు

సాక్షి, హైదరాబాద్: మల్టిఫుల్ మార్కెటింగ్ పేరుతో దేశవ్యాప్తంగా 17 లక్షల మంది సభ్యుల్ని చేర్చుకుని వారికి ఏకంగా రూ.ఐదువేల కోట్లు శఠగోపం పెట్టేశారు ఉత్తరప్రదేశ్‌లోని నోయిడాకు చెందిన ఈ బిజ్ కంపెనీ నిర్వాహకులు. మాయమాటలతో కేవలం విద్యార్థులు, నిరుద్యోగులనే లక్ష్యంగా చేసుకుని తమ వ్యాపారాన్ని విస్తరించుకుని వీరిని మాత్రం రోడ్డున పడేశారు. ఈ 'మాయా వలయం'లో మోసపోయామని గ్రహించిన కొందరు పోలీసులకు ఫిర్యాదు చేయగా...విచారణ చేపట్టిన సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఎకనామిక్ ఆఫెన్స్ వింగ్) ఈ కేసును సవాలుగా తీసుకుని ఈ బిజ్ నిర్వాహకుల్ని అరెస్టు చేసి రాష్ట్రానికి తీసుకొచ్చింది. ఈ కేసు వివరాలను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ మంగళవారం మీడియాకు వివరించారు.

విద్యార్థులు, నిరుద్యోగులే లక్ష్యంగా..

'మీకు ఆన్‌లైన్ కోర్సులు నేర్పుతాం..మీరు రూ.16,821లు చెల్లిస్తే చాలు... ఆన్‌లైన్‌లో మంచి పట్టు సాధించొచ్చు. ఆ తర్వాత మరో ముగ్గురిని ఇదే కోర్సులో చేర్పిస్తే ఒక్కొక్కరికి రూ.2,700ల చొప్పున కమీషన్ ఇస్తాం...ఇది కాకుంటే మంచి ఫ్యాషన్ డ్రెస్సులు ఉన్నాయి...మీరు చెల్లించిన డబ్బులకు అవి ఇచ్చేస్తాం...ఇదీ నచ్చకపోతే హాలీడే ట్రిప్స్‌కు తీసుకెళతాం...ఆ తర్వాత మీరు చేయాల్సిందల్లా మరో ముగ్గురు సభ్యులను చేర్పిస్తే చాలు... ఒక్కొక్కరిపై తొమ్మిది శాతం కమీషన్ వస్తుంది. దీంతో మీరు తల్లిదండ్రులపై ఆధారపడకుండా ఎంజాయ్ చేయవచ్చు'టూ కాలేజీ విద్యార్థులనే లక్ష్యంగా చేసుకుని మాయమాటలతో వ్యాపారం కొనసాగిస్తున్నారు ఈ-బిజ్ సంస్థ నిర్వాహకులు. ఇలా దేశవ్యాప్తంగా ప్రజలనుంచి డిపాజిట్లు సేకరించి రూ.ఐదువేల కోట్ల వరకు మోసం చేశారన్న అభియోగాలపై ఈ-బిజ్.కాం ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పవన్ మల్హన్, అతని కుమారుడు హితిక్ మల్హన్‌లను సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం (ఎకనామిక్ ఆఫెన్స్ వింగ్) పోలీసులు యూపీ నోయిడాలో అరెస్టు చేసి సిటీకి తీసుకొచ్చి చర్లపల్లి జైలుకు తరలించారు. దీంతోపాటుగా ఆయా కంపెనీ బ్యాంక్ ఖాతాల్లోని రూ.389 కోట్లను ఫ్రీజ్ చేశారు.

18 ఏళ్లుగా సాగుతున్న మల్టీలెవల్ మోసం

ఈ-బిజ్.కామ్ ప్రైవేట్ లిమిటెడ్‌తో 2001లో ప్రారంభించిన ఈ కంపెనీని న్యూఢిల్లీలోని ఆర్వోసీతో రిజిష్టర్ చేశారు. ఈ కంపెనీ డైరెక్టర్‌గా పవన్ మల్హన్ భార్య అనితా మల్హన్ ఉన్నారు. అయితే, ఈ కంపెనీ వ్యవహారాలను వారి కుమారుడు హితిక్ మల్హన్ పర్యవేక్షిస్తున్నారు. ఈ కంపెనీ సుమారు

వడివడిగా.. చంద్రుడి దిశగా..

విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్-2 మిషన్

సాక్షి, బెంగళూరు/సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) మానసపుత్రిక చంద్రయాన్-2 అంతరిక్ష నౌక చంద్రుడి ఒడిని చేరేందుకు వడివడిగా ఒక్కో మైలురాయిని దాటుకుంటూ ముందుకెళ్తోంది. తాజాగా ఈ ప్రయోగంలో అత్యంత కీలక ఘట్టం మంగళవారం విజయవంతంగా ముగిసింది. ఇప్పటివరకు లూనార్ ట్రాన్స్‌ఫర్ ట్రాజెక్టరీలో చక్కర్లు కొడుతున్న చంద్రయాన్-2 నౌక కీలకమైన చంద్రుడి కక్ష్యలోకి దిగ్విజయంగా ప్రవేశించింది. మంగళవారం ఉదయం 9.02 గంటల ప్రాంతంలో ఆర్బిటర్‌లోని ద్రవ ఇంజిన్‌ను 1,738 సెకన్లపాటు మండించి లూనార్ ఆర్బిట్‌లో అంటే చంద్రుడికి దగ్గరగా 114 కిలోమీటర్లు, చంద్రుడికి దూరంగా 18,072 కిలోమీటర్ల ఎత్తులో దీర్ఘ చతురస్రాకారంలో ప్రవేశపెట్టి భారత ఘనతను ప్రపంచానికి చాటి చెప్పారు. బెంగళూరు సమీపంలో బైలాలులోని భూనియంత్రిత కేంద్రం (మిషన్ ఆపరేటర్ కంట్రోల్ సెంటర్) నుంచి ఇస్రో చైర్మన్ డాక్టర్ కె.శివన్ ఆధ్వర్యంలో కక్ష్య దూరాన్ని పెంచే ప్రక్రియను శాస్త్రవేత్తలు చేపట్టారు.

తదుపరి ప్రక్రియలకు సన్నాహాలు..

ఇక ప్రయోగంలో తదుపరి 18,072 కిలోమీటర్ల దూరాన్ని 4 విడతలుగా తగ్గించుకుంటూ వచ్చి చంద్రుడికి చతురస్రాకారంలో 100 కిలోమీటర్లకు తీసుకొచ్చే ప్రక్రియను చేపట్టేందుకు శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. తర్వాత 100 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్లకు తగ్గించుకుంటూ వచ్చి సెప్టెంబర్ 2వ తేదీన ఆర్బిటర్ నుంచి ల్యాండర్ (విక్రమ్)ను విడిచిపెట్టే ప్రక్రియను చేపట్టేందుకు సన్నద్ధమవుతున్నారు. ఇక ప్రయోగంలో చివరిగా సెప్టెంబర్ 7వ తేదీ ఉదయం 9 నుంచి 10 గంటల్లోపు ల్యాండర్ నుంచి రోవర్ (ప్రజ్ఞాన్) బయటకు వచ్చి చంద్రుడి దక్షిణ ధ్రువంపై అడుగుపెట్టి తన పరిశోధనలను ప్రారంభిస్తుంది.

దశల వారీగా పరిశీలిస్తే..

జీఎస్ఎల్‌వీ మార్క్3-ఎం1 ఉపగ్రహ వాహక నౌక ద్వారా జూలై 22వ తేదీన చంద్రయాన్-2 మిషన్‌ను భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు, భూమికి దూరంగా 45,475 కిలోమీటర్లు ఎత్తులో భూమధ్యంతర కక్ష్యలోకి ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. అనంతరం కక్ష్య దూరాన్ని పెంచడంలో భాగంగా గత నెల 24వ తేదీ తొలి విడత, 26వ తేదీన రెండోసారి, 29వ తేదీన మూడోసారి, ఈ నెల 2వ తేదీన నాలుగోసారి, 6వ తేదీన ఐదోసారి ఆర్బిటర్‌లోని ఇంధనాన్ని మండించి భూమికి దగ్గరగా 276 కిలోమీటర్లు, భూమికి దూరంగా 1,42,975 కిలోమీటర్లను విజయవంతంగా పెంపుదల చేశారు. ఈ నెల 14వ తేదీన ఆరోసారి లూనార్ ఆర్బిట్ ట్రాజెక్టరీలోకి చంద్రయాన్ నౌకను ప్రవేశపెట్టారు. ఇప్పటివరకు మొత్తం 6 సార్లు కక్ష్య దూరం పెంచే ఆపరేషన్‌ను ఇస్రో శాస్త్రవేత్తలు ఎలాంటి సాంకేతికపరమైన లోపం లేకుండా విజయవంతంగా నిర్వహించారు.

ఆ అర్ధగంట.. అత్యంత ఉత్కంఠ..

చంద్రయాన్-2 మిషన్‌ను చంద్రుడి కక్ష్యలో ప్రవేశపెట్టేందుకు మా శాస్త్రవేత్తలు ద్రవ ఇంధనాన్ని మండిస్తున్న సమయంలో నా గుండె కాసేపు ఆగినంత పనైంది. సుమారు ఈ ప్రక్రియ చేపడుతున్న అర్ధగంట సమయం అత్యంత ఉత్కంఠను ఎదుర్కొన్నా'అని మీడియా సమావేశంలో ఇస్రో చైర్మన్ కె.శివన్ తెలిపారు. ల్యాండర్ చంద్రుడిపై దిగే సెప్టెంబర్ 7వ తేదీన ఇంతకంటే అత్యంత ఉత్కంఠ క్షణాలు ఎదుర్కోవాల్సి ఉందని పేర్కొన్నారు.

ప్రధాని మోదీ అభినందనలు..

చంద్రయాన్-2 వ్యోమనౌకను విజయవంతంగా చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టిన ఇస్రో శాస్త్రవేత్తలకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందనలు తెలిపారు. ప్రతిష్టాత్మక చంద్రయాన్-2 ప్రయాణంలో మరో మైలురాయిని ఇస్రో శాస్త్రవేత్తలు విజయవంతంగా ముగించారని మోదీ కొనియాడారు. ఈ మేరకు ఆయన ట్వీట్ చేశారు.

బెంగళూరులో మీడియాతో మాట్లాడుతున్న ఇస్రో చైర్మన్ శివన్

44 ఏళ్ల నాటి విమానం నడపాలా?

ఐఏఎఫ్ చీఫ్ ధనోవా వ్యాఖ్య

న్యూఢిల్లీ: నాలుగు దశాబ్దాల క్రితం నాటి కార్లను ఇప్పుడూ ఎవరూ రోడ్లపై నడపడం లేదనీ, అలాంటప్పుడు 44 ఏళ్ల నాటి యుద్ధ విమానాలను ఎందుకు ఉపయోగించాలని భారత వైమానిక దళం (ఐఏఎఫ్) అధిపతి, ఎయిర్ చీఫ్ మార్షల్ బీఎస్ ధనోవా మంగళవారం ప్రశ్నించారు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సమక్షంలో ఢిల్లీలో ఓ కార్యక్రమంలో ధనోవా ఇలా మాట్లాడారు. మిగ్-21 యుద్ధ విమానం గురించి ఆయన ప్రస్తావిస్తూ, 'ఈ విమానాన్ని 1973-74లో వాయుసేనలో చేర్చారు. ప్రస్తుతం వీటిలో ఐదో తరం యుద్ధ విమానాలు వచ్చేశాయి. ఆ తర్వాతి తరం విమానాలు కూడా రూపుదిద్దుకుంటున్నాయి. ఇలాంటి పాత విమానాలతో మనం విజయం సాధించలేకపోతే దానిని భరించగలమా? యుద్ధం లేనంత మాత్రాన మొత్తం ఆధునిక సాంకేతికత స్వదేశంలో తయారయ్యేంత వరకు మనం వేచి ఉండలేం. అయితే రక్షణ వస్తువులను అన్నింటికీ విదేశాల నుంచి దిగుమతి చేసుకోవడం కూడా తెలివైన పని కాదు. దాదాపు 44 ఏళ్ల క్రితం నాటి మిగ్-21 ఎంఎఫ్ విమానాన్ని నేను ఇంకా నడపగలుగుతున్నాను. కానీ అంత పాత కారును మీరెవ్వరూ ఇప్పుడు నడపడం లేదని నేను కచ్చితంగా చెప్పగలను' అని ధనోవా అన్నారు. భారత వింగ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్ పాకిస్తాన్‌కు చెందిన ఎఫ్-16 యుద్ధ విమానాన్ని కూల్చినప్పుడు ఉపయోగించింది కూడా ఈ మిగ్-21 విమానాన్నే.

చిదంబరం కస్టడీ అవసరమే

- ఐఎన్ఎక్స్ కేసులో ఢిల్లీ హైకోర్టు తీవ్ర వ్యాఖ్య
- ముందస్తు బెయిలు ఇచ్చేందుకు నిరాకరణ

న్యూఢిల్లీ: కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పి.చిదంబరం ఐఎన్ఎక్స్ మీడియా కేసులో ప్రధాన నిందితుడని ప్రాథమికంగా తెలుస్తోందనీ, ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని ఢిల్లీ హైకోర్టు మంగళవారం వ్యాఖ్యానించింది. ఈ కేసుకు సంబంధించి అవినీతి, నగదు అక్రమ చలామణి కేసుల్లో చిదంబరం దాఖలు చేసిన ముందస్తు బెయిలు పిటిషన్‌ను తోసిపుచ్చింది. దీంతో చిదంబరంను అరెస్టు చేసేందుకు సీబీఐ, ఈడీలకు మార్గం సుగమమైంది. మంగళవారం రాత్రే సీబీఐ, ఈడీ అధికారుల బృందాలు ఢిల్లీలోని చిదంబరం ఇంటికి చేరుకోగా, ఆ సమయంలో ఆయన ఇంట్లో లేరని సమాచారం. 3రోజుల్లో తాము సుప్రీంకోర్టులో పిటిషన్ వేయనున్నాననీ, అంతవరకు తనను అరెస్టు చేయకుండా తాత్కాలిక రక్షణ కలిపించాలని చిదంబరం కోరినా హైకోర్టు ఒప్పుకోలేదు. దీంతో ముందస్తు బెయిలు కోసం సుప్రీంకోర్టులో బుధవారమే అత్యవసర విచారణ కోరాలని చిదంబరం లాయర్లు నిర్ణయించారు.

విచారణను నీరుగార్చలేం..

అరెస్టు నుంచి తప్పించుకునేందుకు తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ



చిదంబరం ఢిల్లీ హైకోర్టులో గతంలో పిటిషన్ వేశారు. గురువారం పదవీ విరమణ పొందనున్న న్యాయమూర్తి జస్టిస్ సునీల్ గౌర్ చిదంబరం అభ్యర్థనను తోసిపుచ్చారు. చిదంబరమే ప్రధాన నిందితుడనీ ప్రాథమికంగా తెలుస్తున్నందున, న్యాయపరమైన అడ్డంకులను సృష్టించి దర్యాప్తు సంస్థలను విచారణను నీరుగార్చలేమని ఆయన అన్నారు. హైకోర్టులో ఎలాంటి ఉపశమనమూ లభించకపోవడంతో చిదంబరం ఆ వెంటనే సుప్రీంకోర్టుకు వెళ్లారు. అక్కడ కూడా ఆయనకు తక్షణ ఉపశమనమేదీ లభించనప్పటికీ, ఆయన పిటిషన్ బుధవారం విచారణకు రానుంది.

చిదంబరం ఇంటికి సీబీఐ, ఈడీ

చిదంబరానికి ముందస్తు బెయిలును నిరాకరిస్తూ సాయంత్రం 3.40 గంటల సమయంలో ఢిల్లీ హైకోర్టు తీర్పునివ్వడంతో రాత్రికే సీబీఐ, ఈడీ అధికారులు ఢిల్లీలోని చిదంబరం ఇంటికి చేరుకున్నారు. మొదట సీబీఐ, ఆ తర్వాత కొద్దిసేపటికే ఈడీ అధికారులు వెళ్లారు. అయితే అధికారులు ఎవ్వరూ మీడియాతో మాట్లాడలేదు. చిదంబరం ఇంటికి రావడం వెనుక ఉన్న ఉద్దేశమేంటని ప్రశ్నించినా వారు నోరు మెదపలేదు. అధికారులు వెళ్లిన సమయంలో చిదంబరం ఇంట్లో లేరని సమాచారం.

మంగళవారం ఢిల్లీలో చిదంబరం నివాసంలో సోదాలు చేసేందుకు వచ్చిన ఈడీ అధికారులు

'ఐఎన్ఎక్స్ మీడియా కేసులో చిదంబరం ప్రధాన నిందితుడని ప్రాథమికంగా తెలుస్తోంది. ఆయనను కస్టడీలోకి తీసుకుని విచారించాల్సిన అవసరం ఉందని మేం భావిస్తున్నాం. చిదంబరం పార్లమెంటు సభ్యుడు అయినంత మాత్రాన ఆయనకు ముందస్తు బెయిలు ఇవ్వలేం. రాజకీయ కక్ష సాధింపులో భాగంగా చిదంబరంపై ఈ కేసులు పెట్టారని ఇప్పుడే చెప్పడం అర్థం లేని పని.'

– ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ సునీల్ గౌర్

'మరో రెండ్రోజుల్లో పదవీ విరమణ పొందనున్న న్యాయమూర్తి జస్టిస్ సునీల్ గౌర్ హడావుడిగా సాయంత్రం 3.40 గంటలకు ఈ తీర్పు చెప్పారు. ఈ తీర్పును ఈ ఏడాది జనవరిలోనే రిజర్వ్‌లో ఉంచారు. మరో మూడు రోజులు ఆగి తీర్పును వెలువరించాలని కోరాం. అయినా జస్టిస్ గౌర్ మా విజ్ఞప్తిని పట్టించుకోకుండా మంగళవారమే తీర్పు ఇచ్చారు.'

– కపిల్ సిబల్, చిదంబరం తరపు న్యాయవాది

ఐఎన్ఎక్స్ కేసు ఇదీ..

2007- ఐఎన్ఎక్స్ మీడియా సంస్థకు విదేశాల నుంచి రూ. 305 కోట్ల నిధులు అందుకోవడానికి ఆమోదం తెలిపిన విదేశీ పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (ఎఫ్ఐపీబీ). ఆ సమయంలో కేంద్ర ఆర్థిక మంత్రిగా ఉన్న చిదంబరం. ఎఫ్ఐపీబీ ఆమోదం లభించడం వెనుక అవకతవకలు ఉన్నాయని ఆరోపణలు.

- 2017 మే 15: ఐఎన్ఎక్స్ మీడియా వ్యవహారంపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ.
- 2018 : ఐఎన్ఎక్స్ మీడియాపై మనీ లాండరింగ్ కేసు పెట్టిన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ).
- 2018 మే 30 : సీబీఐ కేసులో తనకు ముందస్తు బెయిలు మంజూరు చేయాలంటూ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన చిదంబరం.
- 2018 జూలై 23:ఈడీ కేసులోనూ ముందస్తు బెయిలు ఇవ్వాలని మరోసారి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేసిన చిదంబరం.
- 2018 జూలై 25 : ఈ రెండు కేసుల్లోనూ అరెస్టు నుంచి తాత్కాలిక రక్షణ కలిపిస్తూ తొలిసారి ఉత్తర్వులిచ్చిన ఢిల్లీ హైకోర్టు. ఆ తర్వాత పలుమార్లు ఆ గడువు పొడిగింపు.
- 2019 జనవరి 25: ముందస్తు బెయిలుపై తీర్పును రిజర్వ్‌లో ఉంచిన ఢిల్లీ హైకోర్టు.
- 2019 ఆగస్టు 20 : తీర్పు చెబుతూ, చిదంబరం బెయిలు అభ్యర్థనను తోసిపుచ్చిన హైకోర్టు.

ట్రంప్ పదోసారి..

న్యూయార్క్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాత అయ్యారు. ఆయన కుమారుడు ఎరిక్ ట్రంప్ భార్య లారా సోమవారం రాత్రి ఒక ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఎరిక్ ట్విటర్‌లో పంచుకున్నాడు. 'ఈ ప్రపంచంలోకి కరోలినా డొరొతీ ట్రంప్ ను ఆహ్వానిస్తున్నాం' అంటూ ఆయన ట్వీట్ చేశారు. డొరొతితో కలుపుకుని డొనాల్డ్ ట్రంప్ మనవలు, మనవరాళ్ల సంఖ్య 10కి చేరింది. ఎరిక్‌కు ఇప్పటికే ఒక బాబు ఉన్నాడు. ముగ్గురు భార్యలున్న ట్రంప్‌నకు మొత్తం ఐదుగురు పిల్లలు. వారిలో పెద్దవాళ్లైన డొనాల్డ్ జూనియర్‌కు ఐదుగురు, ఇవాంకా ట్రంప్‌నకు ముగ్గురు పిల్లలు. ట్రంప్‌నకు సంబంధించిన వ్యాపార వ్యవహారాలను ఎరిక్ చూసుకుంటారు.

అమెరికా క్షిపణి ప్రయోగం సక్సెస్

వాషింగ్టన్/మాస్కో: మధ్యశ్రేణి క్రూయిజ్ క్షిపణిని అగ్రరాజ్యం అమెరికా విజయవంతంగా ప్రయోగించింది. అణు సామర్థ్యమున్న ఆయుధాల వ్యాప్తిని అరికట్టేందుకు ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో రష్యాతో కుదుర్చుకున్న ఒప్పందం నుంచి బయటకు వస్తున్నట్లు ప్రకటించిన కొద్ది వారాల్లోనే అమెరికా ఈ ప్రయోగం చేపట్టడం గమనార్హం. లాస్‌ఏంజెలెస్ సమీపంలోని సాన్ నికొలస్ దీవిలో ఆదివారం ఈ ప్రయోగం చేపట్టినట్లు అమెరికా రక్షణ శాఖ ప్రకటించింది. భూమిపై నుంచి ప్రయోగించిన ఈ క్షిపణి 500 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాన్ని కచ్చితంగా ఛేదించిందని పేర్కొంది. అయితే, ఈ క్షిపణిలో అణ్వాయుధాలు లేవని పేర్కొంది. అమెరికా చర్యపై రష్యా, చైనా మండిపడ్డాయి.

పెరుగుతోన్న విద్వేషం, అసహనం

రాజీవ్ జయంతి సభలో మన్మోహన్

న్యూఢిల్లీ: మనుషుల మధ్య కొన్ని వర్గాలు రెచ్చగొడుతున్న విద్వేషాలతో హింసాత్మక నేరాలు ఎక్కువైపోయాయని, ఎన్నడూలేని విధంగా మత విద్వేషాలు, అసహనం, హింసాత్మక నేరాలు పెరిగిపోయాయని, రాజకీయాలు కూడా కలుషితమైపోయాయని మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేర్కొన్నారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 75వ జయంతి సందర్భంగా రాజీవ్ యూత్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో మన్మోహన్ సింగ్ మాట్లాడారు. అంతకుముందు రాజీవ్‌కు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..భారత రాజ్యాంగంలో పొందుపరిచిన మతసామరస్యం, జాతీయ సమైక్యత, శాంతి ప్రచారం వంటి లక్ష్యాలకు ఇటువంటి విపరీత పోకడలు విఘాతం కలిగిస్తాయన్నారు.

- రోజుకు 314 కిలోమీటర్లు

సైకిల్‌పై 16 దేశాల గుండా 7 రోజుల్లో 2,200 కిలోమీటర్ల దూరం ప్రయాణించి గిన్నిస్ ప్రపంచ రికార్డు నెలకొల్పేందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన స్టీఫెన్ కాండ్ ప్రయత్నిస్తున్నాడు. బెల్జియం-నెదర్లాండ్స్ సరిహద్దులో తీసిన ఫొటో ఇది. రోజులో 3 నుంచి 4 గంటలపాటు మాత్రమే నిద్రిస్తూ 314 కి.మీ.లకుపైగా ఇలా సైకిల్ తొక్కుతూ గిన్నిస్ రికార్డు దిశగా దూసుకెళ్తున్నాడు

హింసాత్మక ఘటనపై చింతిస్తున్నా

మోదీతో ఫోన్‌లో బ్రిటన్ ప్రధాని జాన్సన్

న్యూఢిల్లీ: లండన్‌లోని భారత హై కమిషన్ కార్యాలయం బయట స్వాతంత్ర్య దినోత్సవాల ప్పుడు జరిగిన హింసాత్మక ఘటనకు తాను చింతిస్తున్నట్లు బ్రిటన్ ప్రధాని బోరిస్ జాన్సన్ భారత ప్రధాని మోదీతో చెప్పారు. వారిద్దరు మంగళవారం ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సంభాషణపై ఢిల్లీలోని ప్రధాని కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. కశ్మీర్‌లో ఆర్టికల్ 370ని భారత్ రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తూ కొన్ని పాకిస్తానీ సంఘాలు, కశ్మీర్, సిక్కు వేర్పాటువాద బృందాల సభ్యులు హైకమిషన్ ఎదుట ర్యాలీ చేశాయి. దీంతో భారత అనుకూల బృందాలూ ర్యాలీ చేపట్టడంతో గొడవలు జరిగి హింసాత్మక ఘటనలు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనపై తాను చింతిస్తున్నట్లు జాన్సన్ మోదీతో అన్నారు. భారత హై కమిషన్, ఆ కార్యాలయ ఉద్యోగులకు భద్రత కల్పిస్తామని బోరిస్ జాన్సన్ హామీనిచ్చారు.

ఎట్టకేలకు యడియూరప్ప కేబినెట్

17 మందితో మంత్రివర్గం

సాక్షి, బెంగళూరు: గత నెల 26వ తేదీన కర్ణాటక ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన ముఖ్యమంత్రి యడియూరప్ప ఎట్టకేలకు మంగళవారం కేబినెట్‌ను ఏర్పాటు చేశారు. సుమారు నెల రోజులపాటు సాగిన తిరుగుబాటు పర్వం తరువాత కాంగ్రెస్- జేడీఎస్ సంకీర్ణ సర్కారును సాగనంపి బీజేపీ ప్రభుత్వం గద్దెనెక్కడం తెలిసిందే. అనేక కసరత్తుల అనంతరం 17 మంది సభ్యులతో కూడిన మంత్రివర్గం మంగళవారం ఏర్పాటయింది. బెంగళూరులోని రాజ్‌భవన్‌లో గవర్నర్ వజుభాయివాలా వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. 16 మంది బీజేపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కాగా, ఒక స్వతంత్ర ఎమ్మెల్యే ఉన్నారు.

నాటి ముఖ్యమంత్రి, నేటి మంత్రి

బీజేపీ విజయంలో కీలక పాత్ర పోషించిన వీరశైవ-లింగాయత్, ఒక్కలిగ, బ్రాహ్మణ, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఎక్కువ పదవులు దక్కాయి. 2008లో కర్ణాటక సీఎంగా పనిచేసిన జగదీశ్ శెట్టర్ ఈసారి మంత్రిగా ప్రమాణం చేశారు. రాష్ట్ర చరిత్రలో ఒక మాజీ ముఖ్యమంత్రి మళ్లీ కేబినెట్‌లో మంత్రిగా బాధ్యతలు చేపట్టడం ఇదే తొలిసారి. మాజీ డిప్యూటీ సీఎంలు కేఎస్ ఈశ్వరప్ప, ఆర్. అశోక కేబినెట్‌లో ఉన్నారు. మరో 16 మంత్రి పదవులు ఖాళీగా ఉండగా 17 జిల్లాలకు కేబినెట్‌లో ప్రాతినిధ్యం దక్కలేదు.

మంత్రిగా ప్రమాణం చేస్తున్న శ్రీరాములు

కశ్మీర్‌పై ఐసీజేకి వెళ్తాం:పాక్

- ఎల్‌వోసీ వెంట పాక్ కాల్పులు: ఒక భారత జవాను మరణం
- అభినందన్‌ను చిత్రహింసలు పెట్టిన పాక్ కమాండో భారత కాల్పుల్లో హతం

ఇస్లామాబాద్/జమ్మూ/శ్రీనగర్: కశ్మీర్ అంశాన్ని అంతర్జాతీయ న్యాయస్థానం(ఐసీజే) దృష్టికి తీసుకెళ్లనున్నట్లు పాక్ తెలిపింది. ఇందుకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని విదేశాంగ మంత్రి ఖురేషి తెలిపారు. కశ్మీర్ అంశాన్ని అన్ని అంతర్జాతీయ వేదికలపైనా ప్రస్తావించడంతో పాటు, ఐసీజేలోనూ పిటిషన్ వేస్తామని ఆగస్టు 6వ తేదీన జరిగిన పార్లమెంట్ ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రధాని ఇమ్రాన్ ఇటీవల చెప్పారు.

పాక్ కాల్పుల్లో భారత జవాను మృతి

నియంత్రణ రేఖ వెంబడి ఉన్న గ్రామాలు, భారత ఆర్మీ పోస్టులే లక్ష్యంగా పాక్ బలగాలు మరోసారి కాల్పులకు తెగబడ్డాయి. పూంచ్ జిల్లాలో జరిపిన కాల్పుల్లో ఓ ఆర్మీ జవాను మరణించగా, నలుగురు పౌరులు గాయపడ్డారు. భారత బలగాలు జరిపిన కాల్పుల్లో పాక్ ఆర్మీకి భారీ నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. సరిహద్దు వెంబడి కృష్ణా ఘటి, మెందర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం పాకిస్తాన్ బలగాలు కాల్పులు ప్రారంభించాయి. ఈ కాల్పుల్లో బిహార్‌కు చెందిన రవిరంజన్ సింగ్ (36) మరణించగా నలుగురు పౌరులు గాయపడ్డారని అధికారులు వెల్లడించారు. కాగా, బాలాకోట్ దాడుల సమయంలో పాక్ విమానాలను మిగ్-21తో ఎంతో ధైర్యంగా తరుముకుంటూ వెళ్లిన ఐఏఎఫ్ కమాండర్ అభినందన్ వర్ధమాన్‌ను చిత్రహింసలు పెట్టిన పాక్ కమాండో అహ్మద్ ఖాన్.. భారత సైన్యం కాల్పుల్లో హతమైనట్లు సమాచారం. ఆగస్టు 17వ తేదీన భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తుండగా నక్యాల్ సెక్టార్‌లో సైన్యం జరిపిన కాల్పుల్లో అహ్మద్ ఖాన్ మరణించినట్లు సమాచారం. మిగ్ 21 జెట్ విమానాన్ని కూల్చేయడంతో తప్పించుకున్న అభినందన్‌ను పాక్ సైన్యం పట్టుకున్న విషయం తెలిసిందే. కాగా, జమ్మూ కశ్మీర్‌లో క్రమంగా ప్రశాంత వాతావరణం నెలకొంటోంది. దాదాపు 15 రోజుల తర్వాత మంగళవారం శ్రీనగర్‌లో వాణిజ్య కేంద్రం లాల్ చౌక్ వద్ద బారికేడ్లను పోలీసులు తొలగించారు. పలు ప్రాంతాల్లో ఆంక్షలను సడలించారు. శాంతి భద్రతల దృష్ట్యా కొన్ని ప్రాంతాల్లో భద్రతా బలగాల మోహరింపు కొనసాగుతోంది. మొబైల్, ఇంటర్నెట్ సర్వీసులపై నిషేధం కొనసాగుతోంది. కశ్మీర్లోకి ప్రవేశించేందుకు యత్నించిన కాంగ్రెస్ సీనియర్ నేత ఆజాద్‌ను జమ్మూ ఎయిర్‌పోర్ట్‌లో పోలీసులు అడ్డుకుని తిరిగి ఢిల్లీకి పంపేశారు.

అహ్మద్ ఖాన్

ఇమ్రాన్..జాగ్రత్తగా మాట్లాడండి!

- భారత్ వ్యతిరేక వ్యాఖ్యలపై పాక్ ప్రధానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూచన
- కశ్మీర్ భారత అంతర్గత అంశమన్న అగ్రరాజ్యం

వాషింగ్టన్: భారత్‌పై చేసే వ్యాఖ్యల విషయంలో జాగ్రత్తగా ఉండాలని పాక్ ప్రధాని ఇమ్రాన్‌కు సూచించినట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ ప్రాంతంలో పరిస్థితి జఠిలంగానే ఉందని, ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు కలిసి పనిచేయాలని భారత్, పాక్‌లను ఆయన కోరారు. కశ్మీర్ విషయంలో తలెత్తిన ఉద్రిక్తతలను తగ్గించుకునేందుకు భారత్‌తో కలిసి పనిచేయాలని, సంయమనంతో వ్యవహరించాలని, అదే సమయంలో భారత్‌పై చేసే వ్యాఖ్యల విషయంలో నిగ్రహంతో వ్యవహరించాలని అధ్యక్షుడు ట్రంప్ ఇమ్రాన్‌ను కోరారని అధ్యక్ష భవనం ఒక ప్రకటనలో పేర్కొంది. జమ్మూకశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తిని రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ భారత్ తీసుకున్న నిర్ణయంపై పాక్ తీవ్ర అభ్యంతరం తెలపడం, రెండు దేశాల మధ్య మరోసారి ఉద్రిక్తతలు తలెత్తిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇరు దేశాల ప్రధానులతో సోమవారం ఫోన్‌లో సంభాషించారు. అనంతరం ఆయన ట్విట్టర్‌లో 'వాణిజ్యం, వ్యూహాత్మక భాగస్వామ్యం పెంపుతో రెండు దేశాల ప్రధానులతో చర్చించా. ముఖ్యంగా కశ్మీర్ విషయంలో ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని భారత్, పాక్ ప్రధానులు నరేంద్ర మోదీ, ఇమ్రాన్‌ఖాన్‌లకు సూచించా. అక్కడ పరిస్థితి జఠిలంగానే ఉన్నప్పటికీ, మా మధ్య సంభాషణలు ఫలప్రదంగా సాగాయి'అని ట్రంప్ ట్విట్టర్‌లో తెలిపారు. భారత్, పాక్‌ల మధ్య ఉద్రిక్తతలను తగ్గించుకోవాలని, ఆ ప్రాంతంలో శాంతి నెలకొనాల్సిన అవసరాన్ని అధ్యక్షుడు ట్రంప్ వారికి వివరించారు. ప్రాంతీయ పరిణామాలతోపాటు అమెరికా- భారత్ వ్యూహాత్మక భాగస్వామ్యంపైనా భారత ప్రధాని మోదీతో చర్చించారని, త్వరలోనే మరోసారి సమావేశం కావాలని ఆకాంక్షించారని తెలిపింది. ఉగ్రవాదం, హింసకు తావులేని వాతావరణం నెలకొల్పాల్సిన అవసరాన్ని, సీమాంతర ఉగ్రవాదాన్ని పోషించడం పాక్ ఆపాలని ట్రంప్‌ను మోదీ కోరారని వెల్లడించింది. భారత ప్రభుత్వం జాత్యహంకార, ఫాసిస్టు ధోరణితో వ్యవహరిస్తోందని, దీని కారణంగా పాకిస్తాన్‌తోపాటు భారత్‌లోని మైనారిటీల సంక్షేమం ప్రమాదంలో పడిందని ఇమ్రాన్ ఖాన్ ఆదివారం తీవ్ర వ్యాఖ్యలు చేశారు. భారత్ వద్ద ఉన్న అణ్వాయుధాల భద్రతపై అంతర్జాతీయ సమాజం దృష్టి పెట్టాలన్నారు. సోమవారం ట్రంప్‌తో దాదాపు అరగంటపాటు జరిగిన ఫోన్ సంభాషణల్లో ప్రధాని మోదీ ఈ విషయాన్ని పరోక్షంగా ప్రస్తావించిన విషయం తెలిసిందే. అనంతరం ట్రంప్ పాక్ ప్రధానితో మాట్లాడారు. అయితే, కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితులపై జోక్యం చేసుకోవాలని అధ్యక్షుడు ట్రంప్‌ను ప్రధాని ఇమ్రాన్ కోరారని పాక్ విదేశాంగ మంత్రి షా మహ్మూద్ ఖురేషి పేర్కొన్నారు. కశ్మీర్‌లో ఆంక్షలను ఎత్తివేయాలని, మానవహక్కుల సంఘాలను కశ్మీర్‌లో పరిస్థితులపై అంచనా వేసేందుకు పంపించాలని కూడా ఇమ్రాన్ కోరారన్నారు. ఇలా ఉండగా, భారత రక్షణ మంత్రి రాజ్‌నాథ్ మంగళవారం అమెరికా రక్షణ మంత్రి ఎస్పెర్‌తో ఫోన్‌లో సంభాషించారు. భారత్‌కు వ్యతిరేకంగా కొనసాగుతున్న సీమాంతర ఉగ్రవాదాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. ఆర్టికల్ 370 రద్దు, సంబంధిత అంశాలు తమ అంతర్గత విషయమని కూడా పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌కు సంబంధించి జరుగుతున్న పరిణామాలు భారత్ అంతరంగిక వ్యవహారమని, భారత ప్రభుత్వం తీసుకున్న చర్యలను ఎస్పెర్ ప్రశంసించారని అధికారులు తెలిపారు. భారత్, పాక్‌కు ఈ అంశాన్ని ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలని కూడా సూచించారన్నారు.

సాక్షి
బుధవారం, ఆగస్టు, 21

కోటాపై మళ్లీ దుమారం

ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ మళ్లీ 'కోటా' తుట్టె కదిలించారు. రిజర్వేషన్లపై సమాజంలో సామరస్యపూర్వకమైన చర్చ జరగాలంటూ ప్రతిపాదించారు. దీనిపై వెంటనే చానెళ్లలో, సామాజిక మాధ్యమాల్లో దుమారం రేగడంతో ఆరెస్సెస్ వివరణ ఇచ్చింది. సంక్లిష్టమైన అంశాలను సుహృద్భావ వాతావరణంలో చర్చించుకోవాలన్నదే ఆయన ఉద్దేశమని చెప్పింది. వివిధ వర్గాలకు ఇప్పుడిస్తున్న రిజర్వేషన్లను తాము సంపూర్ణంగా సమర్థిస్తున్నామని ప్రకటించింది. నాలుగేళ్లక్రితం కూడా మోహన్ భాగవత్ ఇటువంటి వివాదాన్నే రేపారు. ఎవరికి రిజర్వేషన్లు అవసరమో, ఎంతకాలం అవసరమో తేల్చడానికి ఒక 'రాజకీయేతర సంఘాన్ని' ఏర్పాటు చేయాలని అభిప్రాయపడ్డారు. అప్పట్లో బీజేపీ నేతలు ఆయన అభిప్రాయాలతో తమకు ఏకీభావం లేదని ఆదరాబాదరాగా ప్రకటించగా, ఆయన చేసిన వ్యాఖ్యల ఉద్దేశం వేరని ఆరెస్సెస్ వివరించింది. ఇప్పుడు కూడా ఆయన వ్యాఖ్యలు సంచలనం సృష్టించాయి.

రిజర్వేషన్ల విషయంలో దాని అనుకూలురు, వ్యతిరేకులమధ్య చర్చ జరుగుతున్నదని, అది సామరస్యపూర్వకంగా లేదని భాగవత్‌కు ఎందుకు అనిపించిందో తెలియదు. నిజానికి ఈ అంశంపై గతంతో పోలిస్తే ఇప్పుడు పెద్దగా చర్చలేదు. పోటాపోటీ ఉద్యమాలు, వాగ్యుద్ధాలు జరగటం లేదు. పైపెచ్చు ఒకప్పుడు రిజర్వేషన్లను తీవ్రంగా వ్యతిరేకించిన వర్గాలే ఇప్పుడు తమకూ ఆ మాదిరి సౌకర్యం కల్పించాలని కోరుతున్నాయి. గుజరాత్‌లో ఒకప్పుడు రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సాగిన ఉద్యమానికి నాయకత్వం వహించిన పటేళ్లు తమకు కూడా విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు కల్పించాలంటూ రోడ్డెక్కారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ ఆధిపత్య కులాలవారు తమకు కొత్తగా రిజర్వేషన్లు కల్పించాలని కోరుతుండటం వర్తమాన పరిస్థితి. అలాగే బీసీ కులాల జాబితాల్లో ఉన్న కొన్ని కులాలు తమను షెడ్యూల్ కులాలుగా గుర్తించాలని డిమాండ్ చేస్తుంటే, కొందరు తమను ఎస్టీలుగా గుర్తించాలని కోరుతున్నారు. రిజర్వేషన్లను వర్గీకరించాలని, ఆ ఫలాలు తమకు కూడా దక్కేందుకు చర్యలు తీసుకోవాలని అట్టడుగు కులాల్లో బాగా దిగువన ఉండిపోయిన కొన్ని కులాలు కోరుతున్నాయి. మొత్తంగా చూస్తే ఇప్పుడు రిజర్వేషన్లు ఆశిస్తున్నవారే ఎక్కువ. అందుకోసం పలు రాష్ట్రాల్లో ఉద్యమాలు సాగుతున్నాయి. ఇలా కొత్తగా వస్తున్న డిమాండ్లను గమనించి కొన్ని రాష్ట్రాలు కోటాకు సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని తొలగించాలని కేంద్రాన్ని గతంలో కోరాయి. ఈ ఏడాది మొదట్లో నరేంద్ర మోదీ ప్రభుత్వం జనరల్ కేటగిరీలోని ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు 10 శాతం కోటా కల్పిస్తూ జీవో విడుదల చేసింది. పర్యవసానంగా రిజర్వేషన్ల శాతం సుప్రీంకోర్టు విధించిన పరిమితిని దాటింది. ఈ విషయంలో దాఖలైన పిటిషన్లు ప్రస్తుతం సుప్రీంకోర్టు విచారణలో ఉన్నాయి. మరాఠాలకు విద్య, ఉద్యోగాల్లో 16శాతం రిజర్వేషన్ కల్పించాలని మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని మొన్న జూన్‌లో బొంబాయి హైకోర్టు ఆమోదిస్తూనే స్వల్పంగా సవరించింది. పర్యవసానంగా అక్కడి కోటా 65శాతానికి చేరింది.

మన దేశంలో శతాబ్దాలుగా వేళ్లూనుకున్న కుల వ్యవస్థ వల్ల కొన్ని కులాలవారు సామాజికంగా నిరాదరణకు లోనవుతున్నారని, అటువంటి వర్గాలను ఆదుకోవడానికి, ఉద్ధరించడానికి తగిన చర్యలు అవసరమని బ్రిటిష్ పాలన సమయంలోనే గుర్తించారు. అప్పట్లోనే కొన్ని అట్టడుగు కులాలకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించారు. శతాబ్దాల అసమానతలు సృష్టించిన అంతరాలను తగ్గించడానికి ఇది తప్పనిసరనుకున్నారు. స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగ నిర్మాతలు కూడా ఆ విధంగానే భావించారు. కనుకనే షెడ్యూల్ కులాలకు, షెడ్యూల్ తెగలకు రిజర్వేషన్ల సౌకర్యం కల్పించారు. నిజానికి అప్పట్లోనే సామాజికంగా వెనకబడి ఉన్న కులాలకు కూడా ఈ సదుపాయం కల్పించి ఉంటే వేరుగా ఉండేది. కానీ అది జరగడానికి మరికొన్ని దశాబ్దాలు పట్టింది. 1979లో జనతా పార్టీ ప్రభుత్వం కుల వివక్ష కారణంగా వెనకబాటుతనానికి గురవుతున్న కులాలను గుర్తించేందుకు మండల్ కమిషన్ ఏర్పాటు చేసింది. అది చాలా చురుగ్గా పనిచేసి ఆ మరుసటి ఏడాదికల్లా సమగ్రమైన నివేదిక సమర్పించింది. దాదాపు మరో పదేళ్ళకు గానీ మండల్ కమిషన్ నివేదికకు మోక్షం కలగలేదు. 1989లో అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం ఆ నివేదిక దుమ్ము దులిపి ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ చరిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ఆ నిర్ణయాన్ని తప్పుబడుతూ దేశవ్యాప్తంగా ఉధృతంగా ఆందోళనలు సాగాయి. కొన్ని చోట్ల హింస చెలరేగింది. అలా రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగబద్ధమేనని 2008లో సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. చిత్రమేమంటే అప్పట్లో ఆందోళన చేసిన కులాలే దాదాపు అన్నిచోట్లా తమకూ కోటా కల్పించాలని కోరుతున్నాయి. ఏతావాతా రిజర్వేషన్ల విషయంలో వ్యక్తులుగా ఎవరికెలాంటి అభిప్రాయాలైనా ఉండొచ్చుగానీ... వాటిని రద్దు చేయాలని కోరే కులాలు, సంస్థలూ, పార్టీలూ ఇప్పుడు దాదాపు లేవు. కనుకనే మోహన్ భాగవత్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

సామరస్యపూర్వక చర్చ జరగాలనే ముందు సంస్థగా రిజర్వేషన్ల విషయంలో తమ వైఖరేమిటో భాగవత్ చెప్పివుంటే సరిపోయేది. ఆయన అస్పష్టంగా ఏదో ఒకటి అనడం, అనంతరం దానిపై దుమారం రేగడం, ఆ తర్వాత సంస్థ తరపున ఒక వివరణ రావడం సహజంగానే సంశయాలను రేకెత్తిస్తుంది. విపక్షాల సంగతలా ఉంచి, బీజేపీ మిత్రపక్షం రిపబ్లికన్ పార్టీ అధినేత, కేంద్రమంత్రి రాందాస్ అథవాలే సైతం రిజర్వేషన్లపై చర్చ వృథా అంటున్నారు. రిజర్వేషన్లు అవసరమా, కాదా అనే అంశం చర్చనీయాంశమే కాదంటున్నారు. రిజర్వేషన్ల ఆలోచనకు మూలమైన కుల వివక్ష, అసమానతలు మన దేశంలో పూర్తిగా అంతరించాయా లేదా అన్న అంశంపై చర్చ జరగాలి. అప్పుడు ఈ రిజర్వేషన్లను కొనసాగించాలో లేదో నిర్ణయించుకోవడం పెద్ద కష్టం కాదు.

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, శ్రావణ మాసం, తిథి బ.షష్ఠి రా.2.34 వరకు
తదుపరి సప్తమి, నక్షత్రం అశ్విని రా.9.50 వరకు
తదుపరి భరణి, వర్జ్యం సా.5.31 నుంచి 7.14 వరకు
దుర్ముహూర్తం ప.11.37 నుంచి 12.28 వరకు
అమృతఘడియలు... ప.2.08 నుంచి 3.46 వరకు.

సూర్యోదయం : 5.47
సూర్యాస్తమయం: 6.20
రాహుకాలం : ప. 12.00 నుంచి 1.30 వరకు
యమగండం : ఉ.7.30 నుంచి 9.00 వరకు

'సాగు' బాగుంటేనే ప్రగతి సాధ్యం

విశ్లేషణ

దేవీందర్ శర్మ

దేశంలో కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సన్నకారు రైతులు గరిష్టంగా చేసిన రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేస్తున్నందుకే మన ఆర్థికవేత్తలు, ఆర్థికరంగ సమర్థకులు ద్రవ్యలోటు చుక్కలంటుతుందంటూ ఆరోపణలు గుప్పిస్తున్నారు. కానీ మన బ్యాంకులు లక్షల కోట్ల మేరకు కార్పొరేట్ రుణాలను అలవోకగా మాఫీ చేసినప్పుడు వీరికి ద్రవ్యలోటు ప్రమాదం గుర్తుకురావడం లేదు. వ్యవసాయరంగ దుస్థితిని పట్టించుకోని మన విధాన నిర్ణేతలు ఒకటి, రెండు నెలలు కార్లు, ఆటోమొబైల్స్ అమ్మకాలు పడిపోయి, పరిశ్రమలు కొన్ని వేల ఉద్యోగాలకు కోతపెట్టగానే కొంపలంటుకుపోయినట్లు గావుకేకలు పెడుతున్నారు. వ్యవసాయరంగం నిత్య సంక్షోభంలో కూరుకుపోయి నంతకాలం మన ఆర్థిక వ్యవస్థ కూడా నిత్య అనిశ్చిత పరిస్థితుల్లోనే కొనసాగుతుంది. దేశీయ డిమాండ్ పెరగాలంటే వ్యవసాయరంగంలో భారీ పెట్టుబడులు పెట్టాలి.

కెఫే కాఫీ డే వ్యవస్థాపకుడు వీఎమ్ సిద్ధార్థ తన జీవితాన్ని ముగించుకుంటున్నట్లు ప్రకటించి ఆత్మహత్య చేసుకున్న కొద్ది రోజుల తర్వాత అయిదు మంది రైతులు మహారాష్ట్రలోని అకోలా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పురుగుమందు సేవించి ఆత్మహత్యా ప్రయత్నం చేశారు. ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తమ భూమికి సత్వరం పరిహారం అందించాలన్నది వారి డిమాండు. సరిగ్గా అదేసమయంలో, హరియాణాలో నాలుగు నెలలుగా ధర్నా చేస్తున్న మరొక రైతు మరణించాడు. ఆ రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తన భూమికి అధిక పరిహారం ఇవ్వాలని ఆ రైతు నిరసన తెలుపుతూ చనిపోయాడు. ఈ రైతుల మరణం, లేదా ఆత్మహత్యా ప్రయత్నం ప్రపంచం దృష్టికి రాలేదు కానీ కాఫీ కింగ్ విషాదమరణానికి దారితీసిన పరిస్థితుల గురించి పరిశ్రమవర్గాలు పెట్టిన గగ్గోలుకు మీడియా విపరీత ప్రచారం కల్పించింది. మన పారిశ్రామిక అధిపతుల్లో చాలామంది సిద్ధార్థ మృతిని పన్నుల రూపంలోని ఉగ్రవాదంతో ముడిపెట్టారు. తమకు మరిన్ని పెట్టుబడులు, పన్నురాయితీలు ఇవ్వాలని, పన్నుల బారి నుంచి స్వాతంత్ర్యం కల్పించాలని పరిశ్రమవర్గాలు డిమాండు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే కెఫే కాఫీ డే యజమాని దాదాపు రూ.11,000 కోట్ల భారీ రుణ ఊబిలో చిక్కుకుపోయారన్న విషయాన్ని విస్మరించి, పరిశ్రమ వర్గాల మనోభావాలను ప్రతిధ్వనింపచేయడంలో బిజినెస్ జర్నలిస్టులు మునిగిపోయారు.

ఆర్థిక మందగమనంలో తాము నిలదొక్కుకోవడానికి ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీతోపాటు మరిన్ని రాయితీలను కల్పించాలని పరిశ్రమ వర్గాలు సహేతుకమైన ఆర్థిక కారణాలను చూపించవచ్చు. కానీ వ్యవసాయరంగంలో మృత్యుదేవత ప్రళయతాండవం గురించి ఎవరికీ పట్టింపు లేదు. రైతుల ఆత్మహత్యలపై మీడియా కనీసంగా ప్రస్తావించటం లేదు. ఒక వ్యాపారవేత్తగా సిద్ధార్థకు కష్టకాలంలో తగిన మద్దతు అవసరం కావచ్చు. అయితే రైతులు కూడా తమరంగంలో పారిశ్రామికులుగానే కార్యకలాపాలు సాగిస్తున్న వాస్తవాన్ని ఎవరూ గుర్తించడం లేదు. అందుకే మన దేశ రైతులు తమ కష్టాలను వ్యక్తిగతంగానే ఎదుర్కొంటూ నష్టపోతున్నారు. తమ నష్టాలకు తగిన పరిహారం లభించే హక్కును సకాలంలో పొందగలిగినట్లయితే, దేశీయరైతులు కూడా తమ వ్యవసాయ రంగ వ్యాపార సామర్థ్యాన్ని నిరూపించుకోగలరు. కానీ అలాంటి అవకాశాన్నే తోసిపుచ్చడం అంటే ఆ అవకాశాన్ని రైతులు కోల్పోవడమనే అర్థం.

ప్రతి ఏటా మన పరిశ్రమ వర్గాలు రూ. 1.8 లక్షల కోట్ల మేరకు ఆర్థిక ఉద్దీపన ప్యాకేజీని పొందుతూనే ఉన్నాయి. 2008-09లో ప్రపంచ ఆర్థికరంగం కుప్పగూలినప్పటినుంచి జాతీయ బ్యాంకులు పరిశ్రమకు 17 లక్షల కోట్ల రూపాయల భారీ రుణాలను అందించాయి. దీనిలో రూ. 10 లక్షల కోట్లు నిరర్థక ఆస్తులుగా మిగిలిపోయాయి. మన పారిశ్రామిక రంగం గత 10 సంవత్సరాల్లో ఆర్థిక ప్యాకేజీ కింద రు. 18 లక్షల కోట్లను అందుకుంది. కానీ ఇప్పటికీ పారిశ్రామిక రంగం తీవ్రమైన సంక్షోభంలో కొనసాగుతోంది. పైగా, 2007 నుంచి 2019 వరకు గత 12 ఏళ్లలో బ్యాంకులు దాదాపు రూ.

8.36 లక్షల కోట్ల మొండిబకాయిలను రద్దు చేసినట్లు ఆర్బీఐ నివేదికను మీడియా ప్రస్తావిస్తుంది. పరిశ్రమ, వస్తూత్పత్తి రంగం, ఎగుమతుల రంగం పనితీరు దిగజారిపోవడానికి ఆర్థిక మందగమనమే కారణమా లేక బ్యాంకులు భారీస్థాయిలో దివాలా ఎత్తడమే అసలు కారణమా అని తేల్చుకోవలసిన సమయం ఆసన్నమైంది.

దేశీయబ్యాంకులు 2007-2016 మధ్యకాలంలో మొత్తం రూ. 2.88 లక్షల కోట్ల మేరకు మొండిబకాయిలను రద్దు చేశాయి. అయితే 2016-17లో 1.33 లక్షల కోట్లను, 2017-18లో 1.61 లక్షల కోట్లను మాఫీ చేసిన బ్యాంకులు 2018-19 సంవత్సరంలో రికార్డు స్థాయిలో రూ. 2.54 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేశాయి. బ్యాంకులు పూర్తిగా ఒట్టిపోవడానికి ప్రధాన కారణం.. ఇంత భారీ మొత్తాన్ని మూడేళ్లకాలంలోనే మాఫీ చేయడమే. కారణాలు ఏవైనా కావచ్చు.. దేశంలో ఉద్దేశపూర్వకంగా రుణాలు ఎగ్గొట్టిన 9 వేలమంది డిఫాల్టర్ల పేర్లను బహిరంగపర్చాలని ఆర్బీఐ పట్టుపడుతోంది. మొండి బకాయిలు ఇంకా అధికంగా ఉన్నాయనడానికి ఇది నికార్సైన సంకేతం. కేంద్రప్రభుత్వం ఇప్పటికే బ్యాంకుల ప్రక్షాళన ప్రక్రియను ప్రారంభించడంపై పట్టుదలతో ఉంటున్నప్పటికీ, రుణం చెల్లింపు అశక్తత, దివాలా కోడ్ (ఐబీసీ)ని 2016లో ప్రవేశపెట్టింది. మొండిబకాయిల ఉపద్రవాన్ని అరికట్టడానికి ప్రభుత్వం ప్రదర్శిస్తున్న బలమైన వైఖరికి ఇది నిదర్శనం. ప్రతిసంవత్సరం పరిశ్రమవర్గాలు భారీ పన్ను రాయితీలను అందుకుంటున్న సమయంలో పన్నుల అధికారులు తమ తలుపు తడితే మాత్రం పరిశ్రమవర్గాలు విలపించడం సమర్థనీయం కాదు.

మన వ్యవస్థ రైతుల పట్ల ఎలా వ్యవహరిస్తున్నదో ఇప్పుడు మనం పరిశ్రమల రంగంతో పోల్చి చూద్దాం. బ్యాంకులకు రుణాలను చెల్లించలేకపోయారన్న కారణంతో పలు సంవత్సరాలుగా దేశంలో వందలాది మంది రైతులను బహిరంగంగా అవమానాలపాలు చేశారు. జైళ్లలో పెట్టారు. పరిశ్రమల రంగానికి లక్షలాది కోట్ల రూపాయల రుణాలను మాఫీ చేస్తుండగా, ఒక్కటంటే ఒక్క నెల బకాయిని చెల్లించలేకపోయిన రైతులను జైళ్లలోకి నెడుతున్నారు. అలాంటి రైతుల స్థిరాస్తి, చరాస్తిని బ్యాంకు తక్షణం స్వాధీనం చేసుకోవడమే కాదు.. రైతులు తాము చెల్లించాల్సిన అసలు మొత్తాన్ని చెల్లించలేని సందర్భాల్లో, వారికి రుణాన్ని మంజూరు చేసే సమయంలో రైతుల నుంచి తీసుకున్న సంతకం చేసిన ఖాళీ చెక్కును బ్యాంకు తానే డిపాజిట్ చేసి, అవి చెల్లనప్పుడు ఈ సివిల్ కేసును క్రిమినల్ కేసుగా మార్చి వేధిస్తున్నాయి. తర్వాత అలాంటి రైతులను జైలుకు పంపుతున్నారు. తాము తీసుకున్న రుణాన్ని అసలు, వడ్డీతో సహా తీర్చివేయాలని కోర్టులు రైతులను ఆదేశిస్తున్నాయి కూడా.

వాస్తవానికి ఈ దేశంలో క్రమం తప్పకుండా నెలవారీ రుణ చెల్లింపులను చేయగలుగుతున్నది రైతులు మాత్రమే కాగా, ఇలాంటి వారిపైనా డిఫాల్టర్లుగా ఎందుకు ముద్ర వేస్తున్నారో నాకు అసలు అర్థంకాదు. దేశంలో కొన్ని రాష్ట్రాల ప్రభుత్వాలు సన్నకారు రైతులు గరిష్టంగా చేసిన రెండు లక్షల రూపాయల రుణాన్ని మాఫీ చేస్తున్నందుకే మన ఆర్థికవేత్తలు, ఆర్థికరంగ సమర్థకులు ఈ రుణమాఫీతో ద్రవ్యలోటు ఆకాశానికి అంటుతుందంటూ గావుకేకలు పెడుతున్నారు. కానీ ఇదే బ్యాంకులు లక్షల కోట్ల మేరకు కార్పొరేట్ రుణాలను అలవోకగా మాఫీ చేసినప్పుడు ఇదే ఆర్థికవేత్తలకు ద్రవ్యలోటు ప్రమాదం అసలు గుర్తుకురావడం లేదు.

అనేక సంవత్సరాలుగా భారత ఆర్థిక వ్యవస్థ మందగమనంతో ఉందని పలు ప్రగతి సూచికలు తెలుపుతూనే ఉన్నాయి. వ్యవసాయ రంగ రాబడులు గత 15 ఏళ్లలో అత్యంత కనిష్ట స్థాయికి పడిపోయాయి. చివరకు గ్రామీణ రంగ ఉపాధి కూడా ఘోరంగా దెబ్బతిందని కొన్ని అధ్యయనాలు తెలుపుతున్నాయి. వీటి ప్రకారం 2011-2018 మధ్య కాలంలో గ్రామీణ ప్రాంతంలో 3.2 కోట్లమంది రోజుకూలీలు పని కోల్పోయారు. వీరిలో 3 కోట్లమంది వ్యవసాయ రంగ కార్మికులున్నారు. కానీ అతిపెద్ద విషాదమేమిటంటే, ముంచుకొస్తున్న వ్యవసాయరంగ దుస్థితి గురించిన తీవ్ర హెచ్చరికలను ఏమాత్రం పట్టించుకోని మన విధాన నిర్ణేతలు ఒకటి, రెండు నెలలు కార్లు, ఆటోమొబైల్స్ అమ్మకాలు పడిపోయి పారిశ్రామికరంగంలో కొన్ని వేల ఉద్యోగాలకు కోతపెట్టగానే గావుకేకలు పెడుతున్నారు. వ్యవసాయరంగం నిరంతర సంక్షోభంలో కూరుకుపోయి ఉన్నంతవరకు మన ఆర్థిక వ్యవస్థ కూడా అనిశ్చిత పరిస్థితుల్లోనే కొనసాగుతుంది. వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ వినియోగం పెరుగుదలపైనే ఆధారపడుతుంది. వినియోగం అనేది ఎంత డిమాండును సృష్టిస్తాం అన్న అంశంపై ఆధారపడుతుంది. దేశీయ డిమాండును పెంచడంలో గ్రామీణ రంగమే అతి ముఖ్యమైన పాత్ర పోషిస్తోందన్నది అందరూ అర్థం చేసుకోవాలి. దీనికి రాబోయే సంవత్సరాల్లో వ్యవసాయరంగంలో మరిన్ని పెట్టుబడులు అవసరం అవుతాయి. అంటే పరిశ్రమలను మరింతగా ప్రైవేటీకరించడం, మరిన్ని ఉద్దీపన ప్యాకేజీలను ఇవ్వడం నుంచి ప్రభుత్వం తన దృష్టిని వ్యవసాయరంగం వైపు మళ్లించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దేశీయ శ్రామికశక్తిలో దాదాపు 50 శాతాన్ని కలిగి ఉన్న వ్యవసాయరంగానికి ప్రభుత్వ మదుపులకు సంబంధించి జీడీపీలో అర్ధ శాతం కంటే తక్కువ కేటాయించడమే మన రైతుల దుస్థితికి అసలు కారణం. కోట్లాది మందికి బతుకునివ్వగల వ్యవసాయ రంగానికి మరింతగా పెట్టుబడులను కేటాయించడం, ఈ క్రమంలో మరింత దేశీయ డిమాండును సృష్టించడమే దీనికి పరిష్కారం.

వ్యాసకర్త వ్యవసాయ నిపుణులు
ఈ-మెయిల్ : hunger55@gmail.com

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ఫేక్ న్యూస్

"రాళ్లు రువ్వడం, కొంతమంది వేర్పాటువాదుల అరెస్ట్ వంటివి కశ్మీర్‌లో ఘర్షణల సందర్భంలో సాధారణంగా జరిగేవే. ప్రజలను భయభ్రాంతులను చేయడానికి కొంతమంది యువకులను సైన్యం చిత్రహింసలు పెడుతోందనడంలో ఎటువంటి నిజం లేదని కొంతమంది స్థానికులు, జర్నలిస్టుల ద్వారా నిర్ధారణకు వచ్చా. రాజకీయ ప్రయోజనాల కోసం ఫేక్ న్యూస్ వ్యాపింపజేయొద్దు. అయితే కాంగ్రెస్ అగ్రనేత గులాం నబీ ఆజాద్‌ను ఎయిర్‌పోర్టులో నిర్బంధించడం, ఆయనను తన ఇంటికి గానీ, జేకే పీసీసీ కార్యాలయానికిగానీ వెళ్లకుండా అడ్డుకోవడం ప్రజాస్వామ్యం ఎలా అవుతుంది?"

- సల్మాన్ నిజామీ, కాంగ్రెస్ నేత

చరిత్ర

"షెహ్లా రషీద్, నీ భావాలను వ్యక్తీకరించే పూర్తి స్వేచ్ఛ నీకుంది. కశ్మీరీలు ప్రస్తుతం వారిని వారు వ్యక్తీకరించుకునే అవకాశం లేదని మాకు తెలుసు. వాళ్లిప్పుడు బందీలు. కానీ, నువ్వు మాట్లాడి మంచి పని చేస్తున్నావు. నీకు వందనాలు. ఈ కాలం గడిచిపోవచ్చు, కానీ చరిత్ర నిన్ను గుర్తుపెట్టుకుంటుంది"

- సజ్జద్ కార్గిలి, కార్యకర్త

మెలోడీ

"ప్రఖ్యాత సంగీత దర్శకుడు ఖయ్యామ్ మరణంతో ఒక తరం ముగిసినట్టే. మనసును స్పృశించే, ఆత్మను తాకే ఆయన స్వరాలు వింటూ పెరిగిన వాళ్లం. ఆయన అందించిన మధుర గీతాలు నా ఊపిరి ఉన్నంతవరకు నాలో నిలిచే ఉంటాయి. ఆయన ఆత్మకు శాంతికలగాలని ప్రార్థిస్తున్నా."

- కిరెణ్ రిజిజు, కేంద్ర సహాయ మంత్రి

యుద్ధం

"యుద్ధాన్ని కీర్తించడం మానుకోండి. యుద్ధం అంటే ప్లే గ్రౌండ్‌లో జరిగేది కాదు. తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి ఏ దేశానికి యుద్ధం అవసరం లేదు. భారత్ యుద్ధానికి సిద్ధంగా ఉందనేవారంతా దేశానికి నష్టం చేస్తున్నట్టే. విద్వేషాన్ని రెచ్చగొట్టేవారికి కొదవలేదు కదా"

- మధువంతి శ్రీనివాసన్, జర్నలిస్ట్

జోక్

"కమ్యూనిస్ట్ దేశమైన చైనా కశ్మీర్‌లో ప్రజాస్వామ్యాన్ని కోరుకోవడం ఈ శతాబ్దంలోనే పెద్ద జోక్. కశ్మీర్‌లో ప్రజాస్వామ్యం కోసం ఆందోళన చేస్తున్న వెయ్యి మందిపట్ల సానుభూతి చూపే చైనా, హాంగ్‌కాంగ్‌లో ఆందోళన చేస్తున్న లక్షలాదిమంది పట్ల ఎందుకు సానుకూలత ప్రదర్శించదు?"

- హేమంత్ త్రిపాఠి, జర్నలిస్ట్

ఓటు

"ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో కూడా వాళ్లు ఓడిపోయారు. పాకిస్తాన్‌కు అనుకూలంగా కేవలం ఒకేఒక్క ఓటు పడింది. ఆ ఓటు వేసినది చైనా. ఇక మనం చైనా ఉత్పత్తులను బహిష్కరించాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ ఉత్పత్తులను మనమే భారత్‌లో తయారు చేసుకోవాలి"

- తానీషా గుప్తా, విద్యార్థి

కశ్మీరీల భాగస్వామ్యంతోనే ముందడుగు

సందర్భం

డా॥ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి 370, 35(ఎ) అధికరణల ద్వారా దశాబ్దాల క్రితం దఖలు పడిన ప్రత్యేక ప్రతిపత్తిని తొలగించి, రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా రాష్ట్రాన్ని విభజించడం ద్వారా ఏడు దశాబ్దాలుగా రగులుతున్న కశ్మీర్ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించే సువర్ణావకాశం ఏర్పడటం దేశ చరిత్రలో ఓ అపురూప ఘట్టం. ఎంతో సాహసోపేతంతో ఎన్డీఏ ప్రభుత్వం తీసుకున్న ఈ చారిత్రక నిర్ణయానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోసహా మరికొన్ని ప్రాంతీయ పార్టీలు బేషరతుగా తమ సంపూర్ణ మద్దతును ప్రకటించి, దేశ ప్రయోజనాలు అన్నింటికంటే అత్యంత ప్రధానమైనవని చాటి చెప్పాయి. ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్‌లో ఏకాభిప్రాయం లేకపోవడం ఆ పార్టీ డొల్లతనాన్ని ఎత్తి చూపింది. ఆ పార్టీలో కొంతమంది సీనియర్ నేతలతోపాటు యువ నేతలు కూడా ఎన్డీఏ చర్యను సమర్థించడం గమనార్హం. కాంగ్రెస్ బలహీనతను బీజేపీ తనకు అనుకూలంగా మార్చుకుంది. భారత్‌ను ఇరుకున పెట్టడానికి అంతర్జాతీయ సమాజం మద్దతును కూడగట్టాలని ప్రయత్నించి పాకిస్తాన్ భంగపాటుకు గురయ్యింది.

కశ్మీర్ రాష్ట్రాన్ని ఏలిన ప్రభుత్వాలు అక్కడి ప్రజలకు తగిన నమ్మకాన్ని కల్పించలేకపోయాయి. పాకిస్తాన్ తయారు చేసిన ఉగ్రవాద మూకలు రాష్ట్రంలోకి చొరబడకుండా నిలువరించలేకపోయాయి. ఓటు బ్యాంకును దృష్టిలో పెట్టుకొని మతవాద రాజకీయాలకు పరోక్షంగా సహకరించాయి.

కశ్మీర్ అంశంలో స్పష్టమైన వైఖరి అవలంబించింది ఒక్క బీజేపీయే అన్నది నిర్వివాదాంశం. కేంద్రంలో కనుక తాము అధికారం చేపడితే 370 ఆర్టికల్‌ను రద్దుచేసి కశ్మీర్‌ను జాతీయ స్రవంతిలోకి తీసుకువస్తామని బీజేపీ మొదట్నుంచీ చెబుతూ వస్తోంది. కశ్మీర్‌పై ఉదారవాద వైఖరి ప్రదర్శిస్తూ వచ్చిన కాంగ్రెస్ పార్టీ 'దీనికి రాజకీయ పరిష్కారం' అనివార్యం అనే విధానాన్ని అవలంబించింది. కానీ, రాజకీయ పరిష్కారం అంటే ఏమిటో ఏనాడూ స్పష్టం చేయలేకపోయింది. ఇందిరా గాంధీ ప్రధానిగా ఉండగా పాకిస్తాన్‌తో కుదుర్చుకున్న 'సిమ్లా ఒప్పందం' ఎటువంటి పరిష్కారాన్ని చూపించలేకపోయింది. ఇక, జమ్మూ కశ్మీర్‌లోని ప్రధాన ప్రాంతీయ పార్టీల్లో ఒకటైన నేషనల్ కాన్ఫరెన్స్ ఎప్పటికప్పుడు కప్పదాట్ల వైఖరితో వ్యవహరిస్తూ స్థానిక ప్రజల ఆదరణ సంపాదించలేకపోయింది. ఆ పార్టీ అధినేత ఫరూక్ అబ్దుల్లా ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కశ్మీర్ సమస్యను ద్వైపాక్షిక చర్చల ద్వారానే పరిష్కరించుకోవాలనేవారు. ఆయన కుమారుడు ఒమర్ అబ్దుల్లాదీ అదే పాట. అధికారం పోయాక నేషనల్ కాన్ఫరెన్స్ నేతలు మాట మార్చారు. హురియత్ కాన్ఫరెన్స్‌ను చర్చల్లో భాగస్వామ్యం చేయాలన్నారు.

జమ్మూ కశ్మీర్‌లో మరో ప్రధాన ప్రాంతీయ పార్టీ అయిన పీపుల్స్ డెమొక్రటిక్ పార్టీ విధానం మొదట్నుంచీ వేర్పాటువాదులకు అనుకూలమే. 2015లో జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లభించని నేపథ్యంలో పీడీపీతో బీజేపీ జత కలిసింది. మహబూబా ముఫ్తీ ముఖ్యమంత్రిగా ఏర్పడిన ప్రభుత్వం కశ్మీర్‌లో శాంతిని నెలకొల్పడంలో పూర్తిగా విఫలం చెందడమే కాకుండా.. స్థానిక పోలీస్ యంత్రాంగానికి, సైన్యానికి మధ్య సమన్వయం లోపించిన పరిస్థితి ఉత్పన్నమైంది. భద్రతా బలగాలపై రాళ్లు విసిరినందుకు స్థానిక యువతపై నమోదైన క్రిమినల్ కేసులను ముఫ్తీ ప్రభుత్వం ఎత్తివేసింది. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపుల్లో వివక్ష చూపారు.

వాజ్‌పేయి ప్రధానిగా ఉండగా జరిగిన కార్గిల్ యుద్ధంలో పాకిస్తాన్ చావు దెబ్బ తిన్నప్పటికీ..ఆ సమయంలో ఎన్డీఏ ప్రభుత్వం కశ్మీర్ సమస్యను పరిష్కరించడానికి తగి

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ బుధవారం
21-8-2019

ప్రతీకాత్మక చిత్రం

సౌత్ క్వీన్‌కు కత్తెర్లు
– సినిమా పేజీలో

నాట్ ఓకే బంగారం

"నాన్నా.. నాకది కావాలి"
"ఓకే బంగారం"
"అమ్మా.. నాకిది వద్దు"
"ఓకే బంగారం"
ఏం కోరితే అది. ఏం చెబితే అది. అయితే..
'ఓకే బంగారం' అనలేని రోజొకటి ప్రతి పేరెంట్‌కీ వస్తుంది.
ఆ మాటను తట్టుకోలేని రోజు మాత్రం ఏ పిల్లలకూ రాకూడదు.

నాన్న బయటకెళ్తే వచ్చేటప్పుడు తమకేదో తెస్తాడని పిల్లలు ఎదురు చూసేవాళ్లు. నాన్న తెచ్చిన చిన్న మిఠాయి పొట్లంతో ఆకాశాన్నంటే ఆనందాన్ని పొందేవారు. నాన్న తిరునాళ్లలో కొనిచ్చిన బొమ్మంటే పిల్లలకు ప్రాణం. ఆ బొమ్మతో ఏళ్లకేళ్లు ఆడుకునేవాళ్లు. ఆ బొమ్మతో అనుబంధాన్ని పెంచుకునేవాళ్లు. మరో బొమ్మ కొనిస్తే ఆ బొమ్మకు తోడుగా కొత్త బొమ్మను జత చేసుకుని ఆనందాన్ని రెట్టింపు చేసుకునేవాళ్లు. నాన్న అడుగుల చప్పుడు కోసం ఎదురు చూడడంలో కూడా వారికి సంతోషం ఉండేది. ఇది ఎనభైలు, తొంభైల వరకు గడిచిన బాల్యం.

తొంభైల తర్వాత రెండు వేలు సంవత్సరం వచ్చేసింది. ఇరవై ఒకటో శతాబ్దంలోకి వచ్చేశాం. కొత్త శతాబ్దం తెచ్చిన మార్పుల్లో బాల్యమూ మారిపోయింది. బాల్యంలో సున్నితత్వం లోపించింది. నాన్నలో తమకు అన్నీ అమర్చి పెట్టే 'ఫెసిలిటేటర్'ను మాత్రమే చూస్తున్నారు పిల్లలు. తాము అడిగినవి ఇప్పించకపోతే నాన్నలో శత్రువుని చూడడానికి కూడా వెనుకాడడం లేదిప్పుడు. ఈ దుష్పరిణామానికి తాజా నిదర్శనమే బెంగుళూరు ఘటన.

• • •

బెంగుళూరులోని రాజాజీ నగర్‌లో ఓ టీనేజ్ అమ్మాయి తండ్రిని చంపేసింది. తొమ్మిదో తరగతి చదువుతున్న అమ్మాయి తండ్రికి విషం కలిపిన పాలు ఇచ్చింది. బాయ్ ఫ్రెండ్‌తో కలిసి కత్తితో పొడిచి చంపేసింది. ఆ తర్వాత ఇద్దరూ కలిసి తండ్రి దేహం మీద పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ఎందుకిలా చేశావంటే... ''నేను కోల్పోయిన స్వేచ్ఛను తిరిగి పొందడానికి'' అని చెప్పింది ఎంతో స్థిరంగా. ''నువ్వు కోల్పోయిన స్వేచ్ఛ ఏమిటి'' అని అడిగితే... ''మా నాన్న నా దగ్గర నుంచి ఫోన్ తీసేసుకున్నాడు. ఇంటర్నెట్ డిస్‌కనెక్ట్ చేశాడు. నేను నా ఫ్రెండ్‌తో మాట్లాడితే ఒప్పుకోవడం లేదు. ప్రవీణ్‌తో మాల్స్‌లో కనిపిస్తున్నానని కోప్పడి బెల్ట్‌తో కొట్టాడు కూడా..'' ఇదీ ఆ టీనేజ్ అమ్మాయి చెప్పిన కారణం. పదిహేనేళ్ల అమ్మాయి ఇలా మాట్లాడిందంటే ఆ తప్పు ఆ అమ్మాయిదా? ఆ అమ్మాయిని ప్రభావితం చేసిన సమాజానిదా? అంటే సమాజానికి ఎంత పాత్ర ఉందో తల్లిదండ్రులకూ అంతే పాత్ర ఉందంటున్నారు సైకియాట్రిస్ట్ డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి.

ముందే కళ్లు తెరవాలి

''పిల్లల్లో యాంగర్ మేనేజ్‌మెంట్ పూర్తిగా లోపించింది. స్కూల్లో తోటి పిల్లలతో చిన్న విషయాలకే గొడవ పెట్టుకోవడం, ఆ గొడవ పెట్టుకున్న పిల్లాడు మెట్లు దిగుతుంటే వెనక నుంచి తోసేయడం వంటి క్రౌర్యపూరితమైన సంఘటనలు తరచుగా జరుగుతున్నాయి. తల్లిదండ్రులు తమ దాకా వస్తే తప్ప కళ్లు తెరవడం లేదు. పిల్లల్లో వస్తున్న అనారోగ్యకరమైన మార్పుని పట్టించుకోవడం లేదు. సాధారణంగా రెండు తరాల మధ్య ఒక జనరేషన్ గ్యాప్ ఉంటుంది. ఇప్పటి పేరెంట్స్‌కి – పిల్లలకి మధ్య ఒక్కసారిగా నాలుగైదు జనరేషన్‌ల గ్యాప్ వచ్చేసింది. పిల్లలకు అవసరం లేనంత ఎక్కువ ఎక్స్‌పోజర్ వచ్చేస్తోంది. ఒకప్పుడు ఎవరైనా ఒక అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్ ఉన్నాడని తెలిస్తే 'అమ్మో! ఆ అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్ ఉన్నాట్ట' అని ఆందోళన పడుతూ చెప్పుకునేవాళ్లు. అలాగే ఒక అబ్బాయికి గర్ల్‌ఫ్రెండ్ ఉన్నా సరే... అతడి ఫ్రెండ్స్ అతడిని రకరకాలుగా హెచ్చరిస్తూ జాగ్రత్తలు చెప్పేవాళ్లు. ఎనభైల నాటి సమాజం అది. ఇప్పుడు సమాజం బాయ్‌ఫ్రెండ్, గర్ల్‌ఫ్రెండ్ కల్చర్‌ని తప్పు పట్టడం లేదు, స్వాగతిస్తోంది కూడా. ఒక అమ్మాయి కానీ, అబ్బాయి కానీ తమకు లవర్ లేదని చెప్పుకోవడానికి సిగ్గుపడేటంతగా పిల్లల్ని ప్రభావితం చేసేసింది సమాజం. 'బాయ్‌ఫ్రెండ్ లేడు' అంటే ఆ అమ్మాయికి చెవి, ముక్కు వంటి దేహంలో ఉండాల్సిన భాగం లేనట్లు గేలి చేస్తున్నారు స్నేహితులు. గర్ల్‌ఫ్రెండ్ లేని అబ్బాయిల్లో కూడా ఫ్రెండ్స్ చిన్న చూపు చూస్తారని ఒత్తిడి పెరిగిపోతోంది. తల్లిదండ్రుల విషయానికి వస్తే... వాళ్లు పిల్లల ముందు ఎలాంటి అభిప్రాయాలను వ్యక్తం చేస్తారో అవన్నీ నిజమనే అనుకుంటారు. తమ విషయంలోనూ అవి వర్తిస్తాయని భ్రమ పడతారు. కాలనీలో ఒక అమ్మాయికి బాయ్‌ఫ్రెండ్ ఉండడాన్ని సమర్థించినప్పుడు, తనకు బాయ్‌ఫ్రెండ్ ఉంటే కూడా స్వాగతిస్తారనే అనుకుంటారు. తల్లిదండ్రులు తమ దాకా వచ్చినప్పుడు మాత్రమే కళ్లు తెరుస్తున్నారు. అప్పుడు పిల్లల్ని కట్టడి చేస్తే వాళ్లు మరింత మొండిగా మారిపోతారు. తమ తల్లిదండ్రులు ఫెయిర్‌గా లేరు, డబుల్ స్టాండర్డ్స్‌తో వ్యవహరిస్తున్నారనుకుంటారు. దాంతో ద్వేషాన్ని కూడా పెంచుకుంటారు.

అన్నీ అరచేతిలోనే

బాల్యంలో ఏవయితే రాకూడదో ఆ లక్షణాలన్నీ పిల్లలకు వొంటపట్టేస్తున్నాయి. మొదటిది ఇగో. మిగిలిన వారికంటే ఒక మెట్టు పైనుండాలనే తపన. తన ఫ్రెండ్స్ ఎవ్వరి దగ్గరా లేని గ్యాడ్జెట్స్ తన దగ్గర ఉండి తీరాలనే విపరీత కాంక్ష. ఇక రెండోది మొండి పట్టుదల. తమకు నచ్చని పని చేయమంటే ససేమిరా అన్నట్లు ఉంటారు. అంతటి మొండితనం తమను నచ్చిన పని చేసి తీరడంలోనూ ఉంటోంది. చదువుకోమని చెప్తే పుస్తకాన్ని తాకరు. స్మార్ట్ ఫోన్‌లలో గంటల కొద్దీ గడపడం, సోషల్ మీడియాలో చాటింగ్‌లు, ఫ్రెండ్స్‌తో తిరగడాన్ని ఇష్టపడతారు. పెద్దవాళ్లు మానమని చెప్తారు కాబట్టి ఇంకా ఎక్కువగా పంతం పట్టినట్లు చేస్తారు. ఇక దేనిమీదా కుదురులేకపోవడం కూడా ఈ మధ్యకాలంలో పిల్లల్లో ఎక్కువగా కనిపిస్తోంది. ఇవన్నీ ఏడిహెచ్‌డి (అటెన్షన్ డెఫిసిట్, హైపర్ యాక్టివిటీ డిజార్డర్) లక్షణాలే. దీనికి తోడు తోటిపిల్లల ముందు తక్కువ అవుతామేమోననే పియర్ ప్రెషర్ కూడా పిల్లల్ని ఒత్తిడికి గురి చేస్తోంది. ఇక ముఖ్యంగా చెప్పుకోవాల్సింది హారర్‌ను ఎక్కువగా చూడడం. ఒకప్పుడు టీవీలో హింసాత్మక సంఘటనల సినిమాలు ఎప్పుడో ఒకటి వచ్చేవి. పిల్లలున్న ఇళ్లలో కొన్ని చానెల్స్‌ని లాక్ చేసే వీలుండేది. ఇప్పుడు టీనేజ్‌లోనే పిల్లలకు స్మార్ట్ ఫోన్ కొనిస్తున్నారు పేరెంట్స్. ఆ ఫోన్‌లో ఏం చూడవచ్చు, ఏం చూడకూడదనే లిమిట్ సెట్టింగ్ వాళ్లకు ఆ వయసులో తెలిసి వస్తుందా? ఏ క్షణంలో ఏం జరగాలని కోరుకుంటే అది జరిగిపోవాలనే ధోరణి నరనరాన జీర్ణించుకుపోతోంది పిల్లల్లో. భావోద్వేగాలను ప్రదర్శించడం, అదుపులో పెట్టుకోవడం రెండూ తెలిసి రావడం లేదు. 'తల్లిదండ్రులం కాబట్టి మేము ఎక్కువ, మా మాట మీరు వినాలి' అంటే పిల్లలు వినే స్థితిలో ఉండడం లేదు. కాబట్టి పేరెంట్స్ తప్పని సరిగా పిల్లలకు స్నేహితులుగా మారాలి. పిల్లలు అడిగిన వెంటనే కొనివ్వకుండా ఎదురు చూసేటట్లు చేయాలి. స్మార్ట్ ఫోన్ కోసం పిల్లలు కార్చిన రెండు కన్నీటి బొట్లకు కరిగిపోయి... మంచి మనసున్న తల్లిదండ్రులం అనిపించుకునే ప్రయత్నం చేస్తే అది ఎప్పటికీ మంచి పేరెంటింగ్ కాలేదు. తెలిసీ తెలియని వయసులో స్మార్ట్ ఫోన్ తాలూకు చెడు ప్రభావం చూపించేది పిల్లల జీవితం మీదనే. ఈ బెంగుళూరు సంఘటనలో ఆ టీనేజ్ పిల్లలకు డ్రగ్స్ అలవాటు ఉండి ఉండవచ్చనే అనుమానం కూడా కలుగుతోంది. ఎందుకంటే... తల్లిదండ్రుల మీద ఇంత తీవ్రంగా ప్రవర్తించడం అనే లక్షణాన్ని ఇంత వరకు డ్రగ్ అడిక్ట్స్ విషయంలోనే కనిపిస్తుండేది'' అని ముగించారు డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి.

– ఇంటర్వ్యూ : వాకా మంజులారెడ్డి

ఎదురు చూడడం తెలియాలి

సమాజంలో జీవిస్తూ సమాజం ప్రభావం మన మీద పడకుండా ఆపగలగడం కొంచెం కష్టమే. అయితే ప్రతి దానికీ ఒక లిమిట్ సెట్టింగ్ ఉంటుంది. ఆ పరిమితి తెలియకపోతే ఎదురయ్యే అనర్థాలే ఇవన్నీ. లిమిట్ సెట్టింగ్ తెలియాల్సింది పిల్లలకంటే ముందు తల్లిదండ్రులకే. వయసు రీత్యా కానీ పరిణతి రీత్యా కానీ ఆ మాత్రం విచక్షణ ఉండేది పెద్దవాళ్లకే. పేరెంట్స్ తమ పిల్లలకు ఏదైనా బహుమతి ఇవ్వదలుచుకున్నప్పుడు... దానికంటూ ఒక సందర్భం ఉండేలా చూసుకోవాలి. అంతేతప్ప 'పక్కింటి పిల్లాడికి ఉంది కాబట్టి మన వాడికి కూడా ఇద్దాం' అని మాట్లాడుకున్నారంటే పిల్లల్లో ఎక్స్‌పెక్టేషన్స్ విపరీతంగా పెరిగిపోతాయి. ఎవరి దగ్గర ఏది చూస్తే దానిని తనకు కొనిపెడతారనే అనుకుంటారు. తన దగ్గర ఎన్ని బొమ్మలున్నా సరే... మార్కెట్‌లోకి కొత్తగా మరో బొమ్మ వచ్చింది కాబట్టి వెంటనే కొనేయాలనే తొందర కూడా ఒంటపట్టేస్తుంది. ఇవన్నీ పిల్లల్లో కుదురులేని తనానికి కారణమవుతున్నాయి.

డాక్టర్ కల్యాణ్ చక్రవర్తి
కన్సల్టెంట్ చైల్డ్ సైకియాట్రిస్ట్

వార్తల్లో వనితలు

నేను ఎవరి బిడ్డను?

'ఫైండింగ్ ఫరీదా' మూవీ స్టిల్

అంతర్జాతీయ చలన చిత్రం కేటగిరీ కింద ఇరాన్ డాక్యుమెంటరీ 'ఫైండింగ్ ఫరీదా' 2020 ఆస్కార్ అవార్డుల పోటీకి నామినేట్ అయింది. ఇరాన్ ప్రభుత్వం ఒక డాక్యుమెంటరీని ఆస్కార్ నామినేషన్‌కు ఎంపిక చెయ్యడం ఇదే మొదటిసారి. ఇదే కేటగిరీ కింద గతంలో ఇరాన్ 'ఎ సపరేషన్' (2012), 'ది సేల్స్‌మాన్' (2017) చిత్రాలకు ఆస్కార్‌ను గెలుపొందింది. ఫరీదా అనే ఇరానీ అమ్మాయిని నలభై ఏళ్ల క్రితం డచ్ (నెదర్లాండ్స్) దంపతులు దత్తత తీసుకెళతారు. ఆ అమ్మాయి పెరిగి పెద్దయ్యాక తొలిసారి తన మాతృభూమిని, కన్నవాళ్లను చూసేందుకు వెళుతుంది. అక్కడ మూడు కుటుంబాలు ఫరీదా 'మా అమ్మాయే' అని ముందుకు వస్తాయి. వారిలో నిజంగా తను ఎవరింటి బిడ్డో తెలుసుకోడానికి ఫరీదా అక్కడ మళ్లీ తనను తను వెతుక్కుంటుంది. ఇదే 'ఫైండింగ్ ఫరీదా' స్టోరీ.

మీరెవరు విడదీసేందుకు?

చావీ మిట్టల్

చావీ మిట్టల్ చక్కటి ప్రశ్నే వేశారు. ''బహిరంగ ప్రదేశాలలో సిగరెట్ తాగితే తప్పు కాదు కానీ, తల్లి తన బిడ్డకు పాలిస్తే తప్పు అవుతుందా?'' అని! ''స్తన్యమివ్వడం ప్రకృతిలోని అందమైన విషయం. తల్లికి, బిడ్డకు మధ్య ఉండే ఈ బంధం ఎవరూ విడదీయలేనిది. బిడ్డకు ఆకలైనప్పుడు చనుబాలు పట్టడానికి ఇంట్లో ఉన్నానా, వీధిలో ఉన్నానా అని చూసుకోదు తల్లి. కానీ సమాజం దీన్నొక అపరాధంగా చూస్తోంది. రోడ్ల మీద సిగరెట్ కాలుస్తూ, తాగి తూలుతూ చుట్టుపక్కల వాళ్లకు ఇబ్బంది కలిగిస్తే ఎవరికీ పట్టదు కానీ, ఒక తల్లి తన బిడ్డకు పాలు పడితే మాత్రం ఏదో బ్రహ్మాండం బద్దలైనట్లే మాట్లాడతారు'' అని చావీ అంటున్నారు. టీవీ నటి అయిన చావీ ఇటీవలే రెండో బిడ్డకు జన్మనిచ్చారు.

అంత పిచ్చి లేదు

రాధికా ఆప్టే

'అంధాధున్', 'ప్యాడ్‌మ్యాన్'.. రెండు చిత్రాల్లోనూ నటించారు రాధికా ఆప్టే. ఈ రెండు చిత్రాలకు ఈ ఏడాది నేషనల్ అవార్డులు వచ్చాయి. 'ఎలా ఫీలవుతున్నారు?' అని ఇంటర్వ్యూలో ఎవరో అడిగారు. ''సంతోషమే కానీ, ఎదురు చూసేంత సంతోషం కాదు'' అన్నారు రాధిక. దానర్థం అవార్డులను ఆమె పట్టించుకోరని. ''ఆడియెన్స్‌కి నచ్చితే చాలు. అంతకు మించి నేనేం ఆశించను. అవార్డు వచ్చినా, రాకున్నా నాకు ఒకటే. ఐయామ్ నాట్ అవార్డ్ – క్రేజీ పర్సన్'' అన్నారు రాధిక.

నిరాడంబర సౌందర్యం

సన్నీ లియోన్

సన్నీ లియోన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఆమె లేటెస్ట్ ఫోటో నిరాడంబరమైన అమాయకపు ముస్తాబుతో ఆకట్టుకుంటోంది. అంచులకు రింకులు కుట్టిన తెలుపు రంగు స్లీవ్‌లెస్‌లో ఆమె మేఘమాలికను తలపిస్తున్నారు. కనుబొమల్ని దట్టమైన నలుపు రంగుతో తీర్చిదిద్దుకున్నారు. పెదవులకు లేత గులాబీ రంగు లిప్‌స్టిక్‌తో ఫినిషింగ్ టచ్ ఇచ్చుకున్నారు. అంతా ప్రెష్ లుక్. స్టన్నింగ్‌గా ఉన్నారు సన్నీలియోన్. పెద్దగా శ్రమించకుండా ప్రపంచాన్ని మంత్రముగ్ధం చేసేందుకు టిప్స్ ఏవైనా కావాలనుకునే వారు సన్నీని సోషల్ మీడియాలో వెంటాడవచ్చు.

నివాళి

కభీ కభీ మేరే దిల్ మే ఖయాల్ ఆతా హై...


ఖయ్యాం

మహాకవుల పంక్తులకూ పల్లవులకూ స్వరాలు అద్దగలిగిన అంతిమ సంగీతకారుడు నిదుర కొరకు శిరము వాల్చాడు. మానవ మాధుర్యాలనూ జీవన వేదనలనూ కాగితంపై పెట్టగల ప్రతి మహోన్నత కలానికి తోడు నిలిచి, పాటగా మలిచి ప్రజలకు చేర్చిన నాదవాహకుడు అంతిమవాహనాన్ని అధిరోహించాడు. భారతీయతకు, లోకగీతానికి, ఉత్తరాది రాగానికి, నకలు ఎరగని అసలీయతకు ఆనవాలుగా నిలిచిన తేనెబాణీల జాగీర్దారు మధుపంపకాన్ని చాలించి పరుండేందుకు మృత్తికకు చేరాడు. ఖయ్యాం మరణించాడు. పునరావృతం కాలేని ఒక సురుచిరమైన సంగీత చరిత్రను ముగించాడు.

కభీ కభీ మేరే ఖయాల్ ఆతా హై
కె జైసే తుజ్‌కో బనాయా గయా హై మేరే లియే...

కొందరు పాటను ఎంచుకుంటారు. కొందరిని పాట ఎంచుకుంటుంది. సంగీత ప్రపంచానికి ఖయ్యాం కావాలి.

కభీ కభీ...

అందుకే అది అతణ్ణి తన దరికి చేర్చుకుంది. పంజాబ్‌లో పుట్టిన ఖయ్యాం కుటుంబంలో సంగీతం తెలియదు. పాటా తెలియదు. అప్పుడప్పుడే జనాన్ని ఆకర్షిస్తున్న సినిమాలతో ప్రభావితమై జలంధర్ నుంచి ఢిల్లీ చేరాడు ఖయ్యాం హీరో అవుదామని. అతడి ఉద్దేశ్యం సినిమాలు ఢిల్లీలో తయారవుతాయని. ఢిల్లీలో బాబాయి ఉన్నాడు కనుక అక్కడే ఉంటూ హీరో అయిపోవచ్చని. నగరానికి చేరగానే బాబాయి లెంపకాయ తప్ప వేరే ఏమీ దొరకలేదు. ఇంట్లో కుర్రాణ్ణి కూచోబెట్టి ప్రయోజనం లేదని ఆ బాబాయి తనకు తెలిసిన అప్పట్లో ఢిల్లీలో ఉంటున్న, ఇంకా సినిమాల్లోకి రాని సంగీతకారులు హన్స్‌లాల్–భగత్‌రామ్ దగ్గరకు తీసుకెళ్లాడు. కుర్రాడు బాగానే ఉన్నాడు హీరో కావాలంటే సంగీతం తెలియాలి నేర్పిస్తాములే అన్నారు వాళ్లు. ఎవరి పాటలు వాళ్లే పాడుకోగల హీరోలు ఉండే ఆ కాలంలో అలా ఖయ్యాం పాటలోకి ప్రవేశించాడు. క్రమంగా హీరో పిచ్చి పోయి పాట పూనకం అబ్బింది. ఢిల్లీలో సంగీతం నేర్చుకున్నాడు. లాహోర్ వెళ్లి అక్కడా నేర్చుకున్నాడు. అసిస్టెంట్ స్థాయికి చేరాక రెండో ప్రపంచయుద్ధ సమయంలో సినిమాలు మూలపడితే వెళ్లి సైన్యంలో చేరాడు. హార్మోనియం వాయించడానికి తప్ప ఈ చేతులు తుపాకీ పట్టడానికి పనికి రావని గ్రహించిన అధికారులు ఇతనిలాగే సైన్యంలో పని చేస్తున్న కవి ఫయాజ్ అహ్మద్ ఫయాజ్‌తో జత కలిపి ఒక సాంస్కృతిక బృందంగా చేసి– పోండి.. పోయి జనాన్ని సైన్యంలో చేరేందుకు ఉత్సాహపరచండి అనంటే ఆ పనీ చేశాడు. కాని మళ్లీ బొంబాయికే చేరాడు. కొన్నిరోజులు 'శర్మ' అనే డూప్లికేట్ పేరుతో మ్యూజిక్ చేశాడు. మూలం నుంచి విడుదలైన నదీపాయ విశాలమయ్యి ప్రవాహమయ్యి జనమైదానం చేరడానికి సమయం పడుతుంది. ఖయ్యాంకు కూడా పట్టింది. అన్ని అడ్డంకులు తొలిగి అతడి పేరుతో తొలి పాట జనానికి చేరింది. 'ఫుట్‌పాత్' సినిమాలో తలత్ మెహమూద్ పాడగా దిలీప్ కుమార్ మీద చిత్రించిన ఈ పాట అతడు ఎగరేసిన తొలి గాలిపటం.

షామే గమ్ కీ కసమ్ ఆజ్ గమ్‌గీన్ హై హమ్
ఆఫిజా ఆఫిజా ఆజ్ మేరే సనమ్...

స్వీట్ లస్సీని పోల్చుకోవడం పంజాబీవాడికి చిటికెలో పని. ఖయ్యాం చల్లలో పస ఉందని అదే పంజాబ్‌కు చెందిన కవి సాహిర్ లూధియాన్వీ తక్షణమే కనిపెట్టాడు. వెంటనే తాను పాటలు రాస్తున్న రాజ్ కపూర్ సినిమా 'ఫిర్ సుబ్‌హా హోగి'కి రికమండ్ చేశాడు. సాధారణంగా రాజ్‌కపూర్ సినిమా అంటే శంకర్ జైకిషన్‌లు ప్రత్యక్షం కావాలి. కాని 'ఫిర్ సుబ్‌హా హోగి' సినిమా ప్రఖ్యాత రష్యన్ రచయిత్ దోస్తవ్ స్కీ నవల 'క్రైమ్ అండ్ పనిష్‌మెంట్' ఆధారంగా తయారైంది. 'ఇలాంటి కథకు కాస్త పుస్తకాలు చదివి అర్థం చేసుకోగలవాడు సంగీతం ఇవ్వాలి' అని సాహిర్ చెప్పి ఇప్పించాడు. ఆ సినిమాకు ఖయ్యాం చేసిన *'ఓ సుబ్‌హా కభీతో ఆయేగి'* పాట గంభీరమైనది. బరువైనది. లోతైనది. ఇవాళ్టికి కూడా అలాంటి శుభోదయం కోసం అందరూ ఎదురు చూసేలా చేయగలిగినది.

ఆ తర్వాత ఖయ్యాం బండి ఆగలేదు. 'షోలా ఔర్ షబ్నమ్'లో రఫీ పాడిన *'జీత్ హీ లేంగే బాజీ హమ్ తుమ్'* హిట్ మీదుగా 'షగూన్'లో సూపర్ హిట్ అయిన *'తుమ్ అప్‌నా రంజోగమ్'* పాట మీదుగా 'ఆఖరీ ఖత్'లో ఇంటింటికీ చేరిన లతా పాట *'బహారో మేరా జీవన్ భీ సవారో'* వరకూ సాగింది. అయితే అప్పటికే 'బాబీ' వంటి సినిమాలు విడుదలయ్యి లక్ష్మీకాంత్–ప్యారేలాల్ తుఫాన్ సృష్టిస్తున్నారు. ఆ గాలులను లెక్కచేయకుండా ఖయ్యాంను రెండు సినిమాలు నిలబెట్టాయి. ఒకటి 'రజియా సుల్తాన్', రెండు 'కభీ కభీ'. రెంటికీ కూడా లక్ష్మీకాంత్–ప్యారేలాల్‌నే దర్శక నిర్మాతలు సైన్ చేశారు. కాని రజియా సుల్తాన్ తీస్తున్న కమాల్ అమ్రోహీకి వాళ్ల బాణీ నచ్చక ఖయ్యాం దగ్గరకు వచ్చాడు. 'కభీ కభీ'ని తీస్తున్న యశ్‌చోప్రాను లక్ష్మీకాంత్–ప్యారేలాల్ ట్యూన్ చేసేటట్టయితే నా పాటలు ఇవ్వను అని సాహిర్ లూధియాన్వీ బెదిరించడంతో ఖయ్యాంను తీసుకున్నాడు. రజియా సుల్తాన్‌లోని *'అయ్ దిలే నాదాన్'* పాట లతా పాడిన పాటల్లో ఒక గొప్ప పాటగా చెబుతారు. 'కభీ కభీ'లోని ప్రతి పాటా నేటికీ సెల్‌ఫోన్లలో రింగ్‌టోన్‌గా వినిపిస్తూ ఉంది. ముకేష్ ఆ సినిమాలో పాడిన *'కభీ కభీ మేరే దిల్ మే'*, *'మై పల్ దో పల్ కా షాయర్ హూ'* పాటలు చాలా పేరు తెచ్చాయి. ఆ తర్వాత యశ్ చోప్రాయే తీసిన 'నూరి' కేవలం ఖయ్యాం పాటల బలం వల్ల సూపర్ హిట్ అయ్యింది. అందులోని పాటలు *'నూరీ నూరీ ఆజరే ఓ మేరే దిల్‌బర్ ఆజా'*, *'చోరీ చోరీ కోయీ ఆయే'* కథాస్థలి అయిన కాశ్మీర్ స్వచ్ఛనీటినురగల్లా ఉంటాయి.

కాని ఖయ్యాంను అప్పటికీ ఇప్పటికీ బహుశా ఎప్పటికీ తలుచుకునేది 'ఉమ్రావ్‌జాన్' సినిమా కోసమే. రేఖా సినీ జీవితానికి గౌరవాన్ని తెచ్చిపెట్టిన ఈ సినిమా, కవిగా షహరియార్‌కు చిరంజీవత్వం తెచ్చి పెట్టిన ఈ సినిమా, గాయనిగా ఆశా భోంస్లేకు ప్రామాణికతను ఖరారు చేసిన సినిమా, ఖయ్యాంకు చెరపలేని కీర్తిని తెచ్చి పెట్టింది. గజల్ అంటే లతా మంగేష్కర్ అనుకునే రోజుల్లో ఆశా భోంస్లే గజల్ బాగా పాడుతుందని ఖయ్యాం ఈ సినిమాతో నిరూపించాడు. 'ఉమ్రావ్‌జాన్'లోని *'ఇన్ ఆంఖోకి మస్తీమే'*, *'దిల్ చీజ్ క్యా హై'*... పాటలు కొనసాగుతూనే ఉన్నాయి రసికుల మెహఫిళ్లలో ప్రస్తావనకు వస్తూ.

ఖయ్యాం అంటే ఒరిజినల్ సంగీతం. రాసిన పాటకు బాణీ కట్టిన సంగీతం. గొప్ప కవిత్వానికి గొంతు ఇచ్చిన సంగీతం. కైఫీ ఆజ్మీ, జాన్ నిసార్ అఖ్తర్, అలీ సర్దార్ జాఫ్రీ వంటి గొప్ప గొప్ప కవుల కవనం అతని స్పర్శతో ఆరని సువాసనలీనింది. మన హైదరాబాదీ కవి మగ్దూమ్ మొహియుద్దీన్ గజల్



ఒకటి 'బజార్' సినిమా వల్ల ఖయ్యాం సంగీతంతో పూలు పూలుగా వికసించింది. ఆ గజల్–

ఫిర్ ఛిడీ రాత్ బాత్ ఫూలోంకి
రాత్ హై బారాత్ ఫూలోంకి...

ఖయ్యాంది 92 ఏళ్ల సంపూర్ణ సార్థక జీవనం. పద్మభూషణ్ ఎత్తుకు ఎదిగిన జీవితం. తాను సంపాదించుకున్న పది కోట్ల రూపాయల ఆస్తిని ఆకలిగొన్న కళాకారుల కోసం అర్పించి స్ఫూర్తివంతంగా నిలిచిన జీవితం. శిక్కుమతానికి చెందిన జగ్‌జిత్‌ను వివాహం చేసుకొని కుమారుడికి 'ప్రదీప్ ఖయ్యాం' అని పేరు పెట్టి సహ మత గౌరవాన్ని నిరూపించిన జీవితం.

ఖయ్యాం అనే అందమైన తీరం నావలను బోర్లించేసింది. అవి కదలవు. ఇక ఒడ్డున కూచుని కెరటాల సవ్వడిని వినడం మాత్రమే మనం చేయగలిగింది.

కరోగే యాద్‌తో హర్ బాత్ యాద్ ఆయేగి...

- ఖదీర్

epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ బుధవారం
21-8-2019

లవ్ డాక్టర్ నన్నడగొద్దు ప్లీజ్

ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేనొక అమ్మాయిని లవ్ చేస్తున్నాను. ప్రపోజ్ కూడా చేశాను. తనకి నేనంటే ఇష్టం ఉన్నట్లే మాట్లాడుతోంది. కానీ.. బయటపడకూడదని 'ఫ్రెండ్స్‌లా ఉందాం' అని అంటోంది. మళ్లీ అడిగితే 'నాకు ఇలాంటివి నచ్చవు' అని చెబుతోంది. మీరు దీనికి సొల్యూషన్ చెప్పండి ప్లీజ్!

- శ్రీను

దొరికిపోయావురా బిడ్డా!

'ఏంటి సార్..? అమ్మాయి ఆటాడేసుకుంటోందా సార్???'

డౌటేముంది నీలూ? అబ్బాయి ట్రాప్‌లో పడ్డాడు!!

'ఊరుకోండి సార్..! మీ సిస్టర్స్ అలాంటి వాళ్లు కాదు కదా సార్.. ట్రాప్‌లో వేసే టైపు కాదు కదా సార్???'

అమ్మాయి ట్రాప్‌లో కాదు నీలూ!

'మీకో దండం. అర్థమయ్యేలా చెప్పండి సార్!!'

''అమ్మాయికి నేను నచ్చాను'' అనుకునే ట్రాప్‌లో పడ్డాడు నీలూ!

'శ్రీను.. తన ట్రాప్‌లో తానే పడ్డాడా..? అమ్మాయి ప్రేమిస్తోందని తానే అనేసుకుని.. అదే రైట్ అనేసుకుని.. అమ్మాయి సిగ్గుపడి, బిడియంతో చెప్పలేకపోతోందని ఫీల్ అయిపోయి.. ''నాకు ఇలాంటివి నచ్చవు'' అని అమ్మాయి చెప్పినా వినిపించుకోని ట్రాప్‌లో పడ్డాడా సార్?'

అవును నీలూ! ప్రేమించే వాళ్లలో ఈ వీక్‌నెస్ ఉంటుంది. 'మనసులో నన్ను ప్రేమించినా బయటకి చెప్పలేకపోతున్నారు' అని అనుకునే జబ్బు ఉంటోంది.

'శ్రీనూ..! డోంట్ ఫూల్ యువర్ సెల్ఫ్..!! అనవసరంగా హర్ట్ అవుతావు!!'

lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

5				9	4			8
			3			1	9	4
1				6		2		3
4		8		3			2	
	3	7				8	1	
	5			8		4		7
3		5		7				2
7	4	9			5			
6			9	1				5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా), ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి, ప్రతి 3X3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రాయాలి.

నిన్నటి జవాబు

5	9	8	3	6	2	1	4	7
7	4	3	8	1	9	5	6	2
6	1	2	7	4	5	8	9	3
4	5	9	2	7	8	3	1	6
3	8	1	9	5	6	7	2	4
2	6	7	4	3	1	9	5	8
9	7	5	6	2	3	4	8	1
8	3	6	1	9	4	2	7	5
1	2	4	5	8	7	6	3	9

'సైరా' పోస్టర్

ఫర్హాన్ అక్తర్, రితేష్ అద్వానీ, రామ్‌చరణ్, తమన్నా, చిరంజీవి, సురేందర్ రెడ్డి, సుదీప్

ఇండియాలో ఆయనే మెగాస్టార్

- చిరంజీవి

''సైరా: నరసింహారెడ్డి' చరిత్ర మరచిపోయిన వీరుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా తీసిన సినిమా. దేశంలోని ప్రజలందరూ ఇలాంటి వీరుడి కథ తెలుసుకోవాల్సిన అవసరం ఉందనిపించింది. బడ్జెట్ పరిమితుల కారణంగా ఒకటిన్నర దశాబ్దంగా 'సైరా' వాయిదా పడుతూనే ఉంది. సురేందర్‌రెడ్డి, చరణ్ 'సైరా' చిత్రం చేయడానికి ముందుకు రావడంతో నా కల నెరవేరింది'' అన్నారు చిరంజీవి. స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జీవితం ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'సైరా: నరసింహారెడ్డి'. చిరంజీవి టైటిల్ రోల్ చేశారు. సురేందర్‌రెడ్డి దర్శకత్వం వహించారు. ఇందులో నయనతార కథానాయికగా నటించారు. అమితాబ్ బచ్చన్, విజయ్ సేతుపతి, సుదీప్, రవికిషన్, తమన్నా కీలక పాత్రధారులు. ఈ సినిమాను ఈ ఏడాది అక్టోబర్ 2న విడుదల చేయాలనుకుంటున్నారు. హిందీ వెర్షన్‌ను ఫర్హాన్ అక్తర్, రితీష్ అద్వానీ విడుదల చేస్తున్నారు. గురువారం చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా 'సైరా: నరసింహారెడ్డి' సినిమా టీజర్‌ను మంగళవారం ముంబైలో విడుదల చేశారు. ఈ సందర్భంగా విలేకర్లు అడిగిన ప్రశ్నలకు చిరంజీవి మాట్లాడుతూ– ''ఆజ్‌కా గూండారాజ్' (1992) సినిమా తర్వాత బాలీవుడ్‌లో నాకు ఎందుకు గ్యాప్ వచ్చిందో తెలియడం లేదు. సరైన కంటెంట్ ఉన్న సబ్జెక్ట్ రాలేదు. ఆ కారణంగానే కొంత గ్యాప్ వచ్చింది. ఆ తర్వాత నేను రాజకీయాల్లోకి వెళ్లాను. మళ్లీ 2016లో సినిమాల్లోకి వచ్చాను. ఆ సమయంలో కొత్త వాతావరణం కనపడింది. మళ్లీ బాలీవుడ్‌కి రావాలన్నప్పుడు 'సైరా' సినిమా అయితే సరిపోతుందనిపించింది. అమితాబ్‌గారు నా రియల్ లైఫ్ మెంటర్. నాకు తెలిసి ఇండియాలో మెగాస్టార్ అంటే అమితాబ్ బచ్చన్‌గారే. ఆయన దగ్గరకు ఎవరూ రీచ్ కాలేరు. ఆయనతో కలిసి పనిచేయడం నా అదృష్టం. సినిమాలో నా గురువుగారి పాత్రలో చేయాలని అమితాబ్‌ని కోరినప్పుడు ఆయన వెంటనే అంగీకరించారు. ఆయనకు రుణపడి ఉంటాను'' అని అన్నారు. సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ– ''ఈ సినిమా చేయడం చాలెంజింగ్‌గానే అనిపించింది. అమితాబ్‌గారు, చిరంజీవిగారు నాకు కంఫర్ట్ జోన్‌ను క్రియేట్ చేశారు. నా వెనక చిరంజీవిగారు, చరణ్‌గారు ఉండటంతో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సినిమాను పూర్తి చేయగలిగాను'' అన్నారు. ''అమితాబ్ బచ్చన్, చిరంజీవి వంటి గొప్ప స్టార్స్‌తో కలిసి నటించడాన్ని నా అదృష్టంగా భావిస్తున్నాను'' అన్నారు విజయ్ సేతుపతి. ''అద్భుతమైన నటులతో స్క్రీన్ షేర్ చేసుకోవడాన్ని గొప్ప వరంగా భావిస్తున్నా. ప్రతిసారీ ఇలాంటి సినిమాల్లో నటించే అవకాశం రాదు. వచ్చినప్పుడు కాదనుకుండా చేయడమే'' అన్నారు సుదీప్. ''మెగాస్టార్ చిరంజీవిగారికి నేను పెద్ద అభిమానిని. ఆయన దగ్గర్నుంచి చాలా కొత్త విషయాలు నేర్చుకున్నాను'' అన్నారు రవి కిషన్. ''దక్షిణాది భాష అర్థం కావడమే కష్టం. కానీ సంగీతానికి భాష లేదు. దర్శకుడు, రైటర్స్ నా పనిని సులభం చేశారు'' అన్నారు సంగీత దర్శకుడు అమిత్ త్రివేది. ''నాన్నగారు ఇంట్లో ఒకలా, మేకప్ వేసుకున్నప్పుడు ఒకలా ఉంటారు. ఈజీగా ట్రాన్స్‌ఫార్మ్ అయిపోతారు'' అన్నారు రామ్‌చరణ్. ''చిరంజీవి గారితో కలిసి నటించాలనే నా కల నెరవేరింది'' అన్నారు తమన్నా. ''సినిమాకు భాష లేదు. 'సైరా' ఒక గొప్ప చిత్రం. 'వార్' (హృతిక్ రోషన్–టైగర్ ష్రాఫ్ నటిస్తున్న హిందీ సినిమా), 'సైరా' (ఈ రెండు సినిమాలు అక్టోబరు 2న విడుదల అవుతున్నాయి) రెండు వేర్వేరు సినిమాలు. ప్రేక్షకులు రెండు సినిమాలను చూడొచ్చు'' అన్నారు ఫర్హాన్ అక్తర్. ''సైరా' గురించి రామ్‌చరణ్ చెప్పగానే నేను టీజర్ చూశాను. నాకు చాలా బాగా నచ్చింది. మరికొన్ని రషెస్ చూశాను. దాంతో హిందీలో సినిమాను రిలీజ్ చేయాలనుకున్నాం'' అన్నారు రితీష్ అద్వాని.

నా కమ్ బ్యాక్ మూవీ అనుకుంటా

'జంజీర్' (2013... తెలుగు, హిందీ ద్విభాషా చిత్రం) తర్వాత బాలీవుడ్‌లో మరో సినిమా ఎందుకు చేయలేదు? అన్న ప్రశ్నకు రామ్‌చరణ్ బదులు చెబుతూ – "ఎంత పెద్ద నటుడికైనా కంటెంట్ ఉన్న సినిమా కుదరాలి. వచ్చే ఏడాది రాజమౌళిగారి 'ఆర్‌ఆర్‌ఆర్'తో మీ ముందుకు (హిందీ ప్రేక్షకులను ఉద్దేశిస్తూ) రాబోతున్నాను. బాలీవుడ్‌లో నా కమ్ బ్యాక్ మూవీ ఇది.

రామ్‌చరణ్, చిరంజీవి, ప్రభాస్

'సైరా'తో 'సాహో'!

సైరా: నరసింహారెడ్డి' టీజర్ విడుదల వేడుక మంగళవారం ముంబైలో జరిగింది. 'సాహో' మూవీ ప్రమోషన్‌లో భాగంగా ప్రభాస్ కూడా ముంబైలోనే ఉన్నారు. ఇలా చిరంజీవి, రామ్‌చరణ్, ప్రభాస్ కలిసి ఓ ఫొటోకు ఫోజు ఇచ్చి, అభిమానుల దిల్ ఖుషీ చేశారు.

కిర్రాక్ లుక్

బాలకృష్ణ

'లుక్ అదిరింది. కిర్రాక్ లుక్. భలే ఉంది కొత్త లుక్...' ఇదిగో ఇలానే రెట్టించిన ఉత్సాహంతో బాలకృష్ణ అభిమానులు ఆనందపడిపోతున్నారు. బాలకృష్ణ తాజా చిత్రంలో ఆయన లుక్ విడుదల కావడమే ఇందుకు కారణం. నందమూరి బాలకృష్ణ హీరోగా కేఎస్ రవికుమార్ దర్శకత్వంలో సి. కల్యాణ్ ఓ సినిమాను నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో సోనాల్ చౌహాన్, వేదిక కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాలోని బాలకృష్ణ లుక్‌ను అధికారికంగా విడుదల చేశారు. వాన్‌డైక్ బియర్డ్ (ఒక రకమైన గడ్డం)తో స్టైలిష్‌గా కనిపించారు బాలకృష్ణ. ప్రస్తుతం థాయ్‌లాండ్‌లో యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ప్రకాష్ రాజ్, జయసుధ, భూమిక చావ్లా కీలక పాత్రలు చేస్తున్న ఈ సినిమాకు చిరంతన్ భట్ సంగీతం అందిస్తున్నారు. సి.వి. రావ్, పర్సా నాగరాజు సహ–నిర్మాతలు.

సౌత్ క్వీన్‌కు కత్తెర్లు

కాజల్ అగర్వాల్

''మా కష్టాన్ని వృథా చేయకండి'' అని వాపోతున్నారు కాజల్ అగర్వాల్. రమేష్ అరవింద్ దర్శకత్వంలో కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ప్యారిస్ ప్యారిస్'. హిందీ హిట్ చిత్రం 'క్వీన్'కు ఇది తమిళ రీమేక్. ఈ సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ చిత్రానికి పాతిక కత్తెర్లు ఇచ్చింది సెన్సార్ బోర్డ్. దీంతో 'ప్యారిస్ ప్యారిస్' చిత్రబృందం రివైజింగ్ కమిటీకి వెళ్లింది. ఇటీవల ఈ విషయంపై కాజల్ అగర్వాల్ ఓ ఇంటర్వ్యూలో భాగంగా స్పందిస్తూ –''హిందీ 'క్వీన్' చిత్రాన్ని దక్షిణాది ప్రేక్షకులకు చూపించాలని ఓ మంచి ప్రయత్నం చేశాం. కానీ సెన్సార్ వారు ఇన్ని కట్స్ చెప్పారన్నప్పుడు షాకయ్యాను. వారు చెప్పిన కట్స్‌లో చాలా సన్నివేశాలు మన నిత్య జీవితంలో జరిగేవే ఉన్నాయి. ఈ విషయమే నిర్మాతలకూ చెప్పి సరైన యాక్షన్ తీసుకోమని కోరాను. ఈ సినిమా కోసం చాలా కాలం సమష్టిగా కష్టపడ్డాం. ఆ కష్టానికి తగ్గ ఫలాన్ని అందుకోవాలనుకుప్పుడు ఇలా జరుగుతోంది. ఎటువంటి సెన్సార్ కట్స్ లేకుండానే సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలని కోరుకుంటున్నాను'' అని చెప్పుకొచ్చారు. హిందీ 'క్వీన్' చిత్రం తెలుగు వెర్షన్ 'దటీజ్ మహాలక్ష్మి'గా మలయాళంలో 'జామ్ జామ్'గా, కన్నడలో 'బటర్‌ఫ్లై'గా రీమేక్ అయ్యాయి. 'జామ్ జామ్', 'బటర్ ఫ్లై' చిత్రాలకు సెన్సార్ బోర్డ్ యుఏ సర్టిఫికెట్ ఇచ్చింది.

దర్శకులు ఎర్నేని రంగారావు ఇక లేరు


ఎర్నేని రంగారావు

ప్రముఖ దర్శకులు ఎర్నేని రంగారావు గత ఆదివారం (ఈ నెల 18) తుది శ్వాస విడిచారు. కృష్ణా జిల్లా గురజకి చెందిన రంగారావు 20 ఏళ్ల వయసులోనే సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. కెరీర్ ఆరంభంలో మద్రాస్‌లోని వాహినీ స్టూడియోస్‌లో జయరామ రెడ్డితో కలిసి పెయింటర్‌గా, మౌల్డర్‌గా చేశారు. 'పాతాళ భైరవి' సినిమాలోని విగ్రహం మౌల్డింగ్‌కి పని చేసినవాళ్లలో రంగారావు ఒకరు. రెండేళ్లు వాహినీ స్టూడియోస్‌లో చేసి, డైరెక్షన్ మీద ఆసక్తితో ప్రముఖ దర్శకులు హెచ్.ఎమ్. రెడ్డి, కేవీ రెడ్డి దగ్గర అసిస్టెంట్ డైరెక్టర్‌గా చేరారు రంగారావు. రెండేళ్ల తర్వాత జయరామ రెడ్డితో కలిసి బాపు ఫిలింస్ ఆరంభించి, 1960లో 'టౌన్ బస్' అనే సినిమాని తెలుగులోకి అనువదించి, విడుదల చేశారు. 1963లో ఎన్టీఆర్, షావుకారు జానకి, గుమ్మడి కలయికలో స్వీయదర్శకత్వంలో 'సవతి కొడుకు' అనే సినిమా రూపొందించారు. అలాగే నూతన తారలతో 'మాయావి', 'అర్చన' అనే చిత్రాలను స్వీయదర్శకత్వంలో తెరకెక్కించారు. వ్యక్తిగత విషయానికొస్తే 1954లో తన మేనకోడలు ఉప్పలపాటి రఘుమా దేవిని పెళ్లాడారు. ఈ దంపతులకు కుమారుడు పూర్ణచంద్ర రావు ఉన్నారు. యూఎస్‌లో డాక్టర్‌గా సెటిలైన తనయుడి దగ్గరకు 1990లో వెళ్లిపోయారు రంగారావు. అక్కడ దాదాపు 300 పెయింటింగ్స్ వేసి, న్యూయార్క్, న్యూజెర్సీలో ప్రదర్శనకు ఉంచారు. యూఎస్ పౌరసత్వం పొందిన రంగారావు 2002లో ఇండియా వచ్చేశారు. 2014లో రఘుమా దేవి కన్నుమూశారు. రంగారావు అంతిమ క్రియలు నేడు గురజలో జరుగుతాయి.

మా సినిమా కొనని.. కొన్న మిత్రులకు ధన్యవాదాలు

- కేయస్ రామారావు

వల్లభ, భీమనేని శ్రీనివాసరావు, రాజేంద్రప్రసాద్, ఐశ్వర్యా రాజేష్, విజయ్ దేవరకొండ, రాశీఖన్నా, కె.ఎస్. రామారావు

''కేయస్ రామారావుగారిని మేము 'పప్పా' (డాడీ) అని పిలుస్తాం. ఆయన ప్రతిరోజూ సెట్‌లో ఉంటారు. మీరు రిలాక్స్ అవ్వండి.. మేం చూసుకుంటాం అంటే.. నాకు నచ్చింది, వచ్చింది సినిమా.. ఇదే నా లైఫ్. ఇది చేయకపోతే ఇంకేం చేస్తాం అంటారు. ఇన్ని సినిమాలు చేసినా ఆయన ఇప్పటికీ సినిమాలను ప్రేమిస్తారు'' అన్నారు విజయ్ దేవరకొండ. ఐశ్వర్యా రాజేష్, డా. రాజేంద్రప్రసాద్, కార్తీక్ రాజు, 'వెన్నెల' కిషోర్ ముఖ్య పాత్రల్లో భీమనేని శ్రీనివాసరావు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కౌసల్య కృష్ణమూర్తి: ది క్రికెటర్'. నిర్మాత కె.ఎస్.రామారావు సమర్పణలో కె.ఎ.వల్లభ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 23న విడుదల కానుంది.

ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో **విజయ్ దేవరకొండ మాట్లాడుతూ–** ''రాజేంద్రప్రసాద్ సార్.. మీరు ఈ లైఫ్‌లో చేసినన్ని సినిమాలు నా లైఫ్‌టైమ్‌లో చేయలేనేమో? మీరు చేసిన సినిమాలు, పాత్రలు, అనుభూతులు ఇప్పుడు మా వల్ల కాని పని.. మీలాంటి వారే మాకు స్ఫూర్తి. ఐశ్వర్య నటించిన కొన్ని తమిళ చిత్రాలు చూశాం.. చాలా బాగా చేసింది. మీరు (ఫ్యాన్స్) అన్ని సినిమాలను సపోర్ట్ చేస్తున్నారు. ఈ సినిమాని ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నా. మన సినిమాలు వస్తున్నాయ్.. త్వరలోనే దింపుతున్నాం. నీటిని వృథా చేయకండి. 2022కి తాగునీటికి ఇబ్బందులు తప్పవని సర్వేలు చెబుతున్నాయి. ప్రభుత్వాలు కూడా దీనిపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. నీటి లీకేజీలను అరికడదాం. ఓ రోజు నీళ్లు లేకుంటే పరిస్థితి ఏంటో ఆలోచించండి. పెట్రోల్‌లా నీళ్లు కూడా లిమిటెడ్‌గా ఉన్నాయి.. పొదుపుగా వాడండి'' అన్నారు.

రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ – ''క్రియేటివ్ కమర్షియల్స్‌లో 40 ఏళ్ల క్రితం 'ఛాలెంజ్' అనే సినిమాలో తొలిసారి నటించా. ఆ తర్వాత అనుకోకుండా నేను కామెడీ హీరోగా బాగా సక్సెస్ అయ్యాక కూడా నాతో 'ముత్యమంత ముద్దు' అని అద్భుతమైన సినిమా చేయించారాయన. ఈ సంస్థ ఇంతకాలం ఈ సంస్థ అద్భుతమైన స్థానంలో ఎందుకుంది అంటే.. మంచి సినిమాలు, గుర్తుండే సినిమాలు, సామాజిక స్పృహ ఉన్న సినిమాలు అందించింది కాబట్టి. నాలుగు మంచి సినిమాలు వెనకేసుకున్న బ్యానర్ కాబట్టి ఇప్పటికీ సినిమాలు తీస్తూనే ఉంది. ఒరిజినల్ కంటే రీమేక్‌లు బాగా తీశాడు కాబట్టి భీమనేని శ్రీనివాస్‌కి ఇంత మంచి పేరుంది. 'కణ' సినిమా కంటే 'కౌసల్య కృష్ణమూర్తి' బాగుంటుంది. నా జీవితంలో ఓ 10 సినిమాలుంటే వాటిలో ఈ సినిమా ఉంటుంది'' అన్నారు.

భీమనేని శ్రీనివాస్ మాట్లాడుతూ – ''నేను ఎప్పుడూ రీమేక్‌ని రీమేక్‌లా చేయలేదు. ఫ్రెష్ స్టోరీలా భావించి మన నేటివిటీకి తగ్గట్టు చేసుకుంటూ వచ్చా.. అందుకే హిట్స్ సాధించా. ఈ మధ్య క్రికెట్ నేపథ్యంలో వచ్చినవి మేల్ సెంట్రిక్ ఫిల్మ్స్.. కానీ 'కౌసల్య కృష్ణమూర్తి' లేడీ ఓరియంటెడ్ ఫిల్మ్. ప్రతి తల్లిదండ్రులు తమ పిల్లలను ఇష్టమైన రంగాల్లో ప్రోత్సహించాలి. కౌసల్య పాత్రలో ఐశ్వర్య అద్భుతంగా నటించింది'' అన్నారు.

కేయస్ రామారావు మాట్లాడుతూ – ''ఈ సినిమా తీయడానికి ముఖ్య కారణం క్రాంతి మాధవ్. విజయ్ దేవరకొండతో మేం చేయనున్న సినిమా గురించి మాట్లాడుతున్నప్పుడు ఓ హీరోయిన్‌గా ఐశ్వర్యా రాజేష్ గురించి చెప్పాడు. ఆ సమయంలో ఐశ్వర్య నటించిన 'కణ' టీజర్ చూసి బాగుందని రీమేక్ చేశాం. 'కణ' కంటే 'కౌసల్య కృష్ణమూర్తి' సినిమాకి తెలుగులోనే తను ఎక్కువ కష్టపడింది. ఎందుకంటే ఇక్కడ మొదటి సినిమా కాబట్టి. నా సినిమాల్లో కథ బాగుందంటే అవి తయారు చేసిన వారి గొప్పదనం అది. వారందరూ గొప్ప రచయితలు, దర్శకులు, నటులు.. ఎంతో గొప్పగా చేయబట్టి, అవి నాకు నచ్చబట్టి.. ఓ నిర్మాతగా నేను కూడా వ్యాపారం చేసుకోవచ్చని భావించా. సినిమా వ్యాపారం చాలా రిస్క్‌తో కూడుకున్నది. ఏడాదికి 200 సినిమాలు రిలీజ్ అయితే వాటిల్లో మన సినిమా గొప్పగా ఉండాలనుకుంటే తప్ప ఆ సినిమా బతికి బట్టకట్టలేని పరిస్థితి. అలాంటి సినిమాలు చేయడానికి కోదండ రామిరెడ్డి, రవిరాజా పినిశెట్టి, కె.విశ్వనాథ్, అజయ్... ఇలా ప్రతివాళ్లూ కష్టపడ్డారు. నా గురించి, నా బ్యానర్ గురించి వారంతా కష్టపడితేనే గొప్ప సినిమాలొచ్చాయి. 2019లో ఓ మంచి సినిమా చూశామని సంతృప్తిగా చెప్పుకునే చిత్రమిది. మా సినిమాని ఆంధ్రప్రదేశ్‌లో విడుదల చేస్తున్న నా స్నేహితులకు థ్యాంక్స్.. కొనటానికి రాని, పెద్ద సినిమాలే కొనే మిత్రులకు కూడా థ్యాంక్స్.. ఎందుకంటే శాటిలైట్, డిజిటల్ మినహా ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాని నేనే రిలీజ్ చేస్తున్నా. ఈ సినిమాని అమ్మటానికి నేను ప్రయత్నించా.. కానీ, ఐశ్వర్యారాజేష్ ఏమైనా అమితాబ్ బచ్చనా? చిరంజీవినా? అనుకొని ఉండొచ్చు. సినిమా చూస్తే ఆవిడేంటో తెలుస్తుంది'' అన్నారు.

ఐశ్వర్యా రాజేష్ మాట్లాడుతూ – ''నా తొలి చిత్రం క్రాంతి మాధవ్‌గారి దర్శకత్వంలో విజయ్ దేవరకొండతో సైన్ చేశా.. అదే ఫస్ట్ సినిమా అవుతుందనుకున్నా. కానీ 'కౌసల్య కృష్ణమూర్తి' అయింది. తమిళ్‌లో 25 సినిమాలు చేశా.. ఆ తర్వాత 'కణ' నాకు వచ్చింది. ఆ సినిమా నా కల. అది బ్లాక్‌బస్టర్ అవడంతో వెనుతిరిగి చూసుకోలేదు. ఇలాంటి సినిమాతో తెలుగులో ఎంట్రీ ఇవ్వడం లక్కీ. ఈ సినిమాకి బెస్ట్ నటిగా తమిళంలో 10 అవార్డులు తీసుకున్నా. తెలుగు ప్రేక్షకులకు కూడా నచ్చుతుందనుకుంటున్నా'' అన్నారు.

కెమెరామేన్ ఆంధ్రూ, ఏషియన్ సినిమాస్, నిర్మాత నారాయణ్‌దాస్, హీరోయిన్ రాశీ ఖన్నా తదితరులు పాల్గొన్నారు.

ఆయన పిలిచారు.. నేను వెళ్లాను

- ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం

ఎస్పీ చరణ్, బాలసుబ్రహ్మణ్యం

''నేను, అన్నయ్య ఏసుదాస్, చిత్ర ముగ్గురం కలిపి అన్ని భాషల్లో దాదాపు లక్ష పాటల వరకు పాడితే అందులో తెలుగు పాటలే 35,000 వరకూ ఉంటాయి'' అన్నారు ప్రముఖ గాయకుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం. అలేఖ్య హోమ్స్ సమర్పణలో ఎలెవన్ పాయింట్ టూ ప్రొడక్షన్స్ వారు 'లెజెండ్స్' సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమం నవంబర్ 30న హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో జరగనుంది. ఈ సందర్భంగా ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం మాట్లాడుతూ– ''ఈ ప్రోగ్రామ్‌లో పాటలు ఎక్కువ, మాటలు తక్కువగా ఉంటాయి. గతంలో ఇలాంటి ప్రోగ్రామ్ జరగలేదు. మహ్మద్ రఫీ, కిషోర్ కుమార్, లతా మంగేష్కర్‌లు ఎక్కడా కలిసి ప్రోగ్రామ్‌లు చేయలేదు. వాళ్లతో పోల్చుకునేంత పెద్దవాళ్లం కాకపోవచ్చు కానీ, స్కేల్ కోసం చెప్తున్నాను. మూడు గంటల్లో ముగ్గురం 30 లేదా 35 పాటలు పాడతాం. మన దేశంలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చే టాలెంటెడ్ మ్యూజీషియన్స్‌తో పాటు రెహమాన్ స్కూల్ ఆఫ్ మ్యూజిక్ నుంచి సన్‌షైన్ ఆర్కెస్ట్రా పిల్లలు కూడా మా బృందంలో ఉంటారు. రెహమాన్ దగ్గర ఉన్న శ్రీనివాసమూర్తి కూడా భాగమవుతున్నారు'' అన్నారు.

పాటలపై రాయల్టీ విషయంలో మీరు, ఇళయరాజా కొంత కాలం మాట్లాడుకోలేదు. ఇప్పుడు కలుసుకున్నారు. మీరు మళ్లీ ఎలా కలుసుకున్నారు? అని అడిగితే – ''నేనెప్పుడూ ఆయన సంగీతంలో పాడనని చెప్పలేదు. ఆయన ఎప్పుడు పిలిస్తే అప్పుడు వెళ్లటానికి తయారుగా ఉన్నాను. ఆయన పిలిచారు, నేను వెళ్లాను. రిహార్సల్స్‌కి వెళ్లినప్పుడు ఏరా.. ఎలా ఉన్నావు? అంటే బావున్నాను, అంటే బావున్నాను అని ఇద్దరం అనుకున్నాం. 'ఒకసారి ఇలా రా. చాలా రోజులైంది కౌగిలించుకొని' అన్నారు. ఇద్దరం కౌగిలించుకున్నాం. అంతటితో అయిపోయింది. గతంలో ఎలా ఉన్నామో ఇప్పుడు అలానే ఉన్నాం. ఈ మధ్య రెండు ప్రోగ్రామ్‌లు కలిసి చేశాం. కోయంబత్తుర్‌లో ఓ ప్రోగ్రామ్, వచ్చే ఆదివారం తిరుచునాపల్లిలో ఓ ప్రోగ్రామ్ చేస్తున్నాం. అలాగే వచ్చే ఏడాది మార్చిలో 6 వారాల పాటు అమెరికాలో ప్రోగ్రామ్‌లు ఇవ్వనున్నాం. ఆయన అయితే నాతో ప్రోగ్రామ్‌లు చేయటానికి ఫిబ్రవరి వరకు డేట్స్ అడుగుతున్నారు కానీ, ఖాళీగా లేవు. ఇంట్లో వాళ్ల మధ్య ఎప్పుడైనా పొరపొచ్చాలు రావచ్చు. ఇద్దరి మనస్తత్వాలను బట్టి ఆ సమస్యను పరిష్కరించుకోవటం చాలా ఈజీ. పట్టుదలలు, పంతాలు ఉంటే చాలా కష్టం. తెగేదాకా ఏదీ లాగకూడదు. ఇద్దరికీ కలిసి పని చేయాలని కోరిక ఉంది కాబట్టి మాకు ఈజీ అయింది. అయినా ఇది వేరే ఒక ఇష్యూ మీద వచ్చిన సమస్య తప్ప వ్యక్తిగతమైనది కాదు. ఎందుకంటే నా పాట అంటే ఆయనకి ఇష్టం, ఆయన సంగీతమంటే నాకు బహు ఇష్టం. ఆ కాంబినేషన్ కావాలని సంగీత ప్రియులంతా ఎదురు చూస్తుంటే అది జరిగింది. అంతకంటే ఏం కావాలి'' అని చెప్పారు. ఈ కార్యక్రమంలో బాలు తనయుడు, గాయకుడు ఎస్.పి చరణ్ పాల్గొన్నారు.

సినిమాకి ఆ ఇద్దరే ప్రాణం

- శివాజీ రాజా

సుదర్శన్, బాబీ సింహా, శివాజీరాజా, విజయ్ రాజా, రమాకాంత్

''దాదాపు 35 ఏళ్ల క్రితం 'కళ్ళు' సినిమా ద్వారా నేను హీరోగా పరిచయమయ్యా. ఆ సినిమా నాకు 17 అవార్డులు తీసుకొచ్చింది. ఆ చిత్రంలో హీరో నేనే అయినా గొల్లపూడిగారు, రఘుగారే హీరోలని ఇప్పటికీ చెబుతుంటాను. ఎందుకంటే రచయిత, దర్శకుడే సినిమాకు ప్రాణం. 'ఏదైనా జరగొచ్చు' సినిమా కూడా రమాకాంత్‌దే'' అని శివాజీ రాజా అన్నారు. ఆయన తనయుడు విజయ్ రాజా హీరోగా, పూజా సోలంకి, సాషా సింగ్ హీరోయిన్లుగా కె. రమాకాంత్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఏదైనా జరగొచ్చు'. సుదర్శన్ హనగోడు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 23న కె.ఎఫ్.సి ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా రిలీజ్ అవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో బాబీ సింహా మాట్లాడుతూ– ''ఈ కథ విన్నప్పుడు ఇలాంటి కథను దర్శకుడు ఎలా ఆలోచించారు? ఎలా సీన్లు రాసుకున్నారు? వాటిని ఎలా కనెక్ట్ చేశారు? అని ఆశ్చర్యపోయాను. విజయ్ రాజాకి తొలి సినిమా అయినా బెరుకు లేకుండా నటించాడు'' అన్నారు. ''ఇదొక డార్క్ కామెడీ హారర్ థ్రిల్లర్. తెలుగు స్క్రీన్‌పై ఇప్పటి వరకు చూడని ప్రేమకథ మా సినిమాలో చూస్తారు'' అన్నారు రమాకాంత్. ''ఈ చిత్రం ద్వారా సంగీత దర్శకుడిగా పరిచయం కావడం సంతోషంగా ఉంది. ఈ ప్రాజెక్టు నాలుగు ఏళ్ల క్రితం స్టార్ట్ అయింది. అన్ని పాటలు అప్పుడే కంపోజ్ చేశాం'' అన్నారు శ్రీకాంత్ పెండ్యాల. ''జిగర్తండా'లో బాబీ సింహాగారి నటన చూసి ఆయనతో కలిసి నటించాలనుకున్నా. నా ఫస్ట్ సినిమాకే ఆ అవకాశం రావడం అ

ఎప్పటికీ మీ అమ్ములునే!

సీరియల్

మూగ అమ్మాయిగా అమ్ములు తెలుగు టీవీ ప్రేక్షకులకు సుపరిచయమే. 'స్టార్ మా'లో వచ్చే 'మౌనరాగం' సీరియల్ ద్వారా ప్రియాంకా జైన్ 'అమ్ములు' పాత్రలో అందంగా ఒదిగిపోయింది. సినిమాలు చేస్తూ వెండి తెర నుంచి బుల్లితెరకు షిఫ్ట్ అయిన నటి ప్రియాంకా జైన్ చెబుతున్న ముచ్చట్లివి.

'మౌనరాగం సక్సెస్‌ను చాలా బాగా ఎంజాయ్ చేస్తున్నాను. ఇక్కడి వాళ్లంతా నన్ను తమ ఇంటి అమ్మాయిగా అనుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. నేను పుట్టి పెరిగింది ముంబయ్‌లో. మా నాన్న మనోజ్ జైన్ మొబైల్ బిజినెస్ వల్ల నా చిన్నతనంలోనే బెంగుళూరుకి షిఫ్ట్ అయ్యాం. చిన్నప్పుడు చదువు మీద అంత ఆసక్తి చూపేదాన్ని కాదు. దీంతో మా అమ్మ ఫల్గునీ జైన్ నన్ను 'నటి'ని చేయాలనుకున్నారు. నా చిన్నప్పటి నుంచి ప్రతి హాలీడేస్‌లోనూ ఎక్కడ ఆడిషన్స్ జరిగితే అక్కడకు తీసుకువెళ్లేవారు. టెన్త్ క్లాస్‌లో ఉన్నప్పుడు మాత్రం నాన్న 'నో' చెప్పారు. ఎగ్జామ్స్ పూర్తయ్యాక ఫొటో షూట్ చేయించారు. ఆ తర్వాత కొన్ని బ్యూటీ పేజెంట్స్‌లో పాల్గొన్నాను. కన్నడలో 'గోలీసోడా' అనే మూవీలో అవకాశం వచ్చింది. అదే తెలుగులో డబ్ అయ్యింది. ఆ తర్వాత 'చల్తే చల్తే, వినరా సోదర వీరకుమారా' సినిమాలో చేశాను. ఆ తర్వాత 'స్టార్ మా' మౌనరాగం సీరియల్‌లో హీరోయిన్‌గా ఆఫర్ వచ్చింది.

సవాల్‌గా తీసుకున్నాను

సీరియల్‌లో నా పాత్ర పేరు అమ్ములు. టీవీ సీరియల్‌లో మూగ అమ్మాయి ద్వారా కథను మెప్పించడం అంటే ఒక పెద్ద ప్రయోగమే అనుకున్నాను. ఇందులో డైలాగుల కంటే హావభావాలకే ఎక్కువ ఇంపార్టెన్స్. నటనలో బాగా రాణించవచ్చు అని ఈ పాత్ర నచ్చి ఒప్పుకున్నాను. మా డైరెక్టర్, ప్రొడ్యూసర్.. నాలో 'అమ్ములు'ను చూశారు. నన్ను అంత కాన్ఫిడెంట్‌గా నమ్మి ఓకే చేశారు. నా పాత్రకు నేను న్యాయం చేశానని ఇప్పుడు వస్తున్న ప్రశంసలు బట్టి తెలుస్తోంది.

ఉదయం లేస్తూనే సీరియల్

ఈ ఫీల్డ్‌కి రావడానికి ముందు వద్దని చెప్పిన మా నాన్న ఇప్పుడు హాట్‌స్టార్‌లో తెల్లవారు జామునే ఎపిసోడ్ కోసం చూస్తారు. అమ్మ, అమ్మమ్మ, తాతయ్యలకు భాష అర్థం కాకపోయినా అన్ని పనులు పూర్తి చేసుకొని సీరియల్ టైమ్‌కి టీవీ ముందు కూర్చుంటారు.

లీనమైపోయాను

సీరియల్ మొదట రాజమండ్రి దగ్గర గోదావరి బ్యాక్ డ్రాప్‌లో స్టార్ట్ అయ్యింది. మొదటి రోజు లొకేషన్‌లో లంగాఓణీ వేసుకొని అక్కడ చెయిర్ వేసుకొని కూర్చుంటే.. ఒక్క సెకన్‌కూడా కాలేదు 'ఈ ఇల్లు నాది, ఈ గోదావరి నాది' అనిపించింది. అంతగా ఆ పాత్రలో లీనమైపోయాను. సీరియల్‌లో నాన్న అంటే భయం. అతను నా ముఖం కూడా చూడరు. ఆ భావాలు ప్రేక్షకులకు అర్థమయ్యేలా నా ముఖ కవళికలు, నటన ఉండాలి. చిన్న తేడా కూడా రాకూడదు. కానీ, ఎందుకో తెలియదు ప్రతి ఎమోషన్ మనసు నుంచి వచ్చేది. కొన్నిసార్లు నేను సరిగా నా భావాలను తెలియపరచలేదు అనిపించినప్పుడు నా చుట్టూ ఉన్నవారు సలహాలు ఇచ్చేవారు. ముందు నుంచి ఈ సీరియల్‌కి ఎలాంటి ప్రాక్టీస్ చేయలేదు. కానీ, అమ్ములుగా ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాను. ఇదే సీరియల్ తమిళ్‌లో కూడా వస్తోంది. అందులోనూ నేనే అమ్ములుని.

కొత్త కొత్తగా ఉన్నవే..

ఎప్పుడూ ఒకేలా ఉండిపోకూడదు. కొత్త కొత్తవి ట్రై చేయాలనిపిస్తుంది. ప్రేక్షకులకు నేను ప్రతీసారి కొత్తగా పరిచయం అవ్వాలనుకుంటాను. అందుకే విభిన్న క్యారెక్టర్ల ద్వారా మెప్పించాలనుకుంటున్నాను. ఎలాంటి క్యారెక్టర్ చేస్తున్నాం అనేది ముఖ్యం కాదు. ఆడియన్స్‌ని ఇన్‌స్పైర్ చేస్తూ ఉండాలి అని కోరుకుంటాను.

మా అమ్మాయి అమ్ములు

రాజమండ్రి దగ్గర మౌనరాగం షూట్ జరుగుతుంటే ఆడియన్స్ పరిగెత్తుకొని వచ్చేసేవాళ్లు. నా ఫస్ట్ అటెమ్ప్ట్‌కే మంచి రెస్పాన్స్ 'మీరు మా అమ్మాయి అమ్ముల.. మా ఇంటికి ఎప్పుడు వస్తారు' అని అడుగుతుంటారు. ఎవరైనా మేడమ్ అని పిలిస్తే 'మేడమ్ కాదు, మీ అమ్ములునే' అని చెబుతుంటాను.

వంటలోనూ కొత్తదనం

తీరిక దొరికితే వంటలో కొత్త కొత్త ప్రయోగాలు చేస్తుంటాను. వంట చేయడం అంటే చాలా ఇష్టం. అయితే, వంట చేసే సమయంలో మధ్యలో అమ్మతో సహా ఎవరూ రాకూడదని కండిషన్ పెడతాను. వంటతో పాటు పెయింటింగ్, సింగింగ్, డ్యాన్స్... ఇష్టపడతాను.

అంతా నేచురల్

యూనిట్‌లో తెలుగువారిని మెప్పించేలా ఉండాలన్నారు నా కాస్ట్యూమ్స్. ముందు తీసుకున్న కలర్ డ్రెస్సులు కూడా మురికి చేసి డల్‌గా మార్చేశాం. ఫస్ట్ డే మేకప్ మ్యాన్ మేకప్ చేశారు. నాకు మేకప్‌తో ఆ క్యారెక్టర్‌ని చేయడం నచ్చలేదు. మరుసటి రోజు మేకప్ లేకుండా చేస్తాను, అప్పుడు చూడండి అని చెప్పాను. మేకప్ లేకుండా లొకేషన్‌కి వెళితే ఇలాగే నేచరల్‌గా కావాలన్నారు. దీంతో మళ్లీ మళ్లీ టచప్ అనేదే లేదు. అలా నేచరల్‌గా ఆడియన్స్ అమ్ములు క్యారెక్టర్‌ని రిసీవ్ చేసుకున్నారు.

ముందు నాకు అస్సలు తెలుగు రాదు. వింటూ వింటూ రెండు నెలల్లో తెలుగు వచ్చేసింది. ఎవరేం మాట్లాడుతారో వాళ్ల మధ్య ఉంటూ మాటలు వింటూ వచ్చాను. మొదట్లో కాదు, రాదు, వద్దు.. పదాలను ఎక్కడ ఉపయోగించాలో తెలియదు. యూనిట్‌లో తెగ నవ్వుకునేవారు. ఇప్పుడు నా భాష విని తెలుగమ్మాయినే అంటున్నారు. మూగ మ్మాయిలా నటించినా నా యాక్టింగ్ మాట్లాడుతుంది అనుకుంటాను.''

– నిర్మలారెడ్డి

విభజన గాయం

● తమస్



దేశ విభజన రేపిన గాయం ఈనాటికీ ఇరు దేశాలనూ సలపుతూనే ఉంది. నేల మీద గీచిన గీత హృదయాలను భగ్నం చేసింది. ఆనాటి చరిత్ర, ఆ ప్రజల వేదన సాహిత్యంలో ప్రతిబింబించింది. భీష్మ సహాని రచన 'తమస్'కు గోవింద్ నిహ్లాని ఇచ్చిన బుల్లితెర రూపమే 'తమస్'.

నాథు తన షాప్‌లో పనిచేసుకుంటూ ఉన్నాడు. ఢెకెదార్ అనే పశువైద్యుడు నాథు వద్దకు వచ్చి తన వైద్య అవసరాల కోసం ఓ పందిని చంపి తీసుకురావాలని అడుగుతాడు. తాను ఆ పని చేయలేనని, పందిని చంపడంలో తనకెలాంటి నైపుణ్యం లేదంటాడు నాథు. ఢెకెదార్ పట్టుబట్టి నాథుకు 5 రూపాయలు ఇచ్చి ఒప్పించడంతో 'సరే, రేపు ఉదయం నాటికి చంపి తీసుకొస్తా'నని చెబుతాడు.

నాథు పందిని చంపే మొట్టమొదటి సీన్ ప్రేక్షకుల్లో ఒక ఉత్కంఠను కలిగిస్తుంది. 1947 దేశ విభజన కాలంలో సిక్కులు, ముస్లింలు మత విద్వేషాలతో ఏ విధంగా రగిలిపోయారో బుల్లితెర మీద ధైర్యంగా చూపిన సీరీస్ 'తమస్'.

మరుసటి రోజు ఉదయం బక్షిజి, రాజకీయ పార్టీలోని కొంత మంది సభ్యులు ప్రచారంలో భాగంగా ముస్లిం మత పెద్ద మొహల్లా వద్దకు చేరుకుంటారు. అక్కడి మురికి కాలువలను శుభ్రపరచడం, దేశభక్తి గీతాలను పాడటం చేస్తూ... మొహల్లాతో పాటు ఉన్న ఇతర ముస్లింలను కూడా తమ కార్యక్రమంలో పాల్గొనమని కోరుతారు. వాళ్లు అందుకు ఒప్పుకోరు. అంతలోనే మసీదు మెట్ల వద్ద ఎవరో ఒక పంది మృతదేహాన్ని విసిరేశారనే వార్త దావానలంలా వ్యాపిస్తుంది. దీంతో అక్కడి ముస్లింల నుంచి పార్టీ సభ్యుల మీదకు రాళ్లు వచ్చి పడతాయి. ఇండ్లకు నిప్పు అంటుకుంటుంది. కాసేపట్లో అంతటా అశాంతి నెలకొంటుంది.

అశాంతికి మూలం

సమాజంలో ఏర్పడిన అశాంతికి భయపడి, ముస్లిం లీగ్ ప్రతినిధి బక్షిజీ, హయత్ బక్ష్ డిప్యూటీ కమిషనర్ రిచర్డ్‌ను కలిసి, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతారు. పోలీసులను మోహరించాలని లేదా కర్ఫ్యూ విధించాలని బక్షిజీ, హయత్ చేసిన సూచనలను రిచర్డ్ తిరస్కరిస్తాడు. బదులుగా పార్టీ సభ్యులే శాంతి భద్రతలను కాపాడాలని ఈ విషయాన్ని మిగతా వర్గాలను కోరమని చెబుతాడు. నాథు మసీదు వద్ద పంది మృతదేహాన్ని చూసి తాను గత రాత్రి చంపిన పంది అదేనని గుర్తుపట్టి ఆశ్చర్యపోతాడు. అశాంతికి లోనవుతాడు. సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేటప్పుడు వీధిలో ఉన్న ఢెకెదార్‌ను చూస్తాడు. నాథు అతని దగ్గరకు వెళ్లడానికి ప్రయత్నిస్తాడు. కాని, ఢెకెదార్ నాథుకి అందకుండా పరిగెత్తుతాడు. తాను చంపిన పంది వల్లే అల్లర్లు తలెత్తాయని తెలుసుకున్న నాథు అపరాధ భావనతో ఇంటికి వెళ్లి గర్భవతిగా ఉన్న తన భార్య కమ్మోకి అసలు విషయం చెబుతాడు. బయటనుంచి వినిపిస్తున్న గొడవలను చూసిన వాళ్లకు దూరాన ఇండ్లు కాలిపోవడం కనిపిస్తుంది. ఆ మత హింస కు తానే కారణమని నాథూ తనని తాను నిందించుకుంటాడు.

ఇల్లు వదిలి...

ప్రమాదాన్ని గ్రహించిన నాథు భార్య, తల్లితో కలిసి ఆ ప్రాంతం వదిలి సిటీకి వెళ్లిపోవాలని నిర్ణయించుకుంటాడు. వాళ్లు కాలినడక తమ ప్రయాణాన్ని మొదలుపెడతారు. నాథు తన వికలాంగ తల్లిని వీపుపై మోస్తుంటాడు. ప్రయాణ సమయం లో నాథు తల్లి చనిపోతుంది. అడవిలోనే తల్లి భౌతిక కాయాన్ని కాల్చి, తల్లికి సరైన అంత్యక్రియలు చేయలేని తన దుస్థితికి దుఃఖిస్తాడు.

కూతురు కోసం..

హర్నంసింగ్ అతని భార్య బాంటో లది సిక్కు కుటుంబం. పొరుగూర్లో ఉన్న తమ కుమార్తె జస్బీర్ ఇంటికి వెళ్లాలనుకుని బయల్దేరుతారు. వారు రాత్రంతా కాలినడకన ప్రయాణించి ఒక గ్రామానికి చేరుకుంటారు. అక్కడ ఎవరింటిలోనైనా కాసేపు విశ్రాంతి తీసుకొని బయల్దేరుదామని ఓ ఇంటి తలుపు తడతారు. ఆ ఇల్లు ముస్లిం ఎహ్సాన్ అలీకి చెందినది. అతను గతంలో హర్నం సింగ్‌కు స్నేహితుడే. తన కొడుకుకు తెలియకుండా స్నేహితుడి కుటుంబానికి ఆశ్రయం ఇస్తాడు ఎహ్సాన్. పగటిపూట వాళ్లు దాక్కున్నా రాత్రి సమయంలో ఎహ్సాన్ కొడుకు హర్నం సింగ్ వాళ్లను చూస్తాడు. తమ ఇంటిని తక్షణమే వదిలి వెళ్లమనడంతో అక్కణ్ణుంచి బయల్దేరుతారు హర్నం సింగ్, అతని కుటుంబం. మరుసటి రోజు ఉదయం నాథు, అతని భార్యను అడవిలో కలుస్తారు. అందరూ కలిసి గురుద్వారాకి బయల్దేరుతారు.



● 1947లో పంజాబ్ విభజన సమయంలో అల్లర్లతో అట్టుడుకుతున్న పాకిస్తాన్ నేపథ్యంలో ఈ చిత్రం విభజన పర్యవసనాలను కళ్లకు కట్టింది. ఆ సమయంలో భారతదేశానికి వలస వచ్చిన సిక్కు, హిందూ కుటుంబాల దుస్థితిని చూపింది. 1988లో వచ్చిన ఈ సీరియల్ ఆ తర్వాత నాలుగు గంటల నిడివిగల చలనచిత్రంగా రూపొందింది. 35వ జాతీయ సినిమా అవార్డులో మూడు అవార్డులు 'తమస్' సినిమా గెలుచుకోవడం విశేషం.

● 1988 కాలంనాటి సీరీస్ తమస్. మొదటి సన్నివేశంలోనే ఓమ్ పురి పాత్ర ఒక పందిని చంపడానికి ప్రయత్నిస్తుంది. ఓపెనింగే ఒక ఆకట్టుకునే ప్రదర్శన. కానీ, భయం, హింస వంటి ఇతివృత్తాలతో ఒక చీకటి కోణాన్ని ఆవిష్కరించింది. దూరదర్శన్‌లో ప్రసారమైన ఈ మినీ సిరీస్‌కు స్వరకర్త వన్‌రాజ్ భాటియా సంగీతం మనల్ని వెంటాడుతుంది. రచయిత భిషమ్ సహ్ని హిందీ నవల తమస్ నుంచి దర్శకుడు గోవింద్ నిహ్లాని తీసుకుని ఈ సీరియల్‌ను రూపకల్పన చేశాడు.

● తమస్, అంటే చీకటి. భారత విభజన సమయంలో వలస వచ్చిన సిక్కులు, హిందూ కుటుంబాల కథ ఇది. ఈ కథాంశం నిహ్లానీని ఆశ్చర్యపరించింది. 'ఇది సినిమాకు తగిన కథాంశం అవుతుంది' అనుకున్నారు. అయితే, ఈ ప్రాజెక్ట్‌కు చాలా డబ్బు అవసరం అవుతుంది. ఇది అంత ఆచరణీయం కాకపోవచ్చు అని కూడా అనుకున్నాడు. 'ఈ ఇతివృత్తాన్ని వలిచయం చేయడానికి ముందు దూరదర్శన్ ప్రతినిధులతో మాట్లాడాను. వారూ ఆసక్తి కనబరిచారు. ఈ కథాంశం వివాదాస్పదమని, అభ్యంతరాలు ఉండవచ్చనీ భావించాను. ముందు కొంత భయపడ్డాను. ఈ సీరీస్‌ను నిషేధించవచ్చని కూడా అనుకున్నాను. నన్ను కొందరు హిందూ వ్యతిరేకి అనుకున్నారు. దేశ శాంతి భద్రతలకు భంగం కలిగిస్తుందనీ భావించారు. కొందరు విభజన వాస్తవాలను కచ్చితంగా ప్రదర్శించలేదన్నారు' అని నాటి విషయాలను ఓ ఇంటర్వ్యూలో దర్శకుడు నిహ్లాని వివరించారు.

● ఇందులోని సీన్స్ కోసం గుర్‌గావ్‌లోని కొన్ని ప్రదేశాలు, అక్కడి ఫిల్మ్‌సిటీని ఎంచుకున్నారు. అప్పటికే పేరున్న నాటక, సినిమా రంగ అగ్ర నటీనటులు.. ఓమ్‌పురి, అమ్రిష్‌పురి, దినా పథక్, ఎ.కె.హంగల్, ఇష్ట్‌ఖర్, సురేఖ సిక్రీ. మొదలైనవారు ఇందులో నటించారు.

కమిటీ ఏర్పాటు.. ఇంత ఘోరం జరిగాక రిచర్డ్ నగరంలోని ప్రముఖ వ్యక్తులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, అక్కడి ప్రభుత్వం తీసుకున్న సహాయక చర్యల గురించి తెలియజేస్తారు. శాంతి సందేశాన్ని పంపడానికి నాయకులను అమన్ కమిటీ ఏర్పాటు చేయాలని కోరుతారు. బక్షిజీ, హయత్ బక్షన్‌ను అమన్ కమిటీ ఉపాధ్యక్షులుగా నియమిస్తారు. సమావేశం ముగింపులో ఢెకెదార్ మత సామరస్యం నినాదాలు చేస్తూ కనిపిస్తాడు. శరణార్థి శిబిరంలో హర్నం సింగ్, బాంటో, కమ్మో ఉంటారు. ముస్లింలతో చర్చలు జరిపేందుకు జూనియర్ గ్రంథీతో వెళ్లినప్పటి నుండి కనిపించని నాథును కనుక్కోవడానికి సహాయం చేయాలని హర్నం సింగ్ ఒక ప్రభుత్వ ఉద్యోగిని అభ్యర్థిస్తాడు. నగరంలో ఆసుపత్రి గుడారాలన్నింటిలోనూ ఆరా తీయాలని ఆ ఉద్యోగిని అడుగుతాడు. నేల మీద వరసగా పడి ఉన్న మృతదేహాలను చూస్తూ, వాటిలో నాథు మృతదేహాన్ని గుర్తించి కమ్మో నిలువునా కూలిపోతుంది. నర్సులు ఆమెను ప్రసవానికి గుడారంలోకి తీసుకువెళతారు. గుడారం బయట కూర్చొని ఉన్న హర్నం సింగ్, బాంటోలకు 'అల్లాహు అక్బర్', హర్ హర్ మహాదేవ్' నినాదాలతో పాటు గుడారం లోపల నుంచి అప్పుడే పుట్టిన పసిబిడ్డ ఏడుపులు వినిపిస్తాయి.

– ఎన్.ఆర్.

పాలు కారే ముఖ సౌందర్యం కోసం సహజ చిట్కాలు

● సరైన పద్ధతులలో సరైన సౌందర్య చిట్కాలను వాడటం వలన చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచుకోవచ్చు. సులువుగా ఇంట్లో లభించే పదార్థాల ద్వారా ప్రకాశవంతమైన చర్మాన్ని పొందవచ్చు, వీటి వలన చర్మ రక్షణ సులభం కావడంతోపాటు ఆరోగ్యానికి, చర్మ ఆరోగ్యానికి చాలా మంచిది.

● మీది జిడ్డు చర్మం అయితే అరకప్పు కాచి చల్లార్చిన పాలలో ఒక ఐసుముక్కను వేసి, అది ఆ పాలలో పూర్తిగా కరిగాక పాలలో చిన్న చిన్న దూది ఉండలు వేసి, వాటితో పాలను ముఖానికి పట్టించి, ఆరాక గోరువెచ్చని నీటితో కడిగేయండి. ఫలితంగా చర్మం పైన ఉండే నూనెలు తొలగి, ముఖచర్మం మృదువుగా... తాజాగా మెరుస్తుంటుంది.

● కప్పు పాలలో శుభ్రమైన పలుచటి కాటన్ కర్చీఫ్ లేదా ఏదైనా వస్త్రాన్ని నానబెట్టండి. కాసేపయ్యాక దానిని తీసుకుని కళ్ళు మూసుకొని, ముఖం పైన కప్పుకోండి. 20 నిమిషాల తరువాత గోరువెచ్చటి నీటితో కడిగివేయండి.

● రెండు మూడు బాగా పండిన టమాటాలను ఉడకబెట్టి, చల్లారాక గుజ్జులా చేయండి. ఆ గుజ్జును కాసేపు ఫ్రిజ్‌లో పెట్టి చల్లబరచండి, దీనిని ముఖానికి పట్టించి, ఆరాక శుభ్రంగా కడగటం వలన మంచి ఫలితాలను పొందుతారు.

● చర్మాన్ని ఆరోగ్యంగా త్వరగా ప్రకాశవంతంగా మార్చడానికి ఇంట్లో చాలా రకాల సౌందర్య చిట్కాలు అందుబాటులో ఉన్నాయి. తేనె అందులో మొదటిది. అప్పుడప్పుడు ముఖ చర్మానికి తేనె, పసుపు, చందనం కలిపిన మిశ్రమాన్ని రాస్తుండాలి. వాటిలో ఉండే యాంటీ బ్యాక్టీరియల్ గుణాల కారణంగా చర్మం పైన ఉండే మచ్చలకు, మొటిమలకు మంచి ఔషధంగా పనిచేస్తుంది. అంతేకాకుండా, తేనె చర్మాన్ని మృదువుగా, సున్నితంగా పట్టులా మార్చేస్తుంది.

ముఖంపై ఉండే మచ్చల కోసం...

● ముఖం మీద నల్లటి మచ్చలు ఉన్నాయా? అయితే ఫ్రిజ్ నుంచి తీసిన తాజా దోసకాయ రసంలో కాటన్ బాల్ లేదా చిన్న నూలు బట్ట ముక్కను ముంచి నల్లటి వలయాల పైన 10 నుండి 15 నిమిషాల పాటు ఉంచండి. ఇలా కొన్ని రోజులు చేయటం వలన కొంత కాలం తరువాత మీ చర్మం పైన ఉండే మచ్చలు మాయమైపోతాయి.

పీడియాట్రిక్ కౌన్సెలింగ్

ఫ్యామిలీ డాక్టర్

అమ్మాయి ఒంటిమీద పులిపిర్లు... తగ్గేదెలా?

మా అమ్మాయికి తొమ్మిదేళ్లు. ఆమెకు ముఖం మీదా, ఒంటిపైన అక్కడక్కడా చిన్న చిన్న పులిపిరి కాయల్లాంటివి వస్తున్నాయి. పైగా అవి రోజు రోజుకూ పెరుగుతున్నాయి. ఆమె మేనిపై వాటిని చూస్తే మాకు ఆందోళనగా ఉంది. మా పాప సమస్యకు పరిష్కారం చెప్పండి.

- ఆర్. శైలజ, కర్నూలు

మీరు చెప్పిన వివరాలను బట్టి మీ పాపకు ఉన్న కండిషన్ ములస్కమ్ కంటాజియోజమ్ కావచ్చని అనిపిస్తోంది. ఇది వైరస్ వల్ల వచ్చే ఒక రకం చర్మవ్యాధి. ఇది ముఖ్యంగా రెండు నుంచి 12 ఏళ్ల పిల్లల్లో చాలా ఎక్కువగా చూస్తుంటాం.

వ్యాప్తి జరిగే తీరు... చర్మానికి చర్మం తగలడం వల్ల, వ్యాధి ఉన్నవారి తువ్వాళ్లను మరొకరు ఉపయోగించడం వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుంది. వాళ్ల నుంచి వాళ్లకే వ్యాపించడం కూడా చాలా సాధారణం. దీన్నే సెల్ఫ్ ఇనాక్యులేషన్ అంటారు. అలర్జిక్ డర్మటైటిస్ ఉన్న పిల్లల్లోనూ, వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్న చిన్నారుల్లోనూ ఈ స్కిన్ ఇన్ఫెక్షన్ వచ్చే అవకాశాలు ఎక్కువ. ఈ లీజన్స్ (పులిపిరులాంటివి) తేమ ఎక్కువగా ఉండే శరీరంలో భాగాల్లో అంటే... బాహు మూలాలు, పొత్తికడుపు కింద (గ్రోయిన్), మెడ వంటి చర్మం మడత పడే ప్రదేశాల్లో ఎక్కువగా కనిపిస్తుండవచ్చు.

చికిత్స : ఇవి తగ్గడానికి కొంతకాలం వేచిచూడండి. అప్పటికీ తగ్గకపోతే అప్పుడు క్రయోథెరపీ, క్యూరటాజ్ వంటి ప్రక్రియలతో వీటికి చికిత్స చేయవచ్చు. ఇక దీనితో పాటు కొన్ని ఇమ్యునలాజికల్ మెడిసిన్స్.... అంటే ఉదాహరణకు ఇమిక్యుమాడ్ అనే క్రీమ్‌ను లీజన్స్ ఉన్న ప్రాంతంలో కొన్ని నెలల పాటు పూయడం వల్ల చాలా ఉపయోగం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో పైన పేర్కొన్న ఇతర ప్రక్రియల (ఉదా: క్రయోథెరపీ వంటివి)తో పాటు ఇమిక్యుమాడ్ కలిపి ఉపయోగించడం వల్ల మంచి ప్రయోజనం ఉంటుంది. మీరు ఒకసారి మీ చర్మవ్యాధి నిపుణులను సంప్రదించి, చికిత్సను కొనసాగించండి.

పాపకు ఒంటిపై తరచూ దద్దుర్లు...!

మా పాపకు ఆరేళ్లు. ఇటీవల మూడు నాలుగు సార్లు ఒంటి మీద దద్దుర్లలా వచ్చాయి. ఒక రోజు ఉండి మళ్లీ తగ్గుతున్నాయి. ఈ సమస్యకు మందులు కూడా వాడాం. అయితే తగ్గినట్లే తగ్గి మళ్లీ మళ్లీ వస్తున్నాయి. పాప చాలా ఇబ్బంది పడుతోంది. ఇలా జరగడానికి కారణం ఏమిటి? మాకు తగిన సలహా ఇవ్వండి.

- కనకరత్నం, నెల్లూరు

మీ పాపకు ఉన్న సమస్యను అర్టికేరియా అంటారు. ఈ సమస్యలో చర్మం పైభాగం (సూపర్‌ఫీషియల్ డర్మిస్) ఎర్రబడి కాస్త ఉబ్బినట్లుగా కనిపిస్తుంది. ఇది శరీరంలోని ఏ భాగంలోనైనా రావచ్చు. ఇది చిన్న ఎర్రటి మచ్చలా మొదలై శరీరమంతటా అనేక చోట్ల కనిపించవచ్చు. ఇది అతి సాధారణ సమస్య. అర్టికేరియాలో అక్యూట్ అని, క్రానిక్ అని రెండు రకాలు ఉంటాయి. మీరు చెబుతున్న లక్షణాలను బట్టి మీ పాపకు అక్యూట్ అర్టికేరియా అని చెప్పవచ్చు.

అర్టికేరియాకు కారణాలు అనేకం ఉన్నాయి. అందులో ముఖ్యంగా ఆహారం వల్ల (అంటే... గుడ్డు, గోధుమ, వేరుసెనగపప్పులు, సముద్రపు చేపలు, కొందరిలో స్ట్రాబెర్రీస్); మందులు, ఏదైనా పురుగు కుట్టడం (అంటే... తేనెటీగలు లేదా చీమల వంటివి); ఇన్ఫెక్షన్లు (అంటే బ్యాక్టీరియల్ లేదా వైరల్); కాంటాక్ట్ అలర్జీలు (అంటే లేటెక్స్/రబ్బరు, పుప్పొడి వంటివి); గొంగళిపురుగులు, కొన్ని జంతువుల లాలాజలం తగలడం వల్ల; రక్తం, రక్తానికి సంబంధించిన ఉత్పాదనల వల్ల... మీరు చెబుతున్న అక్యూట్ అర్టికేరియా రావచ్చు. ఇక దీర్ఘకాలికంగా కనిపించే క్రానిక్ అర్టికేరియాలో 80 శాతం కేసుల్లో కారణం ఇదీ అని చెప్పడం కష్టం. కాకపోతే కొన్నిసార్లు చాలా వేడి, చల్లటి, ఒత్తిడితో కూడిన, కంపనాలతో ఉండే పరిసరాల వల్ల, థైరాయిడ్, రక్తానికి సంబంధించిన రుగ్మతల వల్ల కూడా దీర్ఘకాలిక (క్రానిక్) అర్టికేరియా వచ్చేందుకు అవకాశాలు ఉంటాయి.

అక్యూట్ అర్టికేరియాకు నట్స్‌తో కూడిన ఆహారం, ఆహారంలో వేసే కృత్రిమ రంగులు, పుప్పొడి, ఏదైనా పురుగు కుట్టడం, కడుపులో నులిపురుగులు, సింథటిక్ దుస్తులు, సీఫుడ్ వంటి వాటిని సాధారణ కారణాలుగా గుర్తించారు. కాబట్టి మీ పాప విషయంలో చికిత్సలో భాగంగా మొదట పైన పేర్కొన్న అంశాలలో మీ పాప అర్టికేరియాకు ఏది కారణం కావచ్చో దాన్ని గుర్తించి, దాని నుంచి కొన్నాళ్లు మీ పాపను దూరంగా ఉంచడం చాలా ముఖ్యం. ఇక మందుల విషయానికి వస్తే యాంటీహిస్టమైన్స్, హెచ్2 బ్లాకర్స్ వల్ల చాలా ప్రయోజనం ఉంటుంది. ఇక లక్షణాలు తీవ్రంగా కనిపించే వారిలో ఇమ్యూనో మాడ్యులేషన్ మెడిసిన్స్ కూడా వాడవచ్చు. మీ పాప విషయంలో పైన పేర్కొన్న జాగ్రత్తలు తీసుకుంటూ యాంటీహిస్టమైన్స్‌లో హైడ్రాక్సిజీన్, సిట్రజీన్ వంటి మందులు తప్పనిసరిగా వాడాల్సి ఉంటుంది. ఈ సమస్య పదే పదే తిరగబెడుతూ, తీవ్రంగా కనిపిస్తుంటే కొన్ని ఇమ్యూనలాజికల్ పరీక్షలు కూడా చేయించాల్సి ఉంటుంది. కాబట్టి తీవ్రతను బట్టి మీరు ఒకసారి మీ చర్మవ్యాధి నిపుణుణ్ణి లేదా మీ పీడియాట్రీషియన్‌తో చర్చించి, తగిన చికిత్స తీసుకోండి.

బాబుకు తరచూ జలుబు... సలహా ఇవ్వండి

మా బాబుకు తొమ్మిదేళ్లు. తరచూ జలుబు చేస్తుంటుంది. చల్లటి పదార్థాలు, పానీయాలు ఇష్టంగా తాగుతాడు. వద్దన్నా మానడు. ఒక్కోసారి ఊపిరి సరిగ్గా ఆడటం లేదని అంటుంటాడు. డాక్టర్‌ను సంప్రదించాం. మందులు ఇచ్చారు. వాటి ప్రభావం సరిగ్గా లేదు. బాబు ఆరోగ్య విషయంలో ఎటువంటి సలహాలు పాటించాలో తెలియజేయండి.

- ఎమ్.డి. అన్వర్‌బాషా, గుంటూరు

మీ బాబుకు ఉన్న కండిషన్‌ను అలర్జిక్ రైనైటిస్ అంటారు. అందులోనూ మీ బాబుకు ఉన్నది సీజనల్ అలర్జిక్ రైనైటిస్‌గా చెప్పవచ్చు. పిల్లల్లో సీజనల్ అలర్జిక్ రైనైటిస్ లక్షణాలు ఆరేళ్ల వయసు తర్వాత ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఈ సమస్య ఉన్న పిల్లల్లో జలుబు, ముక్కు దురద, కళ్ల నుంచి నీరు కారడం, ముక్కు దిబ్బడ, ఊపిరి తీసుకోవడంలో కష్టం వంటి లక్షణాలు చూస్తుంటాం. ఈ సమస్య చాలా సాధారణం. దీనికి నిర్దిష్టమైన కారణం చెప్పలేకపోయినప్పటికీ వంశపారంపర్యంగా కనిపించడంతో పాటు వాతావరణ, పర్యావరణ మార్పులు కూడా ఇందుకు దోహదం చేస్తాయి. పూల మొక్కలు, దుమ్ము, ధూళి, పుప్పొడి, రంగులు, డిటర్జెంట్స్ వంటివి శరీరానికి సరిపడకపోవడంతో వంటివి ఈ సమస్యకు ముఖ్య కారణాలు.

మీ బాబుకు యాంటీహిస్టమైన్స్, ఇమ్యునోమాడ్యులేటర్స్, ఇంట్రానేసల్ స్టెరాయిడ్ స్ప్రేస్ వాడటం వల్ల చాలా వరకు ప్రయోజనం ఉంటుంది. మీ అబ్బాయి విషయంలో ఎలాంటి ఆందోళనా అవసరం లేదు. చల

సాక్షి భవిత
మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com
స్పర్ధయా వర్ధతే విద్య
బుధవారం
21-8-2019

జాబ్ ట్రెండ్స్

హాట్ టెక్ జాబ్స్

ఐఐటీల నుంచి స్థానిక ఇంజనీరింగ్ కాలేజీల వరకూ.. బీఎస్సీ నుంచి ఎంబీఏ దాకా.. ఎలాంటి కాలేజీలో చేరినా.. ఏ కోర్సు చదివిన విద్యార్థి అయినా.. ముందుగా దృష్టిపెట్టేది సాఫ్ట్‌వేర్ కొలువులపైనే! అందుకోసం కోర్సులో చేరినప్పటి నుంచే అదనపు ఐటీ కోర్సులు, వివిధ సాఫ్ట్‌వేర్ సర్టిఫికేషన్స్ పూర్తిచేస్తున్నవైనం. అయినా ఐటీ కంపెనీలకు నిపుణుల కొరత వెంటాడుతోంది!! సాఫ్ట్‌వేర్ కంపెనీలు కాగడా పెట్టి వెతికినా... 5 రకాల ఐటీ ఉద్యోగాలకు సరైన అభ్యర్థులు దొరకడం కనాకష్టంగా మారిందని ఓ తాజా సర్వే వెల్లడించింది. నిపుణులు దొరకడం గగనంగా మారిన ఆ ఐదు టెక్ జాబ్స్ ఏమిటి?! స్కిల్ గ్యాప్ సమస్య.. ఎలాంటి నైపుణ్యాలు అందిపుచ్చుకుంటే సాఫ్ట్‌వేర్ కొలువు సొంతమవుతుందో తెలుసుకుందాం..

- ఆ ఐదు ఐటీ కొలువులకు అభ్యర్థులు దొరకని వైనం
- అంతర్జాతీయంగా సాఫ్ట్‌వేర్ సంస్థల్లో ఇదే పరిస్థితి
- ప్రధాన సమస్య స్కిల్ గ్యాప్ అంటున్న సర్వేలు

సాఫ్ట్‌వేర్ ఉద్యోగం.. యువతకు ఓ స్వప్నం. ఏదో ఒక ఐటీ సంస్థలో.. ఒక్కసారి కాలుమోపితే చాలు.. కెరీర్‌లో వెనుదిరిగి చూసుకోనక్కర్లేదనే భావన! అందుకోసం ఎన్నో ప్రయత్నాలు!! మరోవైపు ఐటీ కంపెనీల్లో పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. సరైన నైపుణ్యాలున్న అభ్యర్థులు దొరక్క పలు టెక్ జాబ్స్‌ను భర్తీ చేయలేకపోతున్నామని వాపోతున్నాయి సాఫ్ట్‌వేర్ సంస్థలు.

ఇవే ఆ ఐదు

ఇటీవల ఇండీడ్ సంస్థ నిర్వహించిన సర్వే ప్రకారం-ఐటీ రంగంలో కీలకంగా నిలుస్తున్న ఐదు ఉద్యోగాలు.. » డెవలప్‌మెంట్ ఆపరేషన్స్ మేనేజర్, » డేటాబేస్ స్పెషలిస్ట్, » సీనియర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఆఫీసర్, » సిస్టమ్ ప్రోగ్రామర్, » వెబ్ అడ్మినిస్ట్రేటర్ పోస్టుల్లో నియామకాలకు నిపుణులు దొరకడంలేదు. సరైన నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించక దేశంలో డెవలప్‌మెంట్ ఆపరేషన్స్ మేనేజర్ పోస్టులు 63 శాతం, డేటాబేస్ స్పెషలిస్ట్ 62 శాతం, సీనియర్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజర్ 61 శాతం, సిస్టమ్ ప్రోగ్రామర్ 59 శాతం, వెబ్ అడ్మినిస్ట్రేటర్ ఉద్యోగాలు 58 శాతం మేర భర్తీ చేయడం క్లిష్టంగా మారిందని సర్వే వెల్లడించింది.

31 శాతం పెరిగిన టెక్ జాబ్స్

దేశంలో ఉద్యోగార్థులకు టెక్ జాబ్స్ హాట్ కేక్‌లు. చదువు పూర్తిచేసుకుంటున్న అత్యధికశాతం మంది అభ్యర్థుల లక్ష్యం సాఫ్ట్‌వేర్ కొలువులే! ఈ టెక్ జాబ్ రోల్స్ గత ఏడాది ఫిబ్రవరి నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి మధ్య కాలంలో 31 శాతం పెరిగాయి. వీటి కోసం అన్వేషించే అభ్యర్థుల సంఖ్య కూడా ఈ వ్యవధిలో ఎనిమిది శాతం పెరిగింది. మరోవైపు భారత్‌లోని 53 శాతం టెక్ కంపెనీలు సరైన నైపుణ్యాలున్న అభ్యర్థులు దొరక్క ఇబ్బంది పడుతున్నట్లు ఇటీవల అంతర్జాతీయ కార్మిక సంస్థ(ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) నివేదిక సైతం పేర్కొంది. అంటే.. ఉద్యోగాలు కోరుకునే అభ్యర్థులు ఉన్నారు.. ఉద్యోగాలు ఇవ్వాలనుకునే కంపెనీలు ఉన్నాయి. అయినా టెక్ జాబ్స్ భర్తీ కావడం క్లిష్టంగా మారింది.

మరి సమస్య ఎక్కడ

టెక్నికల్ ఉద్యోగాల పరంగా స్కిల్‌గ్యాప్ ప్రధాన సమస్య. ఇటీవల ఈ సమస్య మరింత ఎక్కువైనట్లు చెబుతున్నారు. మన దేశంలో ఐటీ సంస్థలకు కేరాఫ్‌గా నిలిచే ప్రధాన నగరాల్లో(బెంగళూరు, పుణె, హైదరాబాద్)ని సంస్థలకు సరైన టాలెంట్ దొరకడం కష్టంగా మారిందని ప్రముఖ జాబ్ కన్సల్టెన్సీ ఇండీడ్ కూడా పేర్కొంది. ఈ సంస్థ నివేదిక ప్రకారం-దేశంలోని మొత్తం ఐటీ నియామకాలను చూస్తే.. బెంగళూరులో 25శాతం; పుణెలో 9శాతం; హైదరాబాద్‌లో 8 శాతంతో అగ్రస్థానంలో ఉన్నాయి. మొత్తం ఐటీ నియామకాల్లో ఈ మూడు నగరాల్లోనే 42 శాతం జరుగుతున్నాయి. ఇలాంటి చోట్ల కూడా స్కిల్‌గ్యాప్ సమస్య కారణంగా ఆయా టెక్నాలజీ ఉద్యోగాలకు సరిపడే నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించడం కష్టంగా ఉంది. దాంతో స్కిల్‌గ్యాప్ సమస్యకు అప్‌స్కిల్లింగ్ ఒక్కటే పరిష్కారం అంటున్నాయి ఇండస్ట్రీ వర్గాలు. కాబట్టి ఐటీ ఉద్యోగ ఔత్సాహికులు తమ సాఫ్ట్‌వేర్ కొలువు స్వప్నం నిజం చేసుకోవడానికి నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచిస్తున్నారు. సాఫ్ట్‌వేర్ రంగంలోని 50 శాతం పైగా టెక్ ఉద్యోగాలకు జావా ప్రోగ్రామింగ్ స్కిల్ తప్పనిసరిగా మారింది.

అప్లికేషన్స్‌పై ప్రత్యేక దృష్టి

ప్రస్తుత పరిస్థితుల్లో ఐటీ ఉద్యోగ ఔత్సాహికులు సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌పై ప్రత్యేక దృష్టిపెట్టాలి. అప్లికేషన్ లైఫ్‌సైకిల్ మేనేజ్‌మెంట్ సాఫ్ట్‌వేర్, కోడింగ్, టెస్టింగ్, ఆపరేషన్స్ వంటి అంశాల్లో శిక్షణ పొందాలి. ప్రస్తుతం ఐటీ సంస్థలు తమ క్లయింట్లకు అందిస్తున్న సర్వీసులను పరిగణనలోకి తీసుకుంటే.. క్లౌడ్ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్స్‌పైనా పట్టు సాధించాల్సిన అవసరముంది. ఆయా నైపుణ్యాలు సాధించడం వల్ల డెవలప్‌మెంట్ అండ్ ఆపరేషన్స్ విభాగంలో మంచి హోదాలు సొంతం చేసుకోవచ్చు.

డేటా నిర్వహణ

ప్రస్తుత పరిస్థితుల్లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు అవసరమవుతున్న మరో కీలక నైపుణ్యం.. డేటాబేస్ మేనేజ్‌మెంట్. విస్తృతంగా ఉండే డేటాను సరైన రీతిలో సమకూర్చడం, బ్యాక్ అప్ మేనేజ్‌మెంట్ వంటివి సంస్థలకు కీలకం. కాబట్టి ఎస్‌క్యూఎల్, కంప్యూటర్ డిజైన్, ప్రోగ్రామింగ్, హార్డ్‌వేర్ నెట్‌వర్కింగ్, డేటా స్టోరేజ్‌కు సంబంధించి ప్రత్యేక శిక్షణ తీసుకోవాలి. ఫలితంగా ఆపరేటింగ్ సిస్టమ్స్, డేటాబేస్ అడ్మినిస్ట్రేషన్, నెట్‌వర్క్ ఫండమెంటల్స్, డేటాబేస్ రికవరీ వంటి అంశాల్లోనూ నైపుణ్యం లభిస్తుంది. దాంతో డేటాబేస్ మేనేజర్ హోదాను సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది.

ప్రోగ్రామింగ్ స్కిల్స్

సాఫ్ట్‌వేర్ సంస్థల్లో అత్యంత ప్రధానమైనది.. ప్రోగ్రామింగ్. సాఫ్ట్‌వేర్ లాంగ్వేజెస్‌ను నేర్చుకోవడం.. సొంతంగా కోడింగ్, ప్రోగ్రామింగ్ రాసే నైపుణ్యాలు సాధించడం వల్ల ప్రోగ్రామర్ ఉద్యోగం సొంతం చేసుకోవచ్చు. వాస్తవానికి ప్రోగ్రామింగ్ అనేది సీఎస్ఈ,ఐటీ విద్యార్థులకు అకడమిక్స్‌లో భాగంగా ఉంటుంది. విద్యార్థులకు రియల్ టైమ్ నైపుణ్యాలు పొందే అవకాశం కాలేజీల్లో లభించట్లేదు. ఇలాంటి అభ్యర్థులు ప్రత్యేక శిక్షణ తీసుకోవడం లాభిస్తుంది.

వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేషన్

ప్రస్తుతం ఐటీ సంస్థల్లో వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ప్రాధాన్యం సంతరించుకుంటోంది. వెబ్ డెవలప్‌మెంట్, కంప్యూటర్ ఆర్కిటెక్చర్, నెట్‌వర్క్ డిజైన్, వెబ్ అనలిటిక్స్, డేటాబేస్ ఆర్కిటెక్చర్ వంటి అంశాల్లో శిక్షణ తీసుకుంటే వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్‌గా కొలువుదీరొచ్చు.

ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ

ఇటీవల కాలంలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మేనేజర్స్/ఆఫీసర్స్ సేవలు కూడా కీలకంగా మారుతున్నాయి. వీటికి సంబంధించి సరైన నైపుణ్యాలున్న అభ్యర్థులు లభించడం సంస్థలకు కష్టంగా మారింది. సంస్థల్లో అంతర్గతంగా కంప్యూటర్ అనుసంధాన కార్యకలాపాలకు సంబంధించి ప్రణాళికలు రూపొందించడం, ఆయా విభాగాల మధ్య అనుసంధాన ప్రక్రియ నిర్వహించడం వీరి విధులు. సంస్థలకు సంబంధించి సాంకేతిక వ్యూహాలు రూపొందించడం కూడా మరో కీలకమైన బాధ్యతగా నిలుస్తోంది.

ఐటీ కెరీర్.. ముఖ్యాంశాలు

- 2014 ఫిబ్రవరి నుంచి 2019 ఫిబ్రవరి మధ్య కాలంలో 8శాతం పెరిగిన టెక్నాలజీ జాబ్ రోల్స్
- గత ఏడాదిలోనే 31 శాతం పెరుగుదల
- మన దేశంలోని సంస్థల్లో 50 శాతంపైగా సంస్థలు జావా ప్రోగ్రామింగ్ స్కిల్స్‌కు ప్రాధాన్యం

ఎప్పటికప్పుడు కొత్త టెక్నాలజీలపై పట్టు సాధించడం ద్వారా ఇలాంటి కొలువులు సొంతం చేసుకునే అవకాశముంది. ఈ ఉద్యోగాలకు టెక్నికల్ నైపుణ్యాలే కాకుండా.. కోఆర్డినేషన్ స్కిల్స్, ప్రాబ్లమ్ సాల్వింగ్, అనలైజింగ్ నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్, ఆర్గనైజింగ్ స్కిల్స్ కూడా ఎంతో అవసరం.

జాబ్ రెడీ స్కిల్స్

ఐటీ రంగంలో 'స్కిల్ గ్యాప్' అనేది రోజూ వినిపించేదే! కాబట్టి విద్యార్థులు నైపుణ్యాలు పెంచుకోవడంపై ప్రత్యేకంగా దృష్టిపెట్టాలి. అకడమిక్స్‌లోని అంశాలకే పరిమితం కాకుండా.. సర్టిఫికేషన్ కోర్సులను పూర్తిచేయాలి. ఉద్యోగ నైపుణ్యాలు పెంపొందించుకుంటే.. కొలువు సొంతం చేసుకోవడం పెద్ద కష్టం కాదు.

– రమేశ్ లోగనాథన్,
సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు

మారుతున్న ప్రొఫైల్స్

ప్రస్తుత పరిస్థితుల్లో జాబ్ ప్రొఫైల్స్ నిరంతరం మారుతున్నాయి. దాంతో వాటికి సరితూగే టాలెంట్‌ను గుర్తించడం కంపెనీలకు పెద్ద సమస్యగా మారింది. కాబట్టి విద్యార్థులు నిరంతరం స్కిల్స్ పెంచుకునేందుకు కృషి చేయాలి. కంపెనీలు కూడా తమ ఉద్యోగులకు అవసరమైన స్కిల్స్ అందించేలా చర్యలు తీసుకుంటే బాగుంటుంది.

– శశికుమార్, ఎండీ, ఇండీడ్ ఇండియా

నైపుణ్య మార్గాలు

టెక్ నైపుణ్యాలు పొందేందుకు ఇప్పుడు అందుబాటులో ఉన్న మార్గాలు అనేకం. పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థలు(ఐబీఎం, సిస్కో, ఇంటెల్, మైక్రోసాఫ్ట్, ఒరాకిల్ వంటివి) అందిస్తున్న షార్ట్ టర్మ్ సర్టిఫికేషన్ కోర్సులను పూర్తి చేయడం ఉపయుక్తం. అలాగే మూక్స్, ఎన్‌పీటీఈఎల్ ద్వారా ఆన్‌లైన్‌లోనూ కోర్సులు అభ్యసించే వీలుంది. వీటిని సద్వినియోగం చేసుకుంటే స్కిల్ గ్యాప్ అనే సమస్యకు పరిష్కారం లభిస్తుంది. తద్వారా జాబ్ రెడీగా రూపొందేందుకు మార్గం సుగమం అవుతుంది.

జాబ్ పాయింట్

మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్

ఖాళీలు 1980

ముంబైలోని మజగావ్ డాక్ షిప్ బిల్డర్స్ లిమిటెడ్.. ఫిక్స్‌డ్ టర్మ్ ఒప్పంద ప్రాతిపదికన 1980 నాన్-ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **ఒప్పంద కాల వ్యవధి:** రెండేళ్లు.
- **పోస్టులు:** స్కిల్డ్, సెమీ స్కిల్డ్ పర్సనల్.
- **విభాగాలు:** ఏసీ రిఫ్రిజిరేటర్ మెకానిక్, కంప్రెషర్ అటెండెంట్, కార్పెంటర్, డీజిల్ క్రేన్ ఆపరేటర్, ఎలక్ట్రిక్ క్రేన్ ఆపరేటర్, ఫిట్టర్, మెషినిస్ట్, ఫైర్ ఫైటర్ తదితర విభాగాలున్నాయి.
- **అర్హత:** పోస్టులను బట్టి ఎనిమిదో తరగతి, పదో తరగతి, అప్రెంటిస్ సర్టిఫికెట్, డిప్లొమాతో పాటు అనుభవం ఉండాలి.
- **వయసు:** 2019, ఆగస్టు 1 నాటికి 18-38 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** రాత పరీక్ష, ట్రేడ్‌టెస్ట్, అనుభవం ఉండాలి.
- **పరీక్ష తేదీ:** సెప్టెంబర్ 23, 2019.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 5, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://mazagondock.in

కేఎన్ఆర్‌యూహెచ్ఎస్

ఖాళీలు 19

తెలంగాణ రాష్ట్రానికి చెందిన వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ (కేఎన్ఆర్‌యూహెచ్ఎస్).. ఖాళీగా ఉన్న 19 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** జూనియర్ అసిస్టెంట్-15, జూనియర్ స్టెనోగ్రాఫర్-4.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత. టైపింగ్ వచ్చి ఉండాలి.
- **వయసు:** 2019, జులై 1 నాటికి 18-34 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు అయిదేళ్లు, పీహెచ్‌సీలకు పదేళ్లు గరిష్ట వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.800 (ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.500).
- **దరఖాస్తు ఫీజుకు చివరితేదీ:** సెప్టెంబర్ 7, 2019.
- **ఎంపిక:** రాత పరీక్ష, ప్రొఫిషియన్సీ టెస్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 9, 2019.
- **పరీక్ష తేదీ:** అక్టోబర్ 20, 2019.
- **వెబ్‌సైట్:** www.knruhsrt.in

హెచ్‌పీసీఎల్

ఖాళీలు 164

ముంబైలోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్)..వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న 164 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** ప్రాజెక్ట్ ఇంజనీర్-116 (మెకానికల్-63, సివిల్-18, ఎలక్ట్రికల్-25, ఇన్‌స్ట్రుమెంటేషన్-10), రిఫైనరీ ఇంజనీర్ (కెమికల్)-10, లా ఆఫీసర్-4, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్-20, హ్యూమన్ రీసోర్స్ ఆఫీసర్-8, ఫైర్ అండ్ సేఫ్టీ ఆఫీసర్-6.
- **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంజనీరింగ్ డిగ్రీ, లా, పీజీ ఉత్తీర్ణతతో పాటు నిర్దిష్ట అనుభవం ఉండాలి.
- **వయసు:** పోస్టులను బట్టి 28-30 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఎంపిక:** పోస్టులను బట్టి ఉంటుంది. రాత పరీక్ష, ఇంటర్వ్యూ, గ్రూప్ టాస్క్, మూట్ కోర్ట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.590 (ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూడీలకు ఫీజు లేదు).
- **దరఖాస్తుకు చివరితేదీ:**సెప్టెంబర్ 16, 2019
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.hindustanpetroleum.com

ఏపీఎస్‌బీసీఎల్

ఖాళీలు 12363

ఆంధ్రప్రదేశ్ స్టేట్ బేవరేజస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీఎస్‌బీసీఎల్).. ఒప్పంద/అవుట్ సోర్స్ ప్రాతిపదికన రాష్ట్రవ్యాప్తంగా 12,363 సేల్స్ సూపర్‌వైజర్, సేల్స్‌మెన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- **విభాగాల వారీ ఖాళీలు:** సేల్స్ సూపర్‌వైజర్-3585, సేల్స్‌మెన్-8778.
- **జిల్లాల వారీ ఖాళీలు:**

జిల్లా	సేల్స్ సూపర్‌వైజర్	సేల్స్‌మెన్
1. అనంతపురం	198	495
2. చిత్తూరు	344	860
3. తూర్పుగోదావరి	432	1080
4. గుంటూరు	282	705
5. కృష్ణా	277	690
6. కర్నూలు	164	410
7. ప్రకాశం	264	660
8. నెల్లూరు	280	700
9. శ్రీకాకుళం	191	413
10. విశాఖపట్నం	401	1000
11. విజయనగరం	168	420
12. పశ్చిమ గోదావరి	379	835
13. వైఎస్ఆర్ కడప	205	510

- **అర్హత:** సేల్స్‌మెన్ పోస్టులకు ఇంటర్మీడియట్, సేల్స్ సూపర్‌వైజర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ (బీకాం గ్రాడ్యుయేట్లకు ప్రాధాన్యత ఉంటుంది) ఉత్తీర్ణులై ఉండాలి. కనీస కంప్యూటర్ పరిజ్ఞానం తప్పనిసరి.
- **వయసు:** 2019, ఆగస్టు 1 నాటికి 21-40 ఏళ్ల మధ్య ఉండాలి. (21 ఏళ్లు నిండి ఉండాలి, 40 ఏళ్లకు మించకూడదు).
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** ఆగస్టు 25, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://apsbcl.aponline.gov.in

సీఐటీడీలో ప్రవేశాలు

హైదరాబాద్ (బాలానగర్)లోని భారత సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ (సీఐటీడీ) 2019-20కి గాను వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

1. **పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ అండ్ క్యాడ్/క్యామ్ (పీజీడీటీడీ అండ్ సీసీ)**
   - **సీట్లు:** 60
   - **కోర్సు వ్యవధి:** ఏడాదిన్నర(మూడు సెమిస్టర్లు).
   - **అర్హత:** మెకానికల్/ప్రొడక్షన్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
   - **వయసు:** 45 ఏళ్లు మించకూడదు.
2. **పోస్ట్ డిప్లొమా ఇన్ టూల్ డిజైన్ (పీడీటీడీ)**
   - **సీట్లు:** 60
   - **కోర్సు కాలవ్యవధి:** ఏడాది (రెండు సెమిస్టర్లు).
   - **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా ఉత్తీర్ణత.
   - **వయసు:** 27 ఏళ్లు మించకూడదు.
   - **ఎంపిక:** రాత పరీక్ష ఆధారంగా ఎంపిక చేస్తారు.
   - **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ (పోస్టు ద్వారా) విధానంలో దరఖాస్తు చేసుకోవాలి.
   - **దరఖాస్తు ఫీజు:** పీజీ డిప్లొమా కోర్సుకు రూ.800 (ఎస్సీ, ఎస్టీలకు రూ.400); పోస్ట్ డిప్లొమా కోర్సుకు రూ.700 (ఎస్సీ, ఎస్టీలకు రూ.350). పీడబ్ల్యూలకు ఉచితం.
   - **హార్డుకాపీ పంపడానికి చివరితేదీ:** సెప్టెంబర్ 7, 2019.
   - **రాత పరీక్షతేదీ:** సెప్టెంబర్ 14, 2019.
   - **వెబ్‌సైట్:** www.citdindia.org

Central Institute of Tool Design

నోట్స్

ఓయూలో ప్రవేశాలు

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ (ఓయూ)కి చెందిన ప్రొఫెసర్ జి.రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌సీడీఈ).. 2019-20కి గాను పీజీ డిప్లొమా ఇన్ బయో ఇన్ఫర్మాటిక్స్‌లో ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతోంది.

- **కోర్సు వ్యవధి:** ఏడాది.
- **అర్హత:** సంబంధిత విభాగాల్లో బీఎస్సీ, బీ-ఫార్మసీ, ఎంబీబీఎస్, బీడీఎస్, బీఈ/బీటెక్, ఎంఎస్సీ, ఎంటెక్, ఎంసీఏ, పీహెచ్‌డీ ఉత్తీర్ణత.
- **ఎంపిక:** అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 30, 2019.
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** www.oucde.net

epaper.sakshi.com

సాక్షి స్పోర్ట్స్
బుధవారం
21-8-2019

ప్రణయ్ ప్రతాపం

సాయిప్రణీత్

లిన్ డాన్

అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో అన్ని గొప్ప టోర్నమెంట్‌లలో టైటిల్స్ సాధించి దిగ్గజ క్రీడాకారుడి హోదా పొందిన చైనా సూపర్ స్టార్ ప్లేయర్ లిన్ డాన్‌కు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో ఊహించని పరాజయం ఎదురైంది. గతంలో ఐదుసార్లు విశ్వవిజేతగా నిలిచి, రెండుసార్లు ఒలింపిక్స్ స్వర్ణ పతకాలు సాధించి ఎందరో బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ఆరాధ్యుడిగా మారిన లిన్ డాన్‌కు భారత అగ్రశ్రేణి ఆటగాడు హెచ్‌ఎస్ ప్రణయ్ షాక్ ఇచ్చాడు. హోరాహోరీ పోరులో లిన్ డాన్‌ను ఓడించిన ప్రణయ్ ఈ క్రమంలో మూడుసార్లు చైనా స్టార్‌ను ఓడించిన తొలి భారతీయ ప్లేయర్‌గా రికార్డు సృష్టించాడు. అయితే ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రణయ్‌కు డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ కెంటో మొమోటా (జపాన్) రూపంలో అగ్ని పరీక్ష ఎదురుకానుంది.

- బ్యాడ్మింటన్ దిగ్గజం లిన్ డాన్‌పై సంచలన విజయం
- మూడుసార్లు చైనా స్టార్‌ను ఓడించిన తొలి భారతీయ ప్లేయర్‌గా ఘనత
- ప్రిక్వార్టర్ ఫైనల్లోకి సాయిప్రణీత్
- ప్రపంచ చాంపియన్‌షిప్

బాసెల్ (స్విట్జర్లాండ్): కొన్నేళ్లుగా అంతర్జాతీయస్థాయిలో నిలకడగా విజయాలు సాధిస్తున్నా... జాతీయ క్రీడా పురస్కారాల్లో హెచ్‌ఎస్ ప్రణయ్‌కు ఈసారీ మొండిచేయి లభించడంతో ఆ కసినంతా అతను ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో తన ప్రదర్శనలో చూపిస్తున్నాడు. తొలి రౌండ్‌లో తనకంటే తక్కువ ర్యాంక్ ఉన్న ప్లేయర్‌ను ఓడించడానికి ఇబ్బంది పడ్డ ఈ కేరళ ఆటగాడు... రెండో రౌండ్‌లో మాత్రం జూలు విదిల్చాడు. ఐదుసార్లు ప్రపంచ చాంపియన్, రెండుసార్లు ఒలింపిక్ స్వర్ణ పతక విజేత లిన్ డాన్ (చైనా)తో జరిగిన పురుషుల సింగిల్స్ రెండో రౌండ్‌లో ప్రణయ్ 21-11, 13-21, 21-7తో గెలుపొంది సంచలనం సృష్టించాడు. ప్రపంచ 17వ ర్యాంకర్ లిన్ డాన్‌తో ఇప్పటివరకు ఐదుసార్లు తలపడ్డ ప్రణయ్ ముఖాముఖి రికార్డులో 3-2తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ మ్యాచ్‌కంటే ముందు 2015 ఫ్రెంచ్ ఓపెన్‌లో, 2018 ఇండోనేసియా ఓపెన్‌లో లిన్ డాన్‌పై ప్రణయ్ గెలిచాడు. తద్వారా లిన్ డాన్‌ను మూడుసార్లు ఓడించిన తొలి భారతీయ ప్లేయర్‌గా ప్రణయ్ రికార్డు నెలకొల్పాడు. గతంలో లిన్ డాన్‌పై పుల్లెల గోపీచంద్ రెండుసార్లు... ప్రస్తుత భారత నంబర్‌వన్ కిడాంబి శ్రీకాంత్ ఒకసారి గెలిచారు. 62 నిమిషాలపాటు జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో ప్రణయ్ ఆద్యంతం దూకుడుగా ఆడాడు. లిన్ డాన్ స్థాయిని పట్టించుకోకుండా సహజశైలిలో ఆడిన ప్రణయ్ తొలి గేమ్‌లో 10-5, 19-11తో ఆధిక్యంలోకి వెళ్లి అదే జోరులో గేమ్‌ను గెలిచాడు. రెండో గేమ్‌లో తడబడ్డ ప్రణయ్... నిర్ణాయక మూడో గేమ్‌లో రెచ్చిపోయాడు. స్కోరు 6-5తో ఉన్నదశలో ప్రపంచ 30వ ర్యాంకర్ ప్రణయ్ ఒక్కసారిగా విజృంభించి వరుసగా ఎనిమిది పాయింట్లు గెలిచి 14-5తో ముందంజ వేశాడు. ఆ తర్వాత చైనా ప్లేయర్‌కు రెండు పాయింట్లు కోల్పోయిన ప్రణయ్ మరో ఏడు పాయింట్లు సాధించి విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. మరో రెండో రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్లేయర్ సాయిప్రణీత్ 21-16, 21-15తో లీ డాంగ్ కెయున్ (దక్షిణ కొరియా)పై గెలిచి ప్రిక్వార్టర్ ఫైనల్‌కు చేరుకున్నాడు. టోర్నీ తొలి రోజు సోమవారం ఆలస్యంగా జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో పదో సీడ్, భారత ప్లేయర్ సమీర్ వర్మ 21-15, 15-21, 10-21తో లో కీన్ యెయి (సింగపూర్) చేతిలో ఓడిపోయాడు.

> లిన్ డాన్‌తో తొలి గేమ్‌లో, చివరి గేమ్‌లో బాగా ఆడాను. అయితే రెండో గేమ్‌లో నా వ్యూహం బోల్తా కొట్టింది. దీంతో కోచ్‌ల సలహాలతో కీలకదశలో నా ఆటతీరు మార్చుకొని మంచి ఫలితం సాధించాను. సంయమనం కోల్పోకుండా సుదీర్ఘ సమయం ఆడాను. గురువారం జరిగే ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ నంబర్ వన్ కెంటో మొమోటాతో తలపడనున్నాను. ఈ మ్యాచ్ కోసం నేను ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను. ఈ మ్యాచ్‌లో నా అత్యుత్తమ ఆటతీరును ప్రదర్శించేందుకు ప్రయత్నిస్తాను. –ప్రణయ్

రెండో రౌండ్‌లో సుమీత్-మనూ జంట

డబుల్స్ విభాగంలోభారత జట్లకు మిశ్రమ ఫలితాలు లభించాయి. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో సిక్కి రెడ్డి-అశ్విని పొన్నప్ప జంటకు చాంగ్ చింగ్ హుయ్-యాంగ్ చింగ్ తున్ (చైనీస్ తైపీ) జోడీ నుంచి వాకోవర్ లభించింది. దండు పూజ-సంజన ద్వయం 15-21, 14-21తో సుయా చింగ్-హు లింగ్ ఫాంగ్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడిపోయింది. పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో సుమీత్ రెడ్డి-మనూ అత్రి 21-13, 21-13తో థామ్ గికెల్-రోనన్ లేబర్ (ఫ్రాన్స్) లపై... ఎం.ఆర్.అర్జున్-శ్లోక్ రామచంద్రన్ 21-14, 21-16తో తొబియాస్ కుయెంజి-ఒలివర్ షాలెర్ (స్విట్జర్లాండ్)లపై గెలిచారు. మరో మ్యాచ్‌లో అరుణ్ జార్జి-సాన్యమ్ శుక్లా 18-21, 11-21తో టకుటో ఇనుయు-యుకీ కనెకో (జపాన్) చేతిలో ఓడిపోయారు.

శ్రీశాంత్‌పై నిషేధం కుదింపు

- జీవిత కాలం నుంచి ఏడేళ్లకు తగ్గింపు
- బీసీసీఐ అంబుడ్స్‌మన్ డీకే జైన్ ఆదేశం

న్యూఢిల్లీ: వివాదాస్పద పేసర్ శంతకుమరన్ శ్రీశాంత్‌కు ఊరట. ఈ కేరళ క్రికెటర్‌పై భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) గతంలో విధించిన జీవితకాల నిషేధాన్ని ఏడేళ్లకు తగ్గిస్తూ బోర్డు అంబుడ్స్‌మన్ డీకే జైన్ ఆదేశాలిచ్చారు. 2013 ఐపీఎల్ సందర్భంగా రాజస్తాన్ రాయల్స్‌కు ప్రాతినిధ్యం వహిస్తూ స్పాట్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డారన్న అభియోగాలపై శ్రీశాంత్, అజిత్ చండీలా, అంకిత్ చవాన్‌లపై బోర్డు క్రమశిక్షణ కమిటీ జీవిత కాలం నిషేధం విధించింది. అయితే, ఈ ఏడాది మార్చి 15న సుప్రీంకోర్టు దానిని పక్కన పెట్టింది. ఈ కేసు గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు బెంచ్ ముందుకు వెళ్లింది. జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ కేఎం జోసెఫ్‌లతో కూడిన బెంచ్... మూడు నెలల్లో డీకే జైన్ సమీక్ష చేపడతారని పేర్కొంది. తాజాగా ఆగస్టు 7న జారీ చేసిన ఆదేశాల్లో జైన్... శ్రీశాంత్‌పై నిషేధాన్ని ఏడేళ్లకు పరిమితం చేశారు. వచ్చే ఏడాది ఆగస్టుతో ఆ వ్యవధి ముగియనుంది. శ్రీశాంత్ 36 ఏళ్ల వయసుకు రావడం, అది ఒక పేసర్ కెరీర్ ముగింపు దశ కావడమే తన నిర్ణయానికి కారణమని ఉత్తర్వుల్లో జైన్ పేర్కొన్నారు. స్పాట్ ఫిక్సింగ్‌ను ప్రోత్సహించిన రీత్యా శ్రీశాంత్‌పై విధించిన నిషేధాన్ని బోర్డు గతంలో కోర్టు ఎదుట గట్టిగా సమర్థించుకుంది. పంజాబ్‌తో జరిగిన మ్యాచ్‌లో తన రెండో ఓవర్‌లో 14 పరుగులు ఇచ్చేలా శ్రీశాంత్ ఫిక్సింగ్‌కు ఒప్పుకొన్నాడని, రూ.10 లక్షలు కూడా తీసుకున్నాడని బోర్డు న్యాయవాది పరాగ్ త్రిపాఠి కోర్టుకు టెలిఫోన్ సంభాషణల రికార్డును అందజేశారు. అయితే, ఇందుకు బలమైన ఆధారాలేమీ లేవంటూ క్రికెటర్ తరపు న్యాయవాది ఖండించారు. శ్రీశాంత్ భారత్‌కు 27 టెస్టులు, 53 వన్డేలు, 10 టి20ల్లో ప్రాతినిధ్యం వహించాడు. 2007 టి20, 2011 వన్డే ప్రపంచ కప్‌లు గెలిచిన జట్టులో అతడు సభ్యుడు.

భారత హాకీ జట్ల జోరు

ఒలింపిక్ టెస్ట్ ఈవెంట్ ఫైనల్లో మహిళా, పురుషుల జట్లు



మన్‌దీప్

టోక్యో: ప్రతిష్టాత్మక ఒలింపిక్స్‌కు ముందు నిర్మించిన స్టేడియంలో టెస్ట్ ఈవెంట్లు నిర్వహిస్తారు. ఇందులో భారత హాకీ జట్లు అద్భుత ప్రదర్శనతో ఫైనల్లోకి దూసుకెళ్లాయి. మంగళవారం జరిగిన పోరులో పురుషుల జట్టు ఏకంగా అరడజను గోల్స్‌తో హోరెత్తించింది. దీంతో భారత్ 6-3 గోల్స్‌తో ఆతిథ్య జపాన్‌ను కంగుతినిపించి ఫైనల్ బెర్తు కొట్టేసింది. స్ట్రయికర్ మన్‌దీప్ సింగ్ హ్యాట్రిక్ గోల్స్‌తో చెలరేగాడు. మన్‌దీప్ 9, 29, 30 నిమిషాల్లో మూడు గోల్స్ చేశాడు. మిగతా వారిలో నీలకంఠ శర్మ (3వ ని.), నీలమ్ సంజీప్ (7వ ని.), గుర్జంత్ సింగ్ (41వ ని.) తలా ఒక గోల్ చేశారు. నేడు జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో భారత్ ఆడుతుంది.

'డ్రా'తో ఫైనల్‌కు...

భారత మహిళల జట్టు చైనాతో 'డ్రా' చేసుకొని ఫైనల్ చేరింది. ఈ మ్యాచ్‌లో ఒక్క గోల్ అయినా నమోదు కాలేదు. ఈ ఫలితంతో భారత మహిళల జట్టు పాయింట్ల పట్టికలో 5 పాయింట్లతో అగ్రస్థానంలో నిలిచింది. నేడు జరిగే ఫైనల్లో ఆతిథ్య జపాన్‌తో తలపడుతుంది.

అంకిత ముందంజ

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టెన్నిస్ టోర్నమెంట్‌లో మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా శుభారంభం చేసింది. తొలి రౌండ్‌లో 194వ ర్యాంకర్ అంకిత 6-1, 1-6, 6-2తో తొమ్మిదో సీడ్, 111వ ర్యాంకర్ యాసలైన్ బొనావెన్‌టుర్ (బెల్జియం)పై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో మాత్రం రామ్‌కుమార్ (భారత్) రామనాథన్‌కు నిరాశ ఎదురైంది. తొలి రౌండ్‌లో రామ్‌కుమార్ 5-7, 6-7 (9/11)తో ఫిలిప్పో బాల్డీ (ఇటలీ) చేతిలో పోరాడి ఓడిపోయాడు.

మూడో టెస్టుకు స్మిత్ దూరం



లండన్: తొలి టెస్టులో గెలిచి, రెండో టెస్టును 'డ్రా'గా ముగించి యాషెస్ సిరీస్‌లో పై చేయిగా ఉన్న ఆస్ట్రేలియాకు పెద్ద దెబ్బ. ఆ జట్టు ప్రధాన బ్యాట్స్‌మన్, మాజీ కెప్టెన్ స్టీవ్ స్మిత్... గురువారం నుంచి ప్రారంభమయ్యే మూడో టెస్టుకు దూరమయ్యాడు. రెండో టెస్టు నాలుగో రోజు ఇంగ్లండ్ పేసర్ ఆర్చర్ వేసిన షార్ట్‌బాల్ స్మిత్ మెడకు బలంగా తగిలిన సంగతి తెలిసిందే. ఆ దెబ్బకు మైదానాన్ని వీడిన అతడు గంటలోపే తిరిగొచ్చి ఇన్నింగ్స్ కొనసాగించాడు. కానీ, మరుసటి రోజు తలనొప్పి, మగతగా ఉండటంతో మైదానంలోకి దిగలేదు. దీంతో ఆసీస్ కాంకషన్ సబ్ స్టిట్యూట్‌గా మార్నస్ లబషేన్‌ను ఆడించింది. 'స్మిత్ మంగళవారం జట్టు ప్రాక్టీస్‌లో పాల్గొనలేదు. అతడు హెడింగ్లీలో జరిగే మూడో టెస్టులో ఆడడని కోచ్ లాంగర్ ధ్రువీకరించాడు' అని క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ప్రకటించింది. పూర్తిగా కోలుకోకపోవడం, మ్యాచ్‌కు మూడు రోజుల వ్యవధి మాత్రమే ఉండటంతో స్మిత్‌ను ఆడించకపోవడమే ఉత్తమమని భావించినట్లు సమాచారం. ప్రస్తుత యాషెస్‌లో రెండు జట్ల మధ్య తేడా స్మిత్. మిగతా బ్యాట్స్‌మెన్ విఫలమైనా రెండు సెంచరీలు, 92 పరుగుల ఇన్నింగ్స్‌తో ఆసీస్‌కు అతడు కీలకంగా మారాడు.

టెస్టుల్లో పోటీ రెట్టింపైంది

- 'చాంపియన్‌షిప్'పై ఉత్సుకతతో ఉన్నా
- టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి

నార్త్‌సౌండ్: సంప్రదాయ టెస్టు క్రికెట్‌పై టీమిండియా కెప్టెన్ విరాట్ కోహ్లి తన అభిమానాన్ని మరోసారి చాటాడు. మూడు ఫార్మాట్లలోకెల్లా టెస్టులే తనకెంతో ఇష్టమని పదే పదే చెప్పే అతడు... ప్రజలంతా టెస్టుల మనుగడ ప్రశ్నార్థకమైందని మాట్లాడుతున్నారని, తన దృష్టిలో మాత్రం గత రెండేళ్లలో వాటిలో పోటీ రెట్టింపైందని చెప్పుకొచ్చాడు. ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ పట్ల ఉత్సుకతతో ఉన్నట్లు వివరించాడు. 'మ్యాచ్‌లు పోటాపోటీగా సాగుతూ టెస్టులను అర్థవంతంగా మారుస్తున్నాయి. ఈ సవాల్‌ను స్వీకరించి విజయాలకు ప్రయత్నించడం అనేది ఆటగాళ్లచేతిలో ఉంటుంది. ఇలాంటి పరిస్థితుల్లో చాంపియన్‌షిప్ నిర్వహణ సరైన సమయంలో తీసుకున్న సరైన నిర్ణయం' అని కోహ్లి విశ్లేషించాడు. సోమవారం రాత్రి వెస్టిండీస్ క్రికెట్ ఆటగాళ్ల సంఘం అవార్డుల ప్రదానోత్సవంలో పాల్గొన్న కోహ్లి ఈ వ్యాఖ్యలు చేశాడు. 'చాంపియన్‌షిప్‌లో అదనపు పాయింట్ల కోసం జట్లు ఆలోచిస్తాయి. దీంతో బోర్ కొట్టే 'డ్రా'ల కంటే ఆసక్తి రేపే 'డ్రా'లు ఉంటాయి. టెస్టుల్లో బ్యాట్స్‌మెన్‌కు కష్టాలు ఎక్కువ. చాంపియన్‌షిప్ ద్వారా మరింత క్లిష్ట పరిస్థితులు ఎదురవుతా'యని వివరించాడు.

'నెక్ గార్డ్స్' ధరించడం ఆటగాళ్ల ఇష్టం...

యాషెస్ టెస్టులో స్మిత్-ఆర్చర్ ఉదంతం తర్వాత బ్యాట్స్‌మెన్‌కు మెడ భాగంలో రక్షణ కల్పించేలా ప్రత్యేక ఏర్పాట్లున్న హెల్మెట్లు ధరించడంపై చర్చ సాగుతోంది. ఇప్పటికే ఆసీస్ బ్యాట్స్‌మన్ ట్రావిస్ హెడ్ ఈ రకమైన హెల్మెట్‌తో బరిలో దిగనున్నట్లు ప్రకటించాడు. భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు (బీసీసీఐ) మాత్రం ఈ విషయాన్ని టీమిండియా సభ్యుల విచక్షణకే వదిలేసింది. ఇది క్రికెటర్లు ముఖ్యంగా బ్యాట్స్‌మెన్ సౌకర్యానికి సంబంధించినది కావడంతో తాము ఒత్తిడి చేయదల్చుకోలేదని బోర్డు అధికారి ఒకరు తెలిపారు.

ధనంజయ బౌలింగ్ శైలి అనుమానాస్పదం

దుబాయ్: శ్రీలంక స్పిన్నర్ అకిల ధనంజయ, న్యూజిలాండ్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ బౌలింగ్ శైలిపై సందేహాలు ఉన్నట్లు అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ తెలిపింది. గాలేలో గత వారం జరిగిన తొలి టెస్టు సందర్భంగా ఈ ఇద్దరి ఆఫ్ బ్రేక్ బౌలింగ్ యాక్షన్‌పై మ్యాచ్ అధికారులు నివేదిక ఇచ్చారు. దీంతో వీరిద్దరూ పరీక్షకు హాజరు కావాల్సి ఉంటుంది. అగ్రశ్రేణి బ్యాట్స్‌మన్ అయిన విలియమ్సన్ పార్ట్‌టైమ్ స్పిన్నర్. అకిల వర్ధమాన ఆల్‌రౌండర్. తొలి టెస్టులో కివీస్‌పై అతడు ఐదు వికెట్ల ప్రదర్శన నమోదు చేశాడు.

బ్యాటింగ్ కోచ్ రేసులో మరో ఇద్దరు

రాంప్రకాశ్

ముంబై: టీమిండియా బ్యాటింగ్ కోచ్ పదవికి ఇంగ్లండ్ మాజీ బ్యాట్స్‌మెన్ మార్క్ రాంప్రకాశ్, జొనాథన్ ట్రాట్ దరఖాస్తు చేసుకున్నారు. జాతీయ సెలక్షన్ కమిటీ... సమరవీర, ఆమ్రే, మజుందార్, కనిత్కర్, విక్రమ్ రాథోడ్‌లతో కలిపి వీరిని ఇంటర్వ్యూ చేయనుంది. ఫీల్డింగ్ కోచ్‌గా ఇప్పటికే దిగ్గజ ఫీల్డర్ జాంటీ రోడ్స్ రేసులో ఉండగా దక్షిణాఫ్రికాకే చెందిన యాంట్ బోథా పేరు తాజాగా వెలుగులోకి వచ్చింది. బౌలింగ్ కోచ్ పదవికి వెంకటేశ్ ప్రసాద్, సునీల్ జోషి, అమిత్ భండారి, పారస్ మాంబ్రే ఆసక్తి చూపారు. సెలక్షన్ కమిటీ వీరందరి పేర్లను విభాగాల వారీగా షార్ట్ లిస్ట్ చేసి బోర్డుకు సమర్పించనుంది. చివరకు హెడ్ కోచ్ రవిశాస్త్రిని సంప్రదించి బోర్డు నియామకాలు చేపడుతుంది.

దులీప్ ట్రోఫీ తొలి మ్యాచ్ డ్రా

బెంగళూరు: మూడో రోజూ వీడని వానతో ఇండియా బ్లూ-ఇండియా గ్రీన్‌ల దులీప్ ట్రోఫీ తొలి మ్యాచ్ డ్రా అయ్యింది. ఈ మ్యాచ్‌లో తొలి రోజు మాత్రమే 49 ఓవర్ల ఆట సాధ్యమైంది. ఆ వ్యవధిలో బ్లూ జట్టు ఆరు వికెట్లకు 112 పరుగులు చేసింది.

సాక్షి బిజినెస్
బుధవారం
21-8-2019
WWW.SAKSHIBUSINESS.COM

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్	74	37,328
నిఫ్టీ	40	11,017

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30కి)

నాస్‌డాక్	7,986	17
డోజోన్స్	26,082	54
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,125	64
డాక్స్	11,615	64
షాంఘై	2,880	3
నికాయ్	20,677	114

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

ఫారెక్స్ రేట్లు రూ. లలో

		కొనుగోలు	అమ్మకం
యూఎస్ డాలర్ $	ఎస్‌బీఐ	70.85	72.49
బ్రిటన్ పౌండ్ £	ఎస్‌బీఐ	85.45	88.51
యూరో €	ఎస్‌బీఐ	78.01	80.94
జపాన్ ఎన్ (100) ¥	ఎస్‌బీఐ	66.02	68.52
ఆస్ట్రేలియా డాలర్ AU$	ఎస్‌బీఐ	47.54	49.69
సింగపూర్ డాలర్ S$	ఎస్‌బీఐ	50.86	52.26
సౌదీ రియాల్ SAR	ధామన్‌కుర్	18.34	20.11
యూఏఈ దిర్హామ్ AED	ధామన్‌కుర్	18.78	20.34
చైనా యువాన్ ¥	ధామన్‌కుర్	09.54	10.89

శాంసంగ్.. గెలాక్సీ 'నోట్ 10'

ధరల శ్రేణి రూ. 69,999 – 79,999

న్యూఢిల్లీ: దక్షిణ కొరియాకు చెందిన ఎలక్ట్రానిక్స్ దిగ్గజ కంపెనీ శాంసంగ్ తన గెలాక్సీ సిరీస్‌లో మరో రెండు ప్రీమియం స్మార్ట్‌ఫోన్లను మంగళ వారం దేశీయ మార్కెట్లో విడుదల చేసింది. వీటిలో 'నోట్ 10' ఫోన్ ధర రూ.69,999 కాగా.. 8 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్, 6.3 అంగుళాల డిస్‌ప్లే, వెనుకవైపు ట్రిపుల్ కెమెరా (16 మెగాపిక్సెల్, 12 ఎంపీ, 12 ఎంపీ), ముందువైపు 10 ఎంపీ కెమెరా, 3,500 ఎంఏ హెచ్ బ్యాటరీ ఈఫోన్ స్పెసిఫికేషన్లుగా ప్రకటించింది. 'నోట్ 10 ప్లస్' మోడల్‌లో రెండు వేరియంట్లు ఉండగా.. ఇందులో ప్రారంభ ధర రూ.79,999 నుంచి నిర్ణయించింది.

కెమెరాలు ఈ నూతన వేరియంట్లలో ఒకేలా ఉండగా.. హైఎండ్‌లో 4,300 ఎంఏహెచ్ బ్యాటరీ, 6.8 అంగుళాల డిస్‌ప్లే ఉన్నాయి. నోట్ 10 ప్లస్.. 12 జీబీ ర్యామ్, 256 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్.. 12 జీబీ ర్యామ్, 512 జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ వేరియంట్లలో విడుదలయ్యాయి. ఆగస్టు 23 నుంచి ఫోన్లు వినియోగదారులకు అందుబాటులోకి రానున్నాయి.

మార్కెట్లోకి హ్యుందాయ్ 'గ్రాండ్ ఐ10 నియోస్'

ధరల శ్రేణి రూ. 4.99లక్షలు -7.99 లక్షలు

న్యూఢిల్లీ: ప్రముఖ వాహన తయారీ కంపెనీ హ్యుందాయ్ మోటార్ ఇండియా (హెచ్ ఎంఐఎల్).. తాజాగా తన కాంపాక్ట్ సెగ్మెంట్ పోర్ట్ ఫోలియోలో 'గ్రాండ్ ఐ10 నియోస్' కారును మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. ఇందులో పెట్రోల్ వేరి యంట్ ప్రారంభ ధర రూ.4.99 లక్షలు (ఎక్స్‌షో రూం) కాగా, హైఎండ్ కారు ధర రూ.7.14 లక్ష లుగా నిర్ణయించినట్లు కంపెనీ ప్రకటించింది. డీజిల్ వేరియంట్ ప్రారంభ ధర రూ.4.99 లక్షలు గానూ, టాప్‌ఎండ్ ధర రూ.7.99 లక్షలుగా నిర్ణ యించింది. నూతన వేరియంట్లలో 1.2 డీజిల్, పెట్రోల్ ఇంజిన్లను అమర్చింది. మోడల్ ఆధా రంగా ప్రతి లీటరుకు 20.7 నుంచి 26.2 కిలో మీటర్ల మైలేజీ ఇస్తున్నట్లు వివరించింది. ఈ సందర్భంగా హెచ్‌ఎంఐఎల్ ఎండీ, సీఈఓ ఎస్‌ఎస్ కిమ్ మాట్లాడుతూ.. 'నూతన మోడల్ అంతర్జాతీయ మార్కెట్లో మేడిన్ ఇండియా ఉత్ప త్తిగా లభిస్తుంది. భారత్‌లో అమ్ముడయ్యే ప్యాసిం జర్ వాహనాల్లో (కాంపాక్ట్ విభాగం) 50 శాతానికి మించి వాటాను ఐ10 కలిగి ఉంది. వచ్చే ఐదేళ్లలో కూడా ఈ మోడల్‌దే హవాగా కొనసాగనుంది. నియోస్ విడుదలతో 19.4 శాతంగా ఉన్న ప్రస్తుత కంపెనీ మార్కెట్ వాటా మరింత పెరగనుందని భావిస్తున్నాం' అని అన్నారు.

జీఎస్‌టీ తగ్గితే పరిశ్రమ గాడినపడుతుంది

వాహనాలపై వస్తు సేవల పన్ను రేట్లను ప్రభుత్వం తగ్గిస్తే ఆటో పరిశ్రమకు ఇది సాను కూల అంశంగా మారుతుందని హెచ్‌ఎంఐఎల్ ఎండీ, సీఈఓ ఎస్‌ఎస్ కిమ్ అన్నారు. అమ్మకాలు అంతంత మాత్రంగా ఉండడంతో ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోన్న పరిశ్రమకు జీఎ స్‌టీ తగ్గింపు ఊతమిస్తుంది. రానున్నది పండు గల సీజన్ కావడం చేత ఈ సమయంలోనే ప్రభుత్వం రేట్లను తగ్గించడం అనేది సరైన నిర్ణయంగా ఉంటుందని విశ్లేషించారు. పండు గల సమయంలో కొనుగోళ్లు అధికంగా ఉండే అవకాశం ఉన్నందున రేట్ల కోతకు ఇదే మంచి సమయమని చెప్పారాయన. ప్రభుత్వ నిర్ణయమే ఇప్పుడు పరిశ్రమను గాడిలో పడేలా చేస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు. 'వాహన రుణాలకు రుణ లభ్యత తగ్గిపోవడం, బీఎస్-6 అమలు, పెరిగిన బీమా ధరలు, వినియోగదారుల సెంటి మెంట్ దెబ్బతినడం వంటి ప్రతికూలతల్లో పరి శ్రమ ఇబ్బందుల్లో పడిపోయింది. అయితే, త్వర లోనే కోలుకునే అవకాశం ఉందని భావిస్తున్నా. ఇందుకు తగిన నిర్ణయం ప్రభుత్వం చేతుల్లోనే ఉంది' అని వ్యాఖ్యానించారు.

ఎస్‌బీఐ పండుగ ధమాకా..!

- తక్కువ వడ్డీపై గృహ, వాహన రుణాలు
- ప్రాసెసింగ్ ఫీజు మాఫీ
- ప్రీ-అప్రూవ్డ్ డిజిటల్ రుణాలు కూడా

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) తాజాగా పండుగ సీజన్ ఆఫర్లు ప్రకటించింది. తక్కువ వడ్డీకే గృహ .. వాహన రుణాలు, ప్రాసెసింగ్ ఫీజులు మాఫీ, ప్రీ-అప్రూవ్డ్ డిజిటల్ రుణాలు మొదలైన ఆఫర్లు అందిస్తున్నట్లు వెల్లడించింది. 'అత్యంత తక్కువగా 8.70 శాతం వడ్డీ రేటు నుంచి కారు రుణాలు అందిస్తున్నాం. పండుగ సీజన్‌లో ప్రాసెసింగ్ ఫీజు కూడా ఉండదు' అని బ్యాంకు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. అలాగే వడ్డీ రేట్ల మార్పులకు సంబంధించి ఈ రుణాలపై ప్రతికూల ప్రభావాలేమీ ఉండవని వివరించింది. యోనో వంటి సొంత డిజిటల్ ప్లాట్‌ఫాం నుంచి లేదా వెబ్‌సైట్ ద్వారా కారు లోన్ కోసం దరఖాస్తు చేసుకునే వారికి వడ్డీపై 25 బేసిస్ పాయింట్లు (పావు శాతం) మేర తగ్గింపు కూడా పొందవచ్చు. వేతన జీవులు కారు ఆన్ రోడ్ ధరలో 90 శాతం దాకా రుణంగా పొందవచ్చు. అయితే, ఈ ఆఫర్లు ఎప్పటిదాకా అమల్లో ఉంటాయన్నది మాత్రం ఎస్‌బీఐ వెల్లడించలేదు.

చౌకగా గృహ రుణాలు..

సెప్టెంబర్ 1 నుంచి ప్రస్తుత, కొత్త గృహ రుణాల న్నింటికి రెపో రేట్ ఆధారిత వడ్డీ రేట్లు వర్తింపచే యనున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ప్రస్తుతం గృహ రుణాలపై ఎస్‌బీఐ వడ్డీ రేటు 8.05 శాతంగా ఉంది. ఇటీవలే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ ఆధా రిత వడ్డీ రేటును (ఎంసీఎల్ఆర్) 15 బేసిస్ పాయింట్లు తగ్గించడంతో ఏప్రిల్ నుంచి ఇప్పటి దాకా గృహ రుణాలపై వడ్డీ రేటు 35 బేసిస్ పాయింట్ల మేర తగ్గింది. మరోవైపు రూ. 20 లక్షల దాకా వ్యక్తిగత రుణాల విషయంలో వడ్డీ రేటు అత్యంత తక్కువగా 10.75% నుంచి ప్రారంభమ వుతుందని ఎస్‌బీఐ తెలిపింది. సుదీర్ఘంగా 6 సంవ త్సరాల పాటు చెల్లింపు వ్యవధిని ఎంచుకోవచ్చని పేర్కొంది. ఇక ఎస్‌బీఐలో శాలరీ అకౌంటు ఉన్న ఖాతాదారులు యోనో యాప్ ద్వారా రూ. 5 లక్షల దాకా ప్రీ-అప్రూవ్డ్ రుణాలను పొందవచ్చని వివరించింది. అటు విద్యా రుణాలపై వడ్డీ రేటు 8.25% నుంచి ప్రారంభమవుతుందని ఎస్‌బీఐ తెలిపింది. దేశీయంగా విద్యకు రూ.50 లక్షల దాకా, విదేశీ చదువు కోసం రూ.1.50 కోట్ల దాకా రుణాలు పొందవచ్చు. సుదీర్ఘంగా 15 ఏళ్ల పాటు రుణాల చెల్లింపు వ్యవధిని ఎంచుకోవచ్చని, తద్వారా ఈఎంఐ భారం తగ్గించుకోవచ్చని ఎస్‌బీఐ వివరించింది.

రెపోతో బల్క్ డిపాజిట్ రేట్ల అనుసంధానం..

రిజర్వ్ బ్యాంక్ తగ్గించే పాలసీ రేట్ల ప్రయో జనాలను ఖాతాదారులకు బదలాయించాలంటే బల్క్ డిపాజిట్లపై వడ్డీ రేట్లను రెపో రేటుకు అనుసంధానించేలా బ్యాంకుల ను ఆర్‌బీఐ ఆదే శించాలని ఎస్‌బీఐ ఒక నివేదికలో పేర్కొంది. చిన్న డిపాజిట్‌దారులు, సీనియర్ సిటిజన్స్ ప్రయోజనాలను దెబ్బతీయకుండా, అటు నిధుల సమీకరణ వ్యయాలను బ్యాంకులు తగ్గించుకునేందుకు ఇది ఉపయోగపడగలదని 'ఎకోర్యాప్' నివేదికలో వివరించింది. ఎస్‌బీఐ సహా పలు ప్రభుత్వ రంగ బ్యాంకులు ఇప్పటికే స్వచ్ఛందంగా తమ వడ్డీ రేట్లను రెపో రేటుకు అనుసంధానించాయి. రూ. 2 కోట్ల పైబడిన డిపాజిట్లను బల్క్ డిపాజిట్లుగా వ్యవహరిస్తారు. బ్యాంకుల మొత్తం డిపాజిట్లలో వీటి వాటా సుమారు 30 శాతంగా ఉంటుందని అంచనా. చాలామటుకు బల్క్ డిపాజిట్లు పెద్ద సంస్థల నుంచి ఉంటాయని, చిన్న డిపాజిటర్లతో పోలిస్తే ఇవి వడ్డీ రేట్ల పరంగా కాస్త రిస్కులు భరించగలిగే అవకాశం ఉంటుందని ఎస్‌బీఐ నివేదిక వివరించింది. రుణాలపైనా, డిపాజిట్ల పైనా వడ్డీ రేట్లను రెపోతో అనుసంధానించా లంటూ ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ బ్యాంకులకు సూచించిన నేపథ్యంలో ఈ నివే దిక ప్రాధాన్యం సంతరించుకుంది.

ఓబీసీ నుంచి రెపో ఆధారిత రుణాలు..

ప్రభుత్వ రంగ ఓరియంటల్ బ్యాంక్(ఓబీసీ) ఇకపై గృహ, వాహన రుణాలను రెపో ఆధారిత వడ్డీ రేట్లకు కూడా ఇవ్వనున్నట్లు వెల్లడించింది. గృహ రుణాలపై వడ్డీ రేటు 8.35% నుంచి, వాహన రుణాలపై రేటు 8.70% నుంచి ప్రారం భమవుతుందని పేర్కొంది. ఎంసీఎల్ఆర్ లేదా రెపో రేటు ఆధారిత వడ్డీ రేట్లలో ఏదో ఒక దాన్ని కస్టమర్లు ఎంచుకోవచ్చని వివరించింది.

ప్రాఫిట్ ప్లస్ డైలీ

'పీఎస్‌బీ లోన్స్ పోర్టల్' నుంచి గంటలోపే రిటైల్ రుణాలు

న్యూఢిల్లీ: 'పీఎస్‌బీ లోన్స్ ఇన్ 59 మినిట్స్' పోర్టల్ ద్వారా ఇక నుంచి ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు రిటైల్ రుణాలు ఇవ్వనున్నాయి. గతంలో ఈ పోర్టల్ ద్వారా ప్రభుత్వ రంగ బ్యాంక్‌లు గంటలోపే(59 నిమిషాల్లోనే) లఘు, చిన్న, మధ్య తరహా వాణిజ్య సంస్థలకు రూ.కోటి వరకూ రుణాలకు సూత్రప్రాయ ఆమోదం తెలుపుతున్నాయి. అయితే ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కార్పొరేషన్ బ్యాంక్‌లు రూ.5 కోట్ల వరకూ రుణాలకు సూత్రప్రాయ ఆమో దాన్ని ఈ పోర్టల్ ద్వారా ఇవ్వాలని నిర్ణయిం చాయి. తాజాగా ఈ పోర్టల్ ద్వారా గృహ, వాహన వంటి రిటైల్ రుణాలు ఇచ్చే దిశగా బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్ తదితర బ్యాంక్‌లు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ పోర్టల్‌లో రుణానికి ఆమోదం లభించగానే, 7-8 పనిదినాల్లో రుణాలు మంజూరవుతాయి.

కొనసాగుతున్న పసిడి పరుగు

- జీవితకాల గరిష్టస్థాయికి ధర
- ఢిల్లీలో 10గ్రా. ధర రూ.38,770
- అంతర్జాతీయ మార్కెట్లో తగ్గుదల

న్యూఢిల్లీ: దేశీంగా బంగారం ధర జోరుమీద కొన సాగుతోంది. గతకొద్ది రోజులుగా జీవితకాల గరిష్ట స్థాయిలను తిరగరాస్తూ.. తాజాగా మరో రికార్డు స్థాయిని నమోదుచేసింది. దేశ రాజధాని ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ల (బిస్కెట్ గోల్డ్) బంగారం ధర రూ.38,770 చేరుకుంది. ప్రాంతీయ నగల వ్యాపారుల నుంచి డిమాండ్ క్రమంగా పెరిగిన కారణంగా ఇక్కడి ధర ఒక్క రోజులోనే రూ.200 పెరిగి ఆల్ టైం రికార్డు హైకి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ పేర్కొంది. దేశీయ స్టాక్ మార్కెట్లు పతనమవుతున్నందున ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి మార్గమైన బంగారం వైపునకు మళ్లడమే డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణంగా విశ్లేషించింది. మరోవైపు మంగళవారం అంతర్జాతీయ మార్కెట్లో ఔన్సు బంగారం ధర ఒక దశలో 1,496.60 డాలర్లకు తగ్గింది. శుక్రవారం జాక్సన్ హోల్ ఎకనామిక్ పాలసీ సదస్సులో అమె రికా ఫెడరల్ బ్యాంక్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రసంగం, ఎఫ్ఓఎంసీ జూలై సమావేశ మినిట్స్ వెల్లడి నేపథ్యంలో అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ధర 1,500 డాలర్ల స్థాయిలోనే ఉందని జియోజిత్ ఫైనాన్షియల్ కమోడిటీ విభాగం హెడ్ హరీష్ అన్నారు.

శాంతించిన వెండి..

దేశ రాజధానిలో వెండి ధరలు మంగళవారం తగ్గాయి. ఇండస్ట్రీ, కాయిన్ తయారీదారుల నుంచి డిమాండ్ తగ్గిన కారణంగా స్పాట్ మార్కెట్లో కిలో వెండి ధర రూ.1,100 తగ్గి రూ.43,900 చేరుకుంది.

బంగారు నగలకు హాల్‌మార్కింగ్ తప్పనిసరి!

- అందరితో చర్చించి నిర్ణయం
- బీఐఎస్ డైరెక్టర్ జనరల్ వెల్లడి

కోల్‌కతా: బంగారు ఆభరణాలకు హాల్‌మా ర్కింగ్‌ను తప్పనిసరి చేయాలన్న తన ప్రతి పాదనను కేంద్రం మళ్లీ వెలుగులోకి తెచ్చిం ది. ప్రపంచ వాణిజ్య సంస్థ(డబ్ల్యూటీఓ) నోటిఫై చేయడం కోసం వారం రోజుల్లోనే దీనికి సంబంధించిన నోటిఫికేషన్‌ను జారీ చేస్తామని బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్) డైరెక్టర్ జనరల్ సురైనా రాజన్ పేర్కొన్నారు. దీనితో సంబంధమున్న ముఖ్యంగా పుత్తడి వర్తకు లతో సంప్రదింపులు అనంతరమే ఈ ప్రక్రియ కార్యరూపం దాలుస్తుందని ఆమె వివరించారు. గోల్డ్ హాల్‌మార్కింగ్‌కు సంబంధించి డిజిటైజేషన్ కార్యక్రమాన్ని ఐఐటీ-ముంబై అమలు చేస్తోందని, ఈ ప్రక్రియ పూర్తి కావడానికి ఏడాది పడుతుందని తెలిపారు. ఈ ప్రక్రియలో భాగంగా హాల్‌మార్కింగ్ సెంటర్లను బీఐఎస్ కంట్రోల్‌తో అనుసంధానం చేస్తామని, పూర్తి స్థాయిలో ఈ వ్యవస్థ సిద్ధమైన తర్వాతనే హాల్‌మార్కింగ్ కోడ్ జనరేట్ అవు తుందని వివరించారు. ప్రస్తుతం దేశంలో 800 హాల్‌మార్కింగ్ సెంటర్లు ఉన్నాయని, మొత్తం బంగారు ఆభరణాల్లో 40 శాతానికి మాత్రమే హాల్‌మార్కింగ్ ఉందని తెలిపారు.

కృష్ణపట్నం పోర్టులో

అదానీ పాగా..?

- ఏపీఎస్ఈజెడ్‌కు 72 శాతం వాటా!
- డీల్ విలువ రూ.5,500 కోట్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పోర్టుల వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించేందుకు గౌతమ్ అదానీ కసరత్తు చేస్తున్నారు. ఇందులో భాగంగా కృష్ణప ట్నం పోర్టులో మెజారిటీ వాటాను కైవసం చేసు కుంటున్నట్టు సమాచారం. భారత్‌లో అతిపెద్ద ప్రైవేటు పోర్టు ఆపరేటర్ అయిన అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ (ఏపీఎస్ఈజెడ్) కృష్ణపట్నం పోర్ట్ కంపెనీలో 72 శాతం వాటాను దక్కించుకోనుంది. ఇందుకోసం రూ.5,500 కోట్లకు పైగా వెచ్చించనున్నట్టు తెలుస్తోంది. డీల్ ద్వారా వచ్చిన మొత్తంలో అధిక భాగం అప్పులు చెల్లించేందుకు వినియోగించనున్నారు. కన్‌స్ట్రక్షన్, పోర్ట్స్, పవర్, స్టీల్, ఐటీ, ఎక్స్‌పోర్ట్స్ రంగాల్లో ఉన్న సీవీఆర్ గ్రూప్‌నకు (నవయుగ) కృష్ణపట్నం పోర్ట్ కంపెనీలో 92 శాతం వాటా ఉంది.

తప్పుకోనున్న 3ఐ..

లండన్‌కు చెందిన ప్రైవేట్ ఈక్విటీ సంస్థ 3ఐ గ్రూప్ పీఎల్‌సీ తన అనుబంధ కంపెనీ ఇండియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ ద్వారా 2009 ఫిబ్రవరిలో కృష్ణపట్నం పోర్ట్ కంపెనీలో 26 శాతం వాటాను కొనుగోలు చేసింది. 3ఐ వాటా ప్రస్తుతం 8 శాతా నికి వచ్చి చేరింది. అదానీ ఎంట్రీతో 3ఐ తన వాటా విక్రయించి తప్పుకోనుంది. కృష్ణపట్నం పోర్టు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లాలో నెలకొని ఉంది. 2008లో ఈ పోర్టులో కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి. పోర్టు అభివృద్ధికి సుమారు రూ.8,000 కోట్లు ఖర్చుచేశారు. నౌకాశ్రయం నుంచి 2018-19లో 5.43 కోట్ల టన్నుల సరుకు రవాణా జరిగింది.

2025 నాటికి 40 కోట్ల టన్నులు..

కృష్ణపట్నం పోర్టు లావాదేవీ పూర్తి అయితే ఏపీఎస్ ఈజెడ్‌కు తూర్పు తీరంలో ఇది మూడవ డీల్ అవుతుంది. ఇప్పటికే కంపెనీ 2014లో ధమ్రా, 2016లో కట్టుపల్లి పోర్టులను దక్కించుకుంది. అదానీ పోర్ట్స్ అండ్ స్పెషల్ ఎకనమిక్ జోన్ 2025 నాటికి ఏటా 40 కోట్ల టన్నుల సరుకు రవాణా నమోదు చేయాలని లక్ష్యంగా చేసుకుంది. 2018-19లో 15 శాతం వృద్ధితో 20 కోట్ల టన్నుల కుపైగా సరుకు రవాణా చేపట్టింది. పోర్టుల వ్యాపార విస్తరణకు ఏటా రూ.2,500 కోట్లు పెట్టు బడి పెట్టనున్నట్టు ఏపీఎస్ఈజెడ్ సీఈవో కరణ్ అదానీ ఆగస్టు 7న ఎర్నింగ్స్ కాల్ సందర్భంగా వెల్లడించారు. పోర్టు వ్యాపారం ద్వారా గత ఆర్థిక సంవత్సరంలో కంపెనీ రూ.8,897 కోట్ల టర్నో వర్‌పై రూ.4,006 కోట్ల నికరలాభం ఆర్జించింది. ఏపీఎస్ఈజెడ్ ఏపీలోని విశాఖపట్నంతోసహా 10 పోర్టులను నిర్వహిస్తోంది.

ఫిన్‌టెక్.. 'కంటెంట్' మంత్రం!

- స్టాక్ మార్కెట్లు, ఫండ్స్‌పై విస్తృత సమాచారం
- చార్ట్‌లు, గ్రాఫ్‌లు, వీడియో, టెక్స్ట్ సందేశాలు
- అస్థిరతల సమయాల్లో నడుచుకోవడంపై అవగాహన
- పెట్టుబడులపై సూచనలు
- తద్వారా ఇన్వెస్టర్లు దూరం కాకుండా చర్యలు

న్యూఢిల్లీ: స్టాక్స్, మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుబ డుల సేవలు అందిస్తున్న నవతరం ఫిన్‌టెక్ స్టార్ట ప్‌లు.. అల్లకల్లోల సమయాల్లో కస్టమర్లను కాపా డుకునేందుకు, వారు మార్కెట్లకు దూరంగా వెళ్ల కుండా ఉండేందుకు పలు రకాల సేవలతో ఆక ర్షించే ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో ప్రత్యే కమైన కంటెంట్ కూడా ఒకటి. స్టాక్ మార్కెట్లు దీర్ఘకాలంగా తీవ్ర అస్థిరతల్లో ఉండడంతో కంపె నీలు ఈ తరహా చర్యల దిశగా అడుగులు వేస్తు న్నాయి. జీరోధా, గ్రోవ్ వంటి సంస్థలు బ్లాగ్ పోస్ట్‌లు, సోషల్ మీడియా సందేశాలు, మార్కె ట్లపై విజ్ఞానాన్ని పెంచే వినూత్నమైన వీడియో లను అందిస్తున్నాయి. వీటి ద్వారా ఆటుపోట్లతో కూడిన మార్కెట్లలో పెట్టుబడి అవకాశాల గురించి తెలియజేస్తూ ఇన్వెస్టర్లు తగిన నిర్ణ యాలు తీసుకునే దిశగా ప్రోత్సహిస్తున్నాయి.

జీరోధా సేవలు...

''అస్థిరతలతో కూడిన మార్కెట్లలో ఇన్వెస్టర్ల ప్రవర్తన అందరిదీ ఒకే విధంగా ఉంటుంది. కనుక గతంలో ఇన్వెస్టర్లు ఏ విధంగా స్పందిం చారన్న విషయంపై ఇన్వెస్టర్లకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాం. గ్రాఫ్‌లు, చార్ట్‌ల సాయంతో ఈ తరహా మార్కెట్ పరిస్థితుల్లో ఉన్న అవకాశాల గురించి వివరిస్తున్నాం'' అని జీరోధా సంస్థలో ఈక్విటీ పరిశోధన విభాగం వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేస్తున్న కార్తీక్ రంగప్ప తెలిపారు. జీరోధా సంస్థ వర్సిటీ, ట్రేడింగ్‌క్యుఎ న్‌ఏ, జెడ్‌కనెక్ట్ అనే మూడు కార్యక్రమాలను నిర్వ హిస్తోంది. ఇన్వెస్టర్ల ఆందోళనలు, ప్రశ్నలకు వీటి ద్వారా సమాధానాలు ఇస్తోంది. ఇప్పటి వరకు 46,000 విచారణలను ఈ సంస్థ స్వీకరించింది. ఆప్షన్ల ట్రేడింగ్, పన్నులపై ఈ ప్రశ్నలు ఎదుర య్యాయి. రోజూ 20-40 వరకు విచారణలు వస్తున్నాయని రంగప్ప పేర్కొన్నారు. ఫలానా స్టాక్ ఫలానా ధర ఉన్నప్పుడు ఇన్వెస్టర్‌ను అప్ర మత్తం చేసేందుకు 'సెట్ యాన్ అలర్ట్' ఆప్షన్, స్టాక్ రిపోర్టులు, టెక్నికల్స్, ఫండమెంటల్స్, చార్ట్ లను జెరోదా ఆఫర్ చేస్తోంది. వీటిని జీరోధా కైట్ యాప్, పోర్టల్ నుంచి సులభంగా పొందొచ్చు.

ఈటీ మనీ...

అస్థిరతల పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలన్న దానిపై ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించే ప్రయత్నాన్ని ఈటీ మనీ చేస్తోంది. ''వాస్తవ గణాంకాలు, సమాచారం ఆధారంగా అస్థిరతల సమయాల్లో ఎలా నడుచుకోవాలన్న దానిపై ఇన్వెస్టర్లకు అవగాహన కల్పిస్తున్నాం. ప్రతీ మ్యూచువల్ ఫండ్‌కు సంబంధించి రిపోర్టు కార్డు లతో సులభమైన ఇంగ్లిష్‌లో తెలియజేస్తున్నాం'' అని ఈటీ మనీ సీఈవో ముకేష్ కర్లా తెలిపారు. టైమ్స్ గ్రూపులో భాగమైన టైమ్స్ ఇంటర్నెట్‌కు చెందిన అనుబంధ కంపెనీయే ఈటీ మనీ.

ఇతర సంస్థలూ...

22 లక్షల యూజర్ల బేస్ కలిగిన గ్రోవ్ సంస్థ వీడియో కంటెంట్‌ను ఇన్వెస్టర్లకు అందిస్తోంది. ''వీడియో, టెక్స్ట్ కోసం 12 మందితో కూడిన కంటెంట్ బృందం మాకు ఉంది. పెట్టుబడుల అంశాలపై మాట్లా డాలంటూ పరిశ్రమకు చెందిన నిపుణులను ఆహ్వానిస్తున్నాం. వీడియోలు చాలా సుల భంగా, తక్కువ అంశాలతో అవగాహన కల్పించే విధంగా ఉండేలా చూస్తున్నాం'' అని గ్రోవ్ సీఈవో హర్ష్‌జైన్ వెల్లడించారు. గ్రోవ్ యూట్యూబ్ సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 5,000 నుంచి 31,000కు పెరగ్గా, ఒక్కో వీడియోకు గతంలో 1,000 వ్యూస్ రాగా, అవి 10,000కు పెరిగాయి. పేటీఎం మనీ సైతం ముగ్గురు సభ్యుల బృందంతో యూ జర్లపై మార్కెట్ పరిస్థితుల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నాలు చేస్తోంది. ఈ తరహా సందేశాలు కస్టమర్లను సర్దుకునేలా చేస్తాయ న్నారు పేటీఎం మనీ హోల్‌టైమ్ డైరెక్టర్ ప్రవీణ్ జాదవ్. ఇన్వెస్ట్‌మెంట్ ప్రపంచంలో యూజర్లకు అవగాహన కల్పించే కార్యక్ర మాలు కొత్తేమీ కాదు. మ్యూచువల్ ఫండ్స్ సంస్థలు ఇన్వెస్టర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టడాన్ని సెబీ తప్పనిసరి కూడా చేసింది. అయితే, చిన్న పట్టణాల నుంచీ ఇన్వెస్టర్లు పెరుగుతున్న ప్రస్తుత పరి స్థితుల్లో ఈ తరహా కార్యక్రమాల అవసరం ఎంతో ఉందంటున్నారు నిపుణులు.

epaper.sakshi.com

సీడ్ ఎక్స్‌పోర్ట్ జోన్ ఏర్పాటు చేయండి

తెలంగాణకు ఎఫ్ఎస్ఐఐ ప్రతిపాదన

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశవ్యాప్తంగా విత్తన పరిశ్రమ విలువ రూ.18,000 కోట్లుంది. ఏటా ఈ రంగం 8-9 శాతం వృద్ధి చెందుతోంది. పరిశ్రమలో ఎగుమతులు రూ.300 కోట్లు మాత్రమే. ఇక విత్తన ఉత్పత్తిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లు 65-70 శాతం వాటా కైవసం చేసుకున్నాయి. ఈ నేపథ్యంలో తెలంగాణలో సీడ్ ఎక్స్‌పోర్ట్ జోన్ ఏర్పాటు చేయాలని ఫెడరేషన్ ఆఫ్ సీడ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఐఐ) మూడేళ్లుగా ప్రభుత్వాన్ని కోరుతూనే ఉంది. జోన్ కార్యరూపంలోకి వస్తే ఎగుమతులు మరింత పెరుగుతాయని ఎఫ్ఎస్ఐఐ డైరెక్టర్ జనరల్ రామ్ కౌండిన్య మంగళవారమిక్కడ మీడియాకు తెలిపారు. 'జోన్ స్థాపనకు కావాల్సిన మౌలిక వసతులు ప్రభుత్వం కల్పిస్తే చాలు. ఆర్‌అండ్‌డీ సెంటర్లు, తయారీ కేంద్రాల ఏర్పాటుకు కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. ఎగుమతులు అధికమైతే స్థానిక రైతులకు ఆదాయం పెరుగుతుంది' అని వివరించారు. విత్తన పాకెట్లపై త్వరలో బార్ కోడింగ్ తప్పనిసరి కానుందని చెప్పారు. ఇది సాకారమైతే నకిలీలకు అడ్డుకట్ట వేయొచ్చని అభిప్రాయపడ్డారు.

'రియల్‌మి 5, 5ప్రో' విడుదల

ప్రారంభ ధర రూ.9,999

న్యూఢిల్లీ: చైనాకు చెందిన మొబైల్ హ్యాండ్ సెట్స్ తయారీ కంపెనీ 'రియల్‌మి'.. దేశీ మార్కెట్లో మంగళవారం రెండు అధునాతన స్మార్ట్‌ఫోన్లను విడుదలచేసింది. 'రియల్‌మి 5' పేరుతో విడుదలైన ఫోన్ ధర రూ.9,999 కాగా.. మొత్తం మూడు వేరియంట్లలో ఇది విడుదలైంది. ఆగస్టు 27 నుంచి వినియోగదారులకు అందుబాటులోకి రానున్న ఈ ఫోన్‌లో 5,000 ఎంఏహెచ్ బ్యాటరీ, 6.5 అంగుళాల డిస్‌ప్లే, ముందువైపు 13 మెగాపిక్సెల్ కెమెరా.. వెనుకవైపు 119 డిగ్రీ 8మెగాపిక్సెల్ ఆల్ట్రావైడ్ యాంగిల్ లెన్స్ కెమెరా, 12ఎంపీ మెయిన్ కెమెరా లెన్స్, 2ఎంపీ ఆల్ట్రా మాక్రో లెన్స్, 2 ఎంపీ పోర్ట్రెయిట్ లెన్స్ కెమెరాలు ఉన్నాయి. 'రియల్‌మి 5 పో' సెప్టెంబరు 4 నుంచి అందుబాటులోకి రానుంది. ఇందులో 16 మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా, 48ఎంపీ మెయిన్ కెమెరా లెన్స్ ఉన్నాయి.

క్లాసిక్ పోలో మరో 65 ఔట్‌లెట్లు

గ్రూప్ టర్నోవర్ రూ.1,000 కోట్లు! • నూతన కలెక్షన్ ఆవిష్కరణ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెడీమేడ్స్ తయారీలో ఉన్న రాయల్ క్లాసిక్ మిల్స్ 'క్లాసిక్ పోలో' ఫ్రాంచైజీ విధానంలో రిటైల్ ఔట్‌లెట్ల సంఖ్యను 200లకు చేర్చనుంది. ప్రస్తుతం సంస్థకు పలు రాష్ట్రాల్లో ఇటువంటి స్టోర్లు 135 ఉన్నాయి. వీటిలో అత్యధికం దక్షిణాదిన ఉన్నాయి. కొత్త కేంద్రాలు తూర్పు, పశ్చిమ భారత్‌లో రానున్నాయని క్లాసిక్ పోలో రిటైల్ డైరెక్టర్ రమేశ్ విభేని మంగళవారం తెలిపారు. నూతన కలెక్షన్‌ను ఇక్కడ ఆవిష్కరించిన సందర్భంగా మీడియాతో మాట్లాడారు. క్లాసిక్ పోలో బ్రాండ్ ద్వారా 2018-19లో రూ.160 కోట్లు సమకూరింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.200 కోట్లకు చేరుకుంటుందని చెప్పారు. గ్రూప్ టర్నోవర్ 2019-20లో 25 శాతం వృద్ధితో రూ.1,000 కోట్లను తాకుతుందని కంపెనీ బిజినెస్ డెవలప్‌మెంట్ జీఎం గుండుబోయిన శ్రీకాంత్ వెల్లడించారు. గ్రూప్ ఆదాయంలో అత్యధిక వాటా ఎగుమతులదేనని, యూఎస్, యూరప్, మధ్య ప్రాచ్య, ఆఫ్రికా దేశాలకు దుస్తులను సరఫరా చేస్తున్నట్టు వివరించారు.

ఏటా 2,000 కొత్త డిజైన్లు..

క్లాసిక్ పోలో నుంచి ఏటా 2,000 డిజైన్లు ప్రవేశపెడుతున్నట్టు సేల్స్, మార్కెటింగ్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ధ్యనేశ్ కుమార్ వెల్లడించారు. విక్రేతల కోసం ప్రత్యేక యాప్‌ను రూపొందించామని, దీని ద్వారా ఆర్డరు ఇచ్చిన నెలరోజుల్లోనే వారికి దుస్తులను సరఫరా చేస్తున్నామని తెలిపారు. కంపెనీ విక్రయిస్తున్న రెడీమేడ్స్ ధర రూ.599-2,499 మధ్య ఉందన్నారు. పర్యావరణ అనుకూల డిజైన్లపై ఫోకస్ చేస్తున్నామని డిజైన్ మేనేజర్ తిరునవక్కరసు తెలిపారు. సస్టేనబుల్ డెనిమ్ పేరుతో వాడి పడేసిన ప్లాస్టిక్ బాటిళ్లు, కాటన్ మిశ్రమంతో జీన్స్ ప్యాంట్స్ అందుబాటులోకి తెచ్చాం. వెదురు నుంచి తీసిన నారతో షర్ట్స్ రూపొందించాం అని వివరించారు.

సస్టేనబుల్ డెనిమ్‌తో ధ్యనేశ్, శ్రీకాంత్, రమేశ్, తిరునవక్కరసు (ఎడమ నుంచి కుడికి)

నిఫ్టి 50

టాప్ 10 గెయినర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
MARUTI	6,223.00	4.02
TATAMOTORS	123.8	2.48
HCLTECH	1,085.05	1.97
INFY	792.5	1.91
DRREDDY	2,553.00	1.75
M&M	527.85	1.4
HINDUNILVR	1,845.95	1.38
TCS	2,190.00	1.25
HEROMOTOCO	2,663.55	1.22
HDFCBANK	2,224.00	0.78

టాప్ 10 లూజర్స్ (రూపాయిల్లో)

Symbol	LTP	(%)Change
YESBANK	71.55	-6.65
IBULHSGFIN	519	-3.32
BRITANNIA	2,398.00	-3.24
ULTRACEMCO	4,023.70	-3.23
INDUSINDBK	1,404.10	-2.66
BAJAJFINSV	7,232.55	-1.95
COALINDIA	195.15	-1.91
ITC	246.85	-1.87
EICHERMOT	16,060.00	-1.7
AXISBANK	674	-1.61

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	2,307
ఎన్ఎస్ఈ	29,068
ఎన్ఎస్ఈ (డెరివేటివ్స్)	10,69,260
ఎఫ్ఐఐ	373
డీఐఐ	296

మూడు రోజుల లాభాలకు బ్రేక్

- 74 పాయింట్లు పతనమై 37,328కు సెన్సెక్స్
- 11,017కు ఎన్ఎస్ఈ 50

మందగమనంలో ఉన్న ఆర్థిక వ్యవస్థకు జోష్ నిచ్చే ప్రభుత్వ చర్యల ఎదురుచూపుల నేపథ్యంలో మంగళవారం స్టాక్ మార్కెట్ నష్టపోయింది. దీంతో మూడు రోజుల లాభాలకు బ్రేక్ పడింది. వాహన, ఐటీ షేర్లు లాభపడగా, బ్యాంక్, ఆర్థిక, ఇంధన, లోహ రియల్టీ షేర్లు పతనమయ్యాయి. బీఎస్ఈ సెన్సెక్స్ 74 పాయింట్ల నష్టంతో 37,328 పాయింట్ల వద్ద, ఎన్ఎస్ఈ నిఫ్టీ 37 పాయింట్లు తగ్గి 11,017 పాయింట్ల వద్ద ముగిశాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 25 పైసలు తగ్గి 71.69కు చేరడం, ముడి చమురు ధరలు స్వల్పంగా పెరగడం ప్రతికూల ప్రభావం చూపించాయి. అంతకు ముందటి మూడు ట్రేడింగ్ సెషన్లలో సెన్సెక్స్ 444 పాయింట్లు, నిఫ్టీ 128 పాయింట్ల మేర పెరిగాయి. ఆసియా మార్కెట్ల జోష్‌తో సెన్సెక్స్ లాభాల్లోనే ఆరంభమైంది. ఆ తర్వాత ఒడిదుడుకులకు గురై, లాభ, నష్టాల మధ్య దోబూచులాడింది. ట్రేడింగ్ చివర్లో అమ్మకాల జోరు పెరగడంతో నష్టాల్లో ముగిసింది. ఒక దశలో 109 పాయింట్లు పెరిగిన బీఎస్ఈ సెన్సెక్స్ మరో దశలో 183 పాయింట్లు నష్టపోయింది. రోజంతా చూస్తే, 292 పాయింట్ల రేంజ్‌లో కదలాడింది.

పేలవంగా 'స్టెర్లింగ్ సోలార్'

- 10 శాతం నష్టంతో రూ.700 వద్ద లిస్టింగ్
- 7 శాతం నష్టంతో రూ.725 వద్ద ముగింపు

న్యూఢిల్లీ: స్టెర్లింగ్ అండ్ విల్సన్ సోలార్ కంపెనీ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌లో నిరాశపరిచింది. ఇష్యూ ధర రూ.780తో పోల్చితే బీఎస్ఈలో ఈ షేర్ 10 శాతం నష్టంతో రూ.700 వద్ద లిస్టయింది. ఇంట్రాడేలో రూ.755, రూ.691 గరిష్ట, కనిష్ట స్థాయిలను తాకింది. చివరకు 7 శాతం నష్టంతో రూ.725 వద్ద ముగిసింది. బీఎస్ఈలో 3 లక్షలు, ఎన్ఎస్ఈలో 45 లక్షల మేర షేర్లు ట్రేడయ్యాయి. మంగళవారం మార్కెట్ ముగిసేనాటికి కంపెనీ మార్కెట్ క్యాప్ రూ.11,632 కోట్లుగా నమోదైంది. ఇటీవలే ముగిసిన ఐపీఓ ద్వారా ఈ కంపెనీ రూ.3,125 కోట్లు సమీకరించింది. రూ.775-780 ప్రైస్‌బాండ్‌తో వచ్చిన ఈ ఐపీఓ 92 శాతం మాత్రమే సబ్‌స్క్రైబయింది. ఈ ఐపీఓకు బుక్ రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్, యాక్సిస్ క్యాపిటల్, క్రెడిట్ సూసీ సెక్యూరిటీస్ ఇండియా, డాషే ఈక్విటీస్ ఇండియా, ఐఐఎఫ్ఎల్ సెక్యూరిటీస్, ఎస్‌బీఐ క్యాపిటల్ మార్కెట్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, యస్ సెక్యూరిటీస్ ఇండియా సంస్థలు వ్యవహరించాయి.

రూపాయి మరింత పతనం..

- ఆర్నెల్ల కనిష్టానికి క్షీణత
- 28 పైసలు తగ్గుదల 71.71 వద్ద క్లోజింగ్

ముంబై: ఆర్థిక అనిశ్చితి పరిస్థితుల నేపథ్యంలో రూపాయి మారకం విలువ రోజురోజుకూ మరింతగా క్షీణిస్తోంది. తాజాగా మంగళవారం డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ మరో 28 పైసలు తగ్గి 71.71 వద్ద ముగిసింది. ఇది ఆరు నెలల కనిష్ట స్థాయి. ఫిబ్రవరి 4 తర్వాత దేశీ కరెన్సీ ఈ స్థాయికి పడిపోవడం ఇదే తొలిసారి. అప్పట్లో డాలర్‌తో పోలిస్తే రూపాయి 71.80 వద్ద క్లోజయ్యింది. ఆర్థిక మందగమనం వేగవంతం అవుతుండటం, విదేశీ పెట్టుబడుల రాకపై ఆశలు సన్నగిల్లుతుండటం, చాలా మటుకు వర్ధమాన మార్కెట్ల కరెన్సీలు బలహీనంగా ఉండటం వంటి అంశాల కారణంగా ఇన్వెస్టర్లు రిస్కులు తీసుకోవడానికి వెనుకాడుతున్నారని ఫారెక్స్ ట్రేడర్లు తెలిపారు. ఇవన్నీ కలిసి రూపాయిపై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని వివరించారు. అటు చమురు ధరలు పెరుగుతుండటం కూడా రూపాయి మీద ప్రభావం చూపుతోంది. అయితే, వివిధ రంగాల్లో పడిపోతున్న డిమాండ్‌కి ఊతమిచ్చేందుకు ప్రభుత్వం త్వరలోనే ప్రోత్సాహక చర్యలు ప్రకటించవచ్చన్న ఆశావహ అంచనాలు నెలకొన్నాయి. ఇంటర్‌బ్యాంక్ ఫారెక్స్ మార్కెట్లో క్రితం ముగింపు 71.43 తో పోలిస్తే రూపాయి ట్రేడింగ్ ఒకింత బలహీనంగానే ప్రారంభమైంది. ఒక దశలో 71.80 కనిష్ట స్థాయికి కూడా పడిపోయి చివరికి 28 పైసల క్షీణతతో 71.71 వద్ద క్లోజయ్యింది.

72.5 మద్దతు: 'క్రూడాయిల్ ధరల రికవరీతో దిగుమతి సంస్థలు, విదేశీ బ్యాంకుల నుంచి డాలర్ల కోసం డిమాండ్ పెరిగింది. దీంతో రూపాయి వరుసగా రెండో రోజూ క్షీణించింది. మహానగర్ గ్యాస్‌లో షెల్ సంస్థ వాటాలు విక్రయించేయడంతో సుమారు 102 మిలియన్ డాలర్ల మేర నిధులు వెనక్కి తరలిపోవచ్చన్న అంచనాలు కూడా రూపాయిపై ప్రభావం చూపాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ హెడ్ (పీసీజీ, క్యాపిటల్ మార్కెట్స్ స్ట్రాటెజీ విభాగం) వీకే శర్మ చెప్పారు.

బులియన్ రూ.లలో

ముంబై		
బంగారం (24 క్యారెట్లు)	38,430	0
బంగారం (22 క్యారెట్లు)	36,600	0
వెండి (కిలో)	48,200	▲ 600
చెన్నై		
బంగారం (24 క్యారెట్లు)	37,840	▲ 210
బంగారం (22 క్యారెట్లు)	36,040	▲ 200
వెండి (కిలో)	48,200	▲ 600
హైదరాబాద్		
బంగారం (24 క్యారెట్లు)	37,840	▲ 210
బంగారం (22 క్యారెట్లు)	36,040	▲ 200
వెండి (కిలో)	48,200	▲ 600
ప్రొద్దుటూరు		
బంగారం (24 క్యారెట్లు)	37,250	▼ 200
బంగారం (22 క్యారెట్లు)	34,420	▼ 130
వెండి (కిలో)	43,500	0
విశాఖపట్నం		
బంగారం (24 క్యారెట్లు)	38,530	–
బంగారం (22 క్యారెట్లు)	35,840	–
వెండి (కిలో)	45,500	–
ఏపీ బులియన్ అసోసియేషన్		
బంగారం (24 క్యారెట్లు)	38,960	▲ 210
బంగారం (22 క్యారెట్లు)	36,040	▲ 200
వెండి (కిలో)	48,200	▲ 600

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారల్)

నైమెక్స్ లైట్ స్వీట్	55.85 రాత్రి 11.30కు	$ 56.14 సోమవారం ముగింపు
బ్రెంట్	59.72 రాత్రి 11.30కు	$ 59.74 సోమవారం ముగింపు

భారత్‌లో రూ.4,000 కోట్లు పెట్టుబడులు

- వెల్లడించిన వివో ఇండియా
- గ్రేటర్ నోయిడాలో మరో ప్లాంట్
- ఇప్పటి వరకూ రూ.400 కోట్ల పెట్టుబడులు

జైపూర్: చైనా మొబైల్ కంపెనీ వివో భారత్‌లో రూ.4,000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నది. ఇప్పటిదాకా భారత్‌లో రూ.400 కోట్లు పెట్టుబడులు పెట్టామని వివో ఇండియా డైరెక్టర్(బ్రాండ్ స్ట్రాటజీ) నిపుణ్ మర్య తెలిపారు. ప్రస్తుతం నోయిడాలో ఉన్న తమ ప్లాంట్ పూర్తి ఉత్పాదక సామర్థ్యంతో ఏడాదికి 2.5 కోట్ల మొబైల్ ఫోన్లను ఉత్పత్తి చేస్తోందని వివరించారు. తమ ఫోన్ల కోసం డిమాండ్ పెరుగుతోందని, ఈ డిమాండ్‌ను అందిపుచ్చుకోవడం కోసంరూ.4,000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నామని తెలిపారు. దశలవారీగా ఈ పెట్టుబడులు పెడతామని పేర్కొన్నారు. గ్రేటర్ నోయిడాలో కొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నామని, ఈ ప్లాంట్ అందుబాటులోకి వస్తే, ఏడాదికి 5 కోట్ల ఫోన్లను ఉత్పత్తి చేస్తామని వివరించారు.

21 శాతం మార్కెట్ వాటా..

భారత మొబైల్ మార్కెట్లో తమ వాటా 21.2 శాతమని, ఆఫ్‌లైన్ మార్కెట్లో రెండో అతి పెద్ద మొబైల్ కంపెనీ తమదేనని నిపుణ్ వివరించారు. భారత మార్కెట్ కోసం రెండు కొత్త మొబైల్ ఫోన్లను అందించనున్నామని తెలిపారు. ఇటీవలనే కొత్తగా ఎస్ సిరీస్‌లో వివో ఎస్1 స్మార్ట్‌ఫోన్‌ను అందుబాటులోకి తెచ్చామని, దీని ధర రూ.17,999 అని వివరించారు.

ఎన్‌సీఎల్‌టీలో డెలాయిట్‌కు దక్కని ఊరట

ఐఎల్ఎఫ్ఎస్ కేసులో చుక్కెదురు

న్యూఢిల్లీ: ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న ఐఎల్ అండ్ఎఫ్ఎస్ కేసుకు సంబంధించి ఆడిటింగ్ సంస్థలు డెలాయిట్ హాస్కిన్స్ అండ్ సెల్స్, బీఎస్ఆర్ అసోసియేట్స్‌కు నేషనల్ కంపెనీ లా అప్పీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ)లో చుక్కెదురైంది. వాటిపై విధించిన నిషేధానికి సంబంధించి తాత్కాలికంగానైనా ఊరటనిచ్చేందుకు ట్రిబ్యునల్ నిరాకరించింది. ఐఎల్అండ్ఎఫ్ఎస్ ఫ్రాడ్ కేసులో ముందస్తు షెడ్యూల్ ప్రకారం విచారణ కొనసాగుతుందని స్పష్టం చేసింది. అయితే, సెప్టెంబర్ 20న జరిగే తదుపరి విచారణ దాకా తుది ఉత్తర్వులేవీ జారీ చేయబోమని పేర్కొంది. ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ ఆడిటింగ్ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించడంలో విఫలమైనందుకు గాను రెండు సంస్థల పైనా అయిదేళ్ల పాటు నిషేధం విధిస్తూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) గతంలో ఆదేశాలు ఇచ్చింది. అయితే, దీన్ని సవాలు చేస్తూ డెలాయిట్, బీఎస్ఆర్ తాజాగా ఎన్‌సీఎల్ఏటీని ఆశ్రయించాయి. ఐఎల్అండ్ఎఫ్ఎస్ గ్రూప్ వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు దాదాపు రూ. 95,000 కోట్ల మేర రుణాలు బాకీపడిన సంగతి తెలిసిందే.

బీఎస్ఈలో ఏపీ,టీఎస్ స్టాక్స్

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
AditSpin	4.48	4.71
Alphageo	190.4	195.15
Alu Flouride	100.2	104.7
Amar Raja Bat	619.4	624.15
And Bank	18.95	19.15
And Cemen	1.94	1.85
And Paper	440.25	441.15
And Petro	40	41.3
Anjani Portl	146	150.8
Aries Agro Ltd	52.45	53.85
Aurobindo Ph	596.4	603.15
Avantel Soft	200	200.05
Avanti Feeds	303.8	300.7
AvonOrg	2.02	2.12
BN Rathi Sec	19.5	19
Bakelite	9.36	8.92
Balaji Amin	261.65	266.9
Bambino Agro	154	155.05
Bartronics	2.36	2.41
Bhagira Chem	410.05	402
Brilliant Sec	0.7	0.72
CIL Securi	13.66	13.95
Combat Drugs	21.9	21.9
Cont Coffee	245.95	247.7
CoroFert	360	354.6
Country Club	3.63	3.61
Cubex Tub	11.2	10.79
Cybermate	1.75	1.76
DR Reddy	2554.9	2510.5
Danlaw Tec	78	77.8
DecCement	360.3	363.9
Divi's Lab	1519.2	1517.75
Divya Granit	65.65	62.55
Dredgin Corp	318.7	326.7
Everest Org	179.15	160
Fortune Info	24.25	25.2
Four Soft	21.55	20.55
GMR Infra	15.18	15.9
GVK Power	5.07	5.25
Galada Tele	1.19	1.25
Gati Corpn	41.3	41.85
Gayatri Proj	129.9	133.2
Gayatri Sugrs	1.43	1.5
Gennex Lab	3.29	3.36
GodavDru	18.75	18.9
Goldstn Tele	188.75	191.8
Goldstone Tech	11	11.49
Granules (I)	93.35	94.3
HBL Nife Pow	15.15	15.5
HYDIndus	1264	1295.55
Heritage Food	344.65	335.8
HindFlurocarb	11.55	11.62
ICSA Ltd	1.78	1.87
IDL Industrs	309.1	312
IQMS Soft	8.2	8.16
IVRCL Infras	0.44	0.46
Incap	24	24
IndoNationl	450	449.9
Infotech En	430.5	425
Innaredy Com	1.78	1.87
JSTL	19.5	21
KCP LTD	72.6	72.9
KNR Constructio	246.25	244.85
KakatiCem	163.3	166.6
Kallam Spg	10.5	10.5
Krebs Bio	76	76.05
LGS Global	3.31	3.16
LancoIndus	169.55	172.65
Lokesh Mach	35.5	34.6
Lotus Choc	16.9	15.85
MIC Elec	0.75	0.72
Madhucon Proje	4.94	4.88
Maytas Infra	3.79	3.68
Mold-tek	49.9	50
Moldtek Plastic	271	272.75
Moschip Semi	12.5	12.49
NCLInd	106.2	111.3
NETTLINX	18	17.7
NMDC Ltd	90.15	101.85
NagarAgrich	27	27.75
NagarConst	58.1	61.15
Natco Pharma	549.65	544.6
Nava Bh Ventur	89.4	89
Neha Inter	1.18	1.24
Neuland Lab	500.1	502.8
Nile	203	194.25
Northgate Tech	0.28	0.28
Oil Country	6.76	6.45
Ortin Lab	10	9.91
PennInd	28.35	29.45
Phytochem I	24.95	23.7
Pitti Lamin	34.8	36.2
Pokarna	131	132
Prajay Engs	6.8	6.85
PremiExpl	163.35	162.5
Prism Cement	85	84.85
Ragsan Petro	78.65	80.1
Rain Industries	83.1	83.85
Raj Packagin	22	22.05
Ram Informat	32.9	34.85
Reg.Ceramic	1.56	1.63
Restile Cer	2.5	2.62
Roopa Indus	9.69	10.2
Sagar Cem	558.4	567
Samkrg Pist	103	102.65
Sampre Nutri	18.25	19.2
SangInd	55	56.3
Satvah. Ispat	8.09	7.71
Saven Techno	15.95	15.8
Sibar Auto	17.35	17.35
South Magnes	14.25	14.95
SrRayAlk	23.2	23.75
Srinivasa Ship	16.85	17.4
Sujana Metal	0.32	0.32
Sujana Towers	0.7	0.67
Surana Tele	4	3.98
Suryachakra Pow	0.19	0.19
Suryalata Sp	121.25	124.1
SuvarCem	54.8	52.2
Suven Pharma	246.95	244.8
TCI Finance	9.51	10.23
Taj Gvk Hotel	122	127.1
Tanla Solutions	50.75	48.35
Trans Biotek	2.7	2.84
Transport Co	268	272.15
V&K Soft	2.18	2.29
VBC Ferro	23	22.35
VST Indus	3430.35	3422.2
Vamshi Rubb	22.6	21.8
Viceroy Hotels	1.31	1.37
VijayTextil	29.95	28
Vimta Labs	102.7	102.9
Virat Crane	20	23.05
Virinchi Con	47.25	48.45
VisakaInd	302.2	312.2
Vision Tech	1.02	0.98
Vista Pharma	9	8.99
Vivimed Labs	15.95	16
ZenoTech Lab	21.45	22.55

మందగమనంలోకి మీడియా!

ఈసారి వృద్ధి 12 శాతానికే పరిమితమయ్యే అవకాశం • కేపీఎంజీ నివేదిక

ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మీడియా, వినోద రంగం వృద్ధి 12 శాతానికి మాత్రమే పరిమితం కావొచ్చని కన్సల్టెన్సీ సంస్థ కేపీఎంజీ ఒక నివేదికలో వెల్లడించింది. డిజిటల్ యూజర్ల సంఖ్య, ప్రాంతీయ కంటెంట్‌కు డిమాండ్ గణనీయంగా పెరగడం తదితర అంశాల కారణంగా గత ఆర్థిక సంవత్సరంలో ఈ రంగం 13 శాతం వృద్ధి చెంది రూ. 1,63,100 కోట్లకు చేరింది. తాజాగా టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ జారీ చేసిన కొత్త టారిఫ్ ఆర్డర్ల వల్ల అనిశ్చితి తలెత్తడం, ఆర్థిక మందగమన సూచనలు గానీ లేకపోయిన పక్షంలో ఈ ఆర్థిక సంవత్సరంలో పరిశ్రమ వృద్ధి మరో 1-2 శాతం ఎక్కువే నమోదయ్యేదని కేపీఎంజీ తెలిపింది. నియంత్రణ సంస్థ నిబంధనలపరంగా మరిన్ని మార్పులు, చేర్పులు జరగొచ్చన్న అంచనాల నేపథ్యంలో 2019-20లో మీడియా, వినోద పరిశ్రమ కేవలం 12 శాతం వృద్ధి చెంది రూ. 1.88 లక్షల కోట్లకు చేరవచ్చని పేర్కొంది. 'ఏప్రిల్, మే నెలల్లో సార్వత్రిక ఎన్నికలు, క్రికెట్ వరల్డ్ కప్ సందర్భంగా ప్రకటనలపై భారీగా వ్యయాలు నమోదయ్యాయి. అవే గానీ లేకపోతే ఈ వృద్ధి మరింత తక్కువ స్థాయిలో నమోదయ్యే అవకాశం ఉంది' అని కేపీఎంజీ తెలిపింది. గత ఆర్థిక సంవత్సరంలో ట్రాయ్ టారిఫ్ ఆర్డరు ప్రభావం కోసం మార్కెటర్లు వేచి చూసే ధోరణిని ఎంచుకోవడంతో టీవీ విభాగం ఆదాయం కేవలం 9.5 శాతం మాత్రమే వృద్ధి చెందింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్/100కు రూ.లలో) 21-08-2019

విశాఖ	361-00
చిత్తూరు	358-00
వరంగల్	344-00
చెన్నై	365-00
ముంబై	395-00
విజయవాడ	348-00
నమక్కల్	368-00
గోదావరి	343-00
20-08-2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	341-00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.00
బెంగళూరు	355-00
కోల్‌కత్త	370-00
ఢిల్లీ	342-00

ఎన్ఎస్ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ADANI PORT	354.95	357.4
ASIAN PAINT	1595.15	1586.45
AXIS BANK L	672.35	685
BAJAJ AUTO	2742.95	2725.5
BAJAJ FINSE	7236.15	7376.65
BAJAJ FINAN	3294.1	3328.05
BHARTI AIRT	358.05	361
BPCL	342.25	347
BRITANNIA I	2393.5	2478.4
CIPLA LTD	478.7	475.85
COAL INDIA	195.3	198.95
EICHER MOTO	15895.75	16337.7
GAIL (INDIA)	127.35	127.3
GRASIM INDU	729.25	732.35
HCL TECHNOL	1084	1064.05
HDFC LTD	2090.1	2114.05
HDFC BANK L	2220.6	2206.85
HERO MOTOCO	2669.25	2631.5
HINDALCO I	179.4	181.15
HUL	1843.4	1820.9
INDIABULLS	521.4	536.85
ICICI BANK	416.9	423.4
INDUSIND BA	1404.85	1442.5
BHARTI INFR	255.55	255.3
INFOSYS LIM	792.75	777.65
INDIAN OIL	124.2	125.8
ITC LTD	246.5	251.55
JSW STEEL L	224.85	226.2
KOTAK MAHIN	1505.1	1496.35
LARSEN & T	1342.5	1352.2
MAHINDRA &M	527.8	520.55
MARUTI SUZU	6190.95	5982.55
NTPC LTD	117.95	118.9
ONGC	125.05	126.3
POWER GRID	206.05	207.05
RIL	1275.95	1292.6
SBI

స్వీట్ బాక్సుల్లో రూ.1.48 కోట్లు

విమానాశ్రయంలో పట్టుబడిన విదేశీ కరెన్సీ

సాక్షి, హైదరాబాద్: అక్రమంగా రవాణా చేస్తున్న దుబాయ్ కరెన్సీని డైరెక్టర్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కరెన్సీని రవాణా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేశారు. విదేశీ కరెన్సీ అక్రమ రవాణాపై విశ్వసనీయ సమాచారం అందడంతో డీఆర్ఐ అధికారులు సోమవారం రాత్రి శంషాబాద్ విమానాశ్రయంలో తనిఖీలు నిర్వహించారు. దుబాయ్ నుంచి వచ్చిన ఓ ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి లగేజీ అడుగు భాగంలో ఉన్న మిఠాయి బాక్సుల్లో 3,50,000 సౌదీ రియాల్స్ లభించాయి. ఎయిరిండియా ఏఐ-951 విమానం నుంచి దిగిన మరో ప్రయాణికుడిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అతడి లగేజీలో ఉస్మానియా బిస్కెట్‌లతో ఉన్న బాక్సుల్లో 3,50,000 సౌదీ రియాల్స్ లభించాయి. భారత కరెన్సీలో వీటి విలువ రూ.1,48,75,000గా ఉంటుందని అధికారులు వెల్లడించారు. వీరిద్దరూ ప్రభుత్వ అనుమతి లేని డీలర్ల ద్వారా ఈ మొత్తాన్ని దుబాయ్‌కు తీసుకెళ్లేందుకు యత్నిస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. ఫెమా నిబంధనలకు విరుద్ధంగా విదేశీ కరెన్సీని తరలిస్తున్నందుకు వీరిని అరెస్ట్ చేశామని, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

చరిత్ర ఆనవాళ్లకు ప్రతిరూపాలైన కట్టడాలు కనుమరుగవుతున్నాయి. శిథిలావస్థకు చేరుతున్న పురాతన కట్టడాలను పరిరక్షించడంలో పురావస్తు శాఖ కినుక వహిస్తోందనేందుకు ఈ ఫొటోనే నిలువెత్తు నిదర్శనం. సూర్యాపేట జిల్లాలో ఉన్న ఏకైక వీరభద్ర స్వామి ఆలయం ఇది. మూసీ నది ఒడ్డున నాగులపహాడ్‌లో ఉన్న ఈ అపురూపమైన కట్టడాన్ని కాకతీయుల కాలంలో నిర్మించారు. దీని నిర్వహణను పట్టించుకునే నాథుడే లేకపోవడంతో ఇక్కడి కట్టడాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

–అనమాల యాకయ్య, సాక్షి ఫొటోగ్రాఫర్, సూర్యాపేట

10 పైసల విలువ.. తెలిసొచ్చిన వేళ!

అమెరికాలోని షికాగోలో ఓ వస్తువు వేలం పాట జరుగుతోంది.. అందరూ ఆ వస్తువును దక్కించుకోవాలని తాపత్రయపడుతున్నారు. అందులో యుటా రాష్ట్రానికి చెందిన ఒక పెద్దాయన అందరి కన్నా ఎక్కువ.. దాదాపు రూ.9.5 కోట్లు వేలం పాట పాడి ఆ వస్తువును దక్కించుకున్నాడు. అమ్మో అంత మొత్తంతో దక్కించుకున్న ఆ వస్తువు ఏమై ఉంటుందనే కదా మీ ఉత్కంఠ.. అది పది పైసల బిళ్ల. ఏంటీ.. పది పైసల బిళ్లను అన్ని కోట్లు పెట్టి కొనుక్కున్నాడా.. అతడికేమైనా పిచ్చి పట్టిందా.. అని తిట్టుకోకండి. ఎందుకంటే ఆ పదిపైసల బిళ్ల చాలా విలువైంది. ఆ బిళ్లను డైమ్ అంటారు.. అమెరికాలో పది సెంట్ల విలువ.. ఒక్క డాలరులో పదో వంతు దీని విలువ ఉంటుంది. అంటే రూపాయిలో పదో వంతన్నమాట. అయితే ఈ డైమ్ నాణేన్ని 1894లో ముద్రించారు. ఇప్పటివరకు ఇలాంటి నాణేలను 24 మాత్రమే ముద్రించారట. అందులో ఇప్పుడు 9 మాత్రమే మిగిలి ఉన్నాయి. దీన్ని బార్బర్ డైమ్ అని పిలుస్తారు. ఎందుకంటే ఈ నాణెం డిజైన్‌ను చార్లెస్ ఇ.బార్బర్ రూపొందించారు. దీన్ని 1894 జూన్ 9న శాన్‌ఫ్రాన్సిస్కోలో ముద్రించారు. ఇప్పుడు దీన్ని డెల్ లాయ్ హాన్సెన్ అనే రియల్ ఎస్టేట్ వ్యాపారి రూ.9 కోట్లు వెచ్చించి తీసుకున్నాడు. ఇతడికి నాణేలను సేకరించడం అంటే అదో తుత్తి.

'రూప్‌కుండ్' మిస్టరీ వీడింది!

- 500 అస్థి పంజరాల్లో మూడు ప్రాంతాల జన్యువులు
- ప్రహేళికను ఛేదించిన సీసీఎంబీ శాస్త్రవేత్తలు
- జన్యు సాంకేతికతకు ఇది అద్భుత తార్కాణం: సీసీఎంబీ డైరెక్టర్ మిశ్రా

సాక్షి, హైదరాబాద్: ఎట్టకేలకు దశాబ్దాల మిస్టరీకి తెరపడింది. హిమాలయాల్లో సముద్రమట్టానికి సుమారు ఐదు వేల మీటర్ల ఎత్తున ఉన్న రూప్‌కుండ్ సరస్సు వద్ద లభించిన అస్థిపంజరాలు ఏ దేశం వారివో తెలిసింది. హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) నేతృత్వంలోని అంతర్జాతీయ శాస్త్రవేత్తల బృందం జరిపిన పరిశోధనల ద్వారా ఈ అస్థిపంజరాలు గ్రీకు లాంటి మధ్యధరా ప్రాంతానికి చెందిన వారివని తెలిసింది. వీరితోపాటు రూప్‌కుండ్ సరస్సు ప్రాంతంలో లభించిన ఇతర ఎముకలు భారతీయ, ఆగ్నేయాసియా ప్రాంత ప్రజలకు చెందినవని, జన్యు పరిశోధనల ద్వారా తాము ఈ విషయాన్ని నిర్ధారించామని ఈ పరిశోధనకు నేతృత్వం వహించిన సీసీఎంబీ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.తంగరాజ్ తెలిపారు. నేచర్ కమ్యూనికేషన్స్ తాజా సంచికలో పరిశోధన వివరాలు ప్రచురితమైన సందర్భంగా సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా, తంగరాజ్‌లు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. 1956లో తొలిసారి గుర్తించిన ప్పటి నుంచి మిస్టరీగా ఉండిపోయిన రూప్‌కుండ్ సరస్సు అస్థిపంజరాల వివరాలు అందించారు.

ఇదీ నేపథ్యం...

1956లో భారతీయ పురాతత్వ శాస్త్రవేత్తలు కొందరు రూప్‌కుండ్ సరస్సు వద్ద సుమారు 500 అస్థిపంజరాలు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని తొలిసారి గుర్తించారు. వీరు ఎవరు? ఎక్కడి వారు? సరస్సు వద్ద ఎందుకు మరణించారు? అన్న విషయాలు మాత్రం తెలియలేదు. జొరావ్‌సింగ్ అనే సైనికాధికారి 1841 ప్రాంతంలో దండయాత్రకు వెళుతూ రూప్‌కుండ్ వద్ద మరణించి ఉండవచ్చునని ఒక కథనం ఉండగా... కనౌజ్ ప్రాంత రాజు, రాణి తమ అనుచర బృందంతో నందాదేవి ఆలయానికి వెళుతూ మార్గమధ్యంలో ఏదైనా ప్రకృతి వైపరీత్యానికి బలై ఉండవచ్చునని కొందరు అంచనా వేశారు. వీళ్లంతా టిబెట్‌వైపు ప్రయాణిస్తున్న వ్యాపారులని, ఏదో అంతుచిక్కని వ్యాధి బారిన పడి మరణించి ఉండవచ్చునని, లేదా మత విశ్వాసాల కారణంగా మూకుమ్మడి ఆత్మహత్యలకు పాల్పడి ఉండవచ్చునని అప్పట్లో కొన్ని ఊహాగానాలు వచ్చాయి. అయితే వాస్తవం ఏమిటన్నది మాత్రం నిర్ధారణ కాలేదు.

సీసీఎంబీ పరిశోధన...

రూప్‌కుండ్ సరస్సు మిస్టరీని ఛేదించేందుకు సీసీఎంబీ 2005లో ప్రయత్నాలు మొదలుపెట్టింది. అత్యంత పురాతనమైన డీఎన్ఏను వేరు చేసేందుకు ప్రత్యేకమైన విభాగాన్ని ఏర్పాటుచేసి సీసీఎంబీ మాజీ డైరెక్టర్ డాక్టర్ లాల్జీసింగ్, డాక్టర్ తంగరాజ్‌లు పరిశోధనలు ప్రారంభించారు. లాల్జీసింగ్ ఇటీవలే మరణించగా, అంతర్జాతీయ శాస్త్రవేత్తల సహకారంతో తంగరాజ్ ఈ పరిశోధనలను కొనసాగించారు. రూప్‌కుండ్ వద్ద లభించిన సుమారు 71 మంది ఎముకల ద్వారా తల్లి నుంచి మాత్రమే సంక్రమించే మైటోకాండ్రియల్ డీఎన్ఏను, కేంద్రక జన్యుక్రమాన్ని విశ్లేషించారు. ప్రపంచవ్యాప్తంగా లభించిన పురాతన మానవ జన్యుక్రమాలతో పోల్చినప్పుడు రూప్‌కుండ్ వద్ద అస్థికలు స్థూలంగా మూడు వర్గాల ప్రజలవని స్పష్టమైంది. భారతీయులతో సరిపోలగల జన్యుక్రమం ఉన్నవారు క్రీస్తు శకం 700-900 మధ్యకాలంలో రూప్‌కుండ్ వద్ద మరణించగా, గ్రీక్ దాని సమీపంలోని క్రెటే ప్రాంత ప్రజల జన్యువులను పోలిన వారు 17-19 శతాబ్దాల మధ్య మరణించినట్లు తెలిసింది. కాకపోతే క్రెటే ప్రాంత జన్యువులని పోలిన వారు ఒకేసారి మరణానికి గురికాగా, భారతీయులుగా భావిస్తున్న వారు వేర్వేరు సమయాల్లో ప్రాణాలు కోల్పోయారు. వీరిద్దరితోపాటు మలేసియా, వియత్నాం వంటి ఆగ్నేయాసియా ప్రాంత ప్రజలని చెప్పదగ్గ జన్యుక్రమాలు కూడా కొన్ని ఎముకల్లో గుర్తించారు. ఉనికిపై రకరకాల అంచనాలు ఉన్నప్పటికీ అందుబాటులో ఉన్న రుజువులను బట్టి చూస్తే వీరు నందాదేవి దర్శనానికి వెళుతున్న వారు గానీ, వ్యాపారులుగానీ అయ్యేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని తంగరాజ్ తెలిపారు. అత్యాధునిక జన్యుటెక్నాలజీ ద్వారా సాధించగల అద్భుతాలకు ఇదో తార్కాణమని సీసీఎంబీ డైరెక్టర్ డాక్టర్ రాకేశ్ మిశ్రా అభివర్ణించారు.

'మల్లన్నసాగర్' ధిక్కారంలో ఇద్దరు అధికారులకు జైలు

సాక్షి, హైదరాబాద్: మల్లన్నసాగర్ రిజర్వాయర్ కోసం భూసేకరణ విషయంలో కోర్టు ఆదేశాల్ని ధిక్కరించారనే ఆరోపణల కేసులో ఇద్దరు అధికారులకు హైకోర్టు జైలు శిక్ష విధించింది. గజ్వేల్ ఆర్డీవో డి.విజయేంద్రరెడ్డి, కొండపాక తహసీల్దార్ బి.ప్రభులకు రెండు నెలల చొప్పున జైలు శిక్ష, రూ.2వేల చొప్పున జరిమానా విధిస్తూ మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎమ్మెస్ రామచంద్రరావు తీర్పు వెలువరించారు. దీనిపై అప్పీల్ చేసుకునేందుకు వీలుగా శిక్ష అమలును ఆరు వారాల పాటు నిలిపివేస్తున్నట్లు ప్రకటించారు. హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు తప్పు అని అధికారులు నిర్ణయించడం.. కోర్టు ధిక్కారంగానే పరిగణించాల్సి వస్తుందని స్పష్టంచేశారు. కోర్టు ఆదేశాల్ని పరిగణనలోకి తీసుకోవాల్సిన అవసరం లేదనడానికి అధికారులేమైనా హైకోర్టుకు అప్పిలేట్ అథారిటీ అనుకుంటున్నారా? అని తప్పుబట్టారు. పునరావాసం, పరిహారం చెల్లించలేదని పేర్కొంటూ నారాయణ

రెడ్డి ఇతరులు దాఖలు చేసిన కేసులో హైకోర్టు గతంలో ఉత్తర్వులు జారీ చేసింది. పరిహారం, పునరావాస చర్యలు తీసుకున్నాకే భూముల్ని స్వాధీనం చేసుకోవాలని, అప్పటి వరకూ భూముల విషయంలో జోక్యం చేసుకోరాదని 2018 అక్టోబర్‌లో ఇచ్చిన ఉత్తర్వుల్ని అధికారులు ఖాతరు చేయలేదు. దీంతో పిటిషనర్లు అధికారులపై కోర్టు ధిక్కార రిట్ పిటిషన్ దాఖలు చేశారు. రైతుల భూముల్లోని చెట్లను కొట్టేశారని, హైకోర్టు ఆదేశాల్ని అమలు చేయలేదని వారి తరపు న్యాయవాది రచనారెడ్డి వాదించారు. పరిహారం పొందేందుకే వారు అర్హులు కాదని ప్రభుత్వ న్యాయవాది వాదించారు.

మిస్టరీగా మారిన కారు ప్రమాదం

కారులో హీరో రాజ్‌తరుణ్ ఉన్నారంటున్న స్థానికులు

హైదరాబాద్: నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని అల్కాపురి కాలనీలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదం మిస్టరీగా మారింది. వేగంగా దూసుకొచ్చిన ఓ వోల్వో కారు డివైడర్‌ను ఢీకొట్టి పక్కనే ఉన్న పిట్టగోడను ఢీకొని ఆగిపోయింది. ఈ సంఘటన జరిగిన సమయంలో కారులో ప్రముఖ సినీ నటుడు రాజ్‌తరుణ్ ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. సీసీటీవీ ఫుటేజీలో సైతం ఆ సినీ నటుడి పోలికలు ఉన్న వ్యక్తి ఉండటంతో ఈ కేసు మరింత ఆసక్తిగా మారింది.

నార్సింగి పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. అల్కాపురి కాలనీ గుండా సోమవారం రాత్రి టీఎస్ 09 ఈఎక్స్ 1100 కారు వేగంగా దూసుకొచ్చి డివైడర్‌ను ఢీకొట్టింది. అనంతరం రోడ్డు పక్కన ఉన్న పిట్టగోడను ఢీకొట్టి ఖాళీ స్థలంలో ఆగిపోయింది. ఈ ఘటనలో కారు ధ్వంసం కాగా, కారులో ఉన్న యువకుడు కిందకు దిగి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ రోడ్డు దాటి వెళ్లిపోయాడు. ఈ పూర్తి సంఘటన స్థానికంగా ఉన్న సీసీ కెమెరాల్లో నిక్షిప్తమైంది. సంఘటన సమ యంలో రాజ్‌తరుణ్ కారులో ఉన్నారని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై నార్సింగి పోలీసులు మాత్రం ఎలాంటి స్పష్టమైన సమాచారాన్ని ఇవ్వడం లేదు. ప్రస్తుతం విచారిస్తున్నామని చెబుతున్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని స్పష్టం చేశారు. కారు నంబర్ ఆధారంగా స్కేజోన్ యజమానికి సమాచారం అందించామని చెప్పారు. యజమాని అనుచరుడు ఫోన్‌లో సంప్రదించాడని, కానీ ఎలాంటి సమాచారాన్ని అందించలేదన్నారు.

TATA MOTORS
Connecting Aspirations
TATA

3 YEARS FULL CHEERS

ఈ పండుగ సీజన్
మీ కారును 3 సంవత్సరాలు ఉచితంగా నడపండి*

- 3 సంవత్సరాలు వారంటీ ఉచితం*
- 3 సంవత్సరాలు మెయింటెనెన్స్ ఉచితం*
- 3 సంవత్సరాలు రోడ్ సైడ్ అసిస్టెన్స్ ఉచితం*

PLUS

₹ 1,07,000 వరకు లాభాలు
పరిమిత స్టాకుపై*
+
ఎక్స్‌ప్రెస్ ఫైనాన్స్ స్కీమ్*
+
100% వరకు
ఆన్-రోడ్ ఫైనాన్స్ లభ్యం*

మోడల్స్	Hexa	Nexon	Tiago	Tigor
ఎక్స్-షోరూం ధర (₹ లక్షల నుండి)	₹13.26*	₹6.72*	₹4.49*	₹5.59*
అత్యధిక లాభాలు (వరకు)	₹107,000*	₹77,900*	₹75,900*	₹97,600*

To know more, visit http://drivethefuture.tatamotors.com | Toll-free number: 18002098282 | /tatamotorsgroup | /tatamotors

Images and illustrations are indicative and for information purposes only. All features/specifications are not available in all variants and may vary for different variants. Specifications/features subject to change without prior information. Please consult an authorized Tata Motors dealer for latest information on features/specifications before deciding to place an order. Colours may not match the actual colours due to printing limitations. Harman and Android are registered trademarks. Local taxes and octroi extra. Terms and conditions apply. Avail Tata Motors Finance and get funding benefits on Extended Warranty. 333 offer disclaimers: 3 Year/75000 km warranty, 3 year roadside assistance, 3 year /40000 km scheduled maintenance. AMC details can be referred on website and at dealership. The offer is at sole discretion of Tata Motors and terms of AMC can be changed by Tata Motors without any prior notice. Benefits up to Rs. 50,000 on select stocks. Offer available till stocks last. Win exciting gifts with festive scratch card. Express Finance scheme from Tata Motors Finance/Low DP scheme from select financiers. Benefits include cash discount, exchange bonus, corporate discount and any other applicable offer. Price is ex-showroom Hyderabad.

TRUST OF INDIA SPECIAL OFFERS FOR GOVERNMENT EMPLOYEES
TATA MOTORS ASSURED

STAR MOTORS: Nalgonda, Miryalguda, Suryapet: 7303762953

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792

epaper.sakshi.com